ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 20.09.2026 | సంపుటి :13 సంచిక : 61 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
జనంసాక్షి tv

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ఇది కాలం తెచ్చిన కరవు కాదు..

## కాంగ్రెస్ తెచ్చిన కరవు

**హరీశ్‌రావు**

హైదరాబాద్(జనంసాక్షి): కృష్ణా జలాల్లో మన వాటా వాడుకోవడంలో తెలంగాణ పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మిగతా 2లో..



పార్టీ ఫిరాయింపులకు

## తెరలేపింది కేసీఆరే..

**మహేశ్‌కుమార్ గౌడ్**

హైదరాబాద్(జనంసాక్షి): దానం నాగేందర్ విషయంలో కోర్టు తీర్పు బీఆర్ఎస్, కేసీఆర్‌కి చెంపపెట్టు లాంటిదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మిగతా 2లో..

# డిజిటల్ ఇండియాకు బ్రేక్







## నగదు మాత్రమే తీసుకోబడును

### త్వరలో అమల్లోకి మార్చంట్ డిస్కౌంట్ రేట్

**ఒకప్పుడు చిల్లర సమస్యకు పరిష్కారంగా, ఇప్పుడు ప్రతి చిన్న లావాదేవీకీ సౌకర్యవంతమైన మార్గంగా మారిన యూపీఐ చెల్లింపులకు కొందరు వ్యాపారులు దూరంగా ఉంటున్నారు. ఢిల్లీ శివార్లలోని ఘజియాబాద్ తదితర ప్రాంతాల్లో 'నగదు మాత్రమే స్వీకరిస్తాం.. యూపీఐ చెల్లింపులు అంగీకరించం' అంటూ బోర్డులు ఏర్పాటు చేస్తున్న దృశ్యాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు విస్తరిస్తున్న సమయంలో, నగదు లావాదేవీలకు ప్రాధాన్యం ఇస్తున్న ఈ ధోరణి వెనుక కారణాలపై ఆసక్తి నెలకొంది.**

- ఢిల్లీ వాణిజ్య సముదాయాల్లో వెలిసిన బోర్డులు
- పెట్రోల్ పంప్ నిర్వాహకులు అభ్యంతరం
- మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో వాహనదారులకు హెచ్చరిక

హైదరాబాద్(జనంసాక్షి): ఈ పరిణామానికి ప్రధాన కారణం యూపీఐ చెల్లింపులపై అమలులోకి రానున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్. అక్టోబర్ 15 నుంచి నిర్దిష్ట నిబంధనల కింద 2,000కు మించిన వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం రుసుము విధించే ప్రతిపాదనపై వ్యాపార వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యాపారుల వాదన ప్రకారం, ఇప్పటికే తక్కువ లాభాలతో నడుస్తున్న దుకాణాలకు ఈ అదనపు వ్యయం భారంగా మారవచ్చు. ముఖ్యంగా నగలు, దుస్తులు, ఇతర అధిక విలువైన వస్తువుల కొనుగోళ్లలో నగదు చెల్లింపుల వైపు కస్టమర్లను మళ్లించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని వారు ఆందోళన చెందుతున్నారు.

**ప్రభుత్వం చెబుతున్నదేమిటి?**

యూపీఐపై రుసుముల విషయంలో ప్రభుత్వం, ఎన్‌పీసీఐ వివరణ ప్రకారం, ప్రతి డిజిటల్ చెల్లింపుపైనా వినియోగదారుల నుంచి డబ్బు వసూలు చేయడం లేదని స్పష్టం చేసింది. రూ. 2వేల వరకు జరిగే యూపీఐ వ్యాపార లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని తెలిపింది. అలాగే, చిన్న వ్యాపారులకు కొన్ని మినహాయింపులు ఉన్నాయి. అర్హత కలిగిన చిన్న వ్యాపారుల ఖాతాలకు ఈ రుసుము వర్తించదు. అయితే, అధిక విలువైన లావాదేవీలపై రుసుముల విధానం అమలులోకి రాకముందే వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేయడం చర్చకు దారి తీసింది. వినియోగదారులపై అదనపు భారం పడకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత సంస్థలపై ఉందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

**డిజిటల్ చెల్లింపులకు ఎదురుదెబ్బేనా?**

యూపీఐ ద్వారా చెల్లింపులు చేయడం ప్రజల రోజువారీ జీవితంలో భాగమైపోయింది. చేతిలో నగదు లేకపోయినా కొనుగోళ్లు చేసే సౌకర్యం, లావాదేవీల రికార్డు ఉండటం, చెల్లింపుల వేగం వంటి ప్రయోజనాలు యూపీఐకి ఆదరణ పెంచాయి. ఇలాంటి పరిస్థితుల్లో వ్యాపారులు నగదు చెల్లింపులకే ప్రాధాన్యం ఇస్తే, వినియోగదారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేసే వారు నగదు మిగతా 2లో..

# అభివృద్ధికి గేట్‌వే వరంగల్ ఏయిర్‌పోర్టు

### చక్కటి పేరును సూచించండి

- అభివృద్ధి చెందుతున్న, అనుసంధానించబడిన
- తెలంగాణకు కొత్త చిహ్నంగా నిలవనున్న విమానాశ్రయం
- ఇక్కడి నుంచి నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా..
- గత పాలకులు కుటుంబ ప్రయోజనాలు తప్ప అభివృద్ధిపై దృష్టి సారించలేదు: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):వరంగల్ ఎయిర్ పోర్టుకు పేరు సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వం కృషితో వరంగల్ విమానాశ్రయం కల సాకారం కాబోతోందన్నారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారు తప్ప.. వరంగల్ విమానాశ్రయం సాధించటంపై దృష్టి సారించలేదని విమర్శించారు. విమానాశ్రయం భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 295 కోట్లు కేటాయించడంతో పాటు.. అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల రూపుదిద్దుకుంటోందన్నారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని.. పరిశ్రమలు, పర్యాటకం, విద్య, మిగతా 2లో..



## సుప్రీం తలుపుతట్టిన దానం నాగేందర్



**హైకోర్టు ఇచ్చిన తీర్పుపై దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఎస్ఎల్‌పీ .. కెవియట్ దాఖలు చేసిన బీజేపీ**

హైదరాబాద్(జనంసాక్షి): హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు అనుమతిస్తుందా? లేదా? అనేది వేచిచూడాల్సి ఉంది. సర్వోన్నత న్యాయస్థానం ఎప్పుడు విచారణకు స్వీకరిస్తుందనే విషయంపైనా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ దానం నాగేందర్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించి అప్పీలు దాఖలుకు అనుమతిస్తే.. హైకోర్టు తీర్పుపై దానం నాగేందర్ అప్పీలు చేసే అవకాశం ఉంటుంది. ఇదే కేసులో ఇప్పటికే భాజపా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కేవియట్ దాఖలు చేశారు. భారాస తరఫున ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన మిగతా 2లో..

# నా బిడ్డల ఉద్యోగాల కోసం..

## నా వ్యక్తిగత శ్రద్ధతో జాబ్‌మేళా

### గ్రామీణ యువతకు ఉద్యోగాలే లక్ష్యం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



- యువత ఏఐకి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి
- వారు ఉద్యోగార్థులుగా కాకుండా ఉపాధి ప్రదాతలుగా ఎదగాలి
- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్
- కోదాడలో త్వరలో టాస్క్ కేంద్రం : మంత్రి శ్రీధర్‌బాబు

కోదాడ, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంత ప్రజలు మూడున్నర దశాబ్దాలుగా తనను, తన సతీమణి పద్మావతి రెడ్డిని గుండెల్లో పెట్టుకుని ఎమ్మెల్యేలుగా గెలిపించారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రజల రుణం తీర్చుకునేందుకు గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేశామని తెలిపారు. శనివారం కోదాడ సీసీ రెడ్డి విద్యానిలయంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. 350 కంపెనీలు.. 30 వేలకుపైగా నమోదు. జాబ్‌మేళాకు 350 కంపెనీలు హాజరు కాగా, 30 వేలకు పైగా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని మంత్రి తెలిపారు. 5,625 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రముఖ కంపెనీలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు సంస్థలను మేళాకు ఆహ్వానించామని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు మిగతా 2లో..



జన్వాడ ఫాంహౌజ్ వద్ద కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల

## హల్చల్

కూల్చేయాలని హైడ్రా,మున్సిపల్ కమిషనర్లతో సంప్రదింపులు

రంగారెడ్డి(జనంసాక్షి):జన్వాడ ఫామ్‌హౌస్ భూములను కాంగ్రెస్ బృందం పరిశీలించింది. కేటీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు బీఆర్ఎస్ శ్రేణులు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. జన్వాడ భూములపై మిగతా 2లో..

## ఎర్రవల్లి భూముల సర్వేలో కీలక మలుపు

2లో..

**ఈ భూముల్లో తమకూ వాటా ఉందంటూ ఆందోళనకు దిగిన వెంకటాపూర్ గ్రామస్థులు**

# ఒక్క ఎకరా.. అక్రమభూమిలేదు

### కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా దక్కే వరకు ఊరుకోం

- ఏపీకి నీళ్లు వెళ్తున్నా తెలంగాణ సాగునీరు ఇవ్వడం లేదు
- గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- 'ఆలమట్టి' ఎత్తు పెంచే ప్రతిపాదనలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించాలి
- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

వనపర్తి బ్యూరో/పెబ్బేరు సెప్టెంబర్ 19 (జనంసాక్షి): ప్రకృతి సమృద్ధిగా నీటిని అందిస్తున్నా తెలంగాణ రైతులకు సాగునీరు అందడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.టి.రామారావు (కేటీఆర్) ఆరోపించారు. వనపర్తి నియోజకవర్గంలోని పెబ్బేరు పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు విమర్శలు చేశారు. రైతులు విద్యుత్, సాగునీటి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని కేటీఆర్ తెలిపారు. ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని, లో-వోల్టేజ్, తరచూ విద్యుత్ కోతలతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు చెబుతున్నారని అన్నారు. నీరు, విద్యుత్ అందుబాటులో మిగతా 2లో..






## హెచ్-1బీ వీసా మరింత కఠినం

**ఫీజు విషయంలో ట్రంప్ కీలక చర్యలు**


వాషింగ్టన్(జనంసాక్షి): హెచ్-1బీ వీసా దరఖాస్తులపై విధించిన లక్ష డాలర్ల ఫీజు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠిన వైఖరి ప్రదర్శిస్తున్నారు. ఈ వీసాల ద్వారా విదేశీ ఉద్యోగులను నియమించుకునే సంస్థల నుంచి మరో ఏడాదిపాటు ఫీజు వసూలు చేసేలా ఆదేశాలు ఇచ్చారు. తాజాగా దీనికి సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకాలు చేశారు. సాధారణంగా ఈ వీసా దరఖాస్తుల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి మిగతా 2లో..

ఒక వ్యవస్థ చేతిలో

# బందీగా దేశం

- విద్యార్థులు ప్రశ్నించడం వారికి ఇష్టం లేదు
- పశ్నిస్తున్నందుకే వారిని భయాందోళనలకు గురిచేస్తున్నారు
- ఛాత్రోం కీ గూంజ్ ప్రచారంలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్(జనంసాక్షి): దేశమంతా ఓ సిస్టమ్ చేతిలో బందీగా ఉందని, విద్యార్థులు ప్రశ్నలు అడగడం కూడా ఆ వ్యవస్థకు ఏ మాత్రం ఇష్టం లేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శనివారం రోజు మధ్యప్రదేశ్ ఇండోర్‌లో నిర్వహించిన ఛాత్రోం కీ గూంజ్ (విద్యార్థుల గొంతుక) కార్యక్రమంలో ఆయన విద్యార్థుల సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, మిగతా 2లో..



దేశమంతా ఒక వ్యవస్థ చేతిలో బందీగా మారింది.ఈ వ్యవస్థ వెనుక ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో పాటు పారిశ్రామికవేత్తలు గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీల అనే వ్యక్తులు ఉండి దేశాన్ని శాసిస్తున్నారు. - రాహుల్

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో

# తెలంగాణది కీలక పాత్ర



- 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో
- భారత్ ఫ్యూచర్ సిటీ
- యువతే తెలంగాణకు అతిపెద్ద బలం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ(జనంసాక్షి):వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశం నిర్దేశించుకున్న భారీ ఆర్థిక లక్ష్యాలను సుదూర ఆశయాలుగా కాకుండా, తక్షణ కార్యాచరణ బాధ్యతగా తెలంగాణ భావిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో న్యూఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ దిశగా భారతదేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ' సదస్సులో శనివారం డిప్యూటీ సీఎం ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. దేశం కనీవినీ ఎరుగని స్థాయిలో అభివృద్ధిని సాధించేందుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకుంటూనే, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడం, ఉత్పాదకతను పెంచడం, అభివృద్ధి ఫలాలను ప్రతి పౌరుడికి, ప్రతి ప్రాంతానికి మిగతా 2లో..

కార్బన్ ఉద్గారాలు భారత్ కంటే

# అభివృద్ధి చెందిన దేశాల్లోనే ఎక్కువ

- అభివృద్ధి, స్థిరత్వం రెండూ సమాంతరంగా సాగాలి
- భారత్ స్థిరమైన అభివృద్ధి సాధిస్తోంది
- ఎన్‌జీటీ గ్లోబల్ గ్రీన్ మీట్ సదస్సులో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ(జనంసాక్షి): నేటి ఆధునిక వాతావరణ సవాళ్లకు పరిష్కారాలు అందించే దిశగా భారత్ కృషి చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రకృతి, పర్యావరణానికి సంబంధించిన అంశాలపై శతాబ్దాలుగా భారత్ ప్రపంచానికి మార్గనిర్దేశం చేసిందని ఆయన గుర్తు చేశారు. శనివారం ఢిల్లీలో జరిగిన ఎన్?జీటీ గ్లోబల్ గ్రీన్ మీట్‌లో మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.'ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్' అంతర్జాతీయ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
20.09.2026

## హెచ్-1బీ వీసా మరింత కఠినం

5 వేల డాలర్ల వరకు ఖర్చు కాగా.. గత ఏడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ సర్కార్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసింది. ఆ నిబంధన తీసుకువచ్చి ఏడాది సమయం పూర్తవుతున్న సమయంలో ట్రంప్ ప్రభుత్వం తాజాగా మరో 12 నెలలపాటు ఈ పెంపును పొడిగించింది. 2025లో తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా ఐటీ సేవలను అవుట్‌సోర్సింగ్ ఇస్తున్న కంపెనీల హెచ్-1బీ రిజిస్ట్రేషన్లలో 92 శాతం తగ్గుదల నమోదైందని అమెరికా ప్రభుత్వం పేర్కొన్నది. దాంతో అమెరికన్ కార్మికులు, గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపింది. అత్యంత నైపుణ్యం కలిగిన వారిని మాత్రమే కంపెనీలు నియమించుకునేలా చూడటం తమ ప్రధాన ఉద్దేశమని ట్రంప్ సర్కార్ చెబుతూ వస్తున్నది. అమెరికా హెచ్-1బీ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందుతున్న విదేశీయుల్లో భారతీయులు ముందువరుసలో ఉన్నారు. అమెరికాలో విద్యార్థి వీసాలపై ఉండి హెచ్-1బీ వీసాలకు దరఖాస్తు చేసుకునే వారికి ఈ ఫీజు వర్తించదు. అమెరికా విడిచి వెళ్లకుండా ఇప్పటికే ఉన్న వీసాల స్టేటస్‌ను మార్చుకునేందుకు వచ్చిన దరఖాస్తులకు ఈ ఫీజు నుంచి మినహాయింపు ఉంది. అయితే బయట దేశాల నుంచి వచ్చే దరఖాస్తుదారులు మాత్రం ఈ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఈ లక్ష డాలర్ల రుసుమును అమెరికాలోని 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో సవాలు చేయగా.. ఆ ఫీజు చట్టవిరుద్ధమని తీర్పు వచ్చింది. అయితే ఈ అంశం ఇతర ఫెడరల్ కోర్టుల్లో విచారణ దశలో ఉంది. ఈ ఫీజుపై న్యాయపరమైన చిక్కులు ఉన్నప్పటికీ లక్ష డాలర్ల ఫీజును మరో ఏడాదిపాటు పొడిగిస్తూ ట్రంప్ ఇప్పుడు ఉత్తర్వులు జారీ చేయడం గమనించవలసిన విషయం.

## ఒక వ్యవస్థ చేతిలో బందీగా దేశం

విద్యా వ్యవస్థ, దేశంలోని సంస్థల పనితీరుపైనా మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులే దేశ భవిష్యత్తు అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థుల్లేకుండా ఏ దేశమూ గొప్పగా ఎదగలేదని ఆయన అన్నారు. విద్యార్థులు ప్రశ్నలు అడగడం, వ్యవస్థను ప్రశ్నించడం అనేది ప్రజాస్వామ్యానికి అవసరమని, కానీ అది ఇక్కడ కుదరట్లేదని, వ్యవస్థ వారిని భయపెడుతోందని రాహుల్ ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 10 లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఇంకా సుమారు లక్ష పాఠశాలలు మూతపడ్డాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. మూతపడ్డ పాఠశాలల్లో 55 శాతం ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరత వంటి అంశాలపై విద్యార్థులు ప్రశ్నించాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఆ ఆరుగురే వ్యవస్థను నడిపిస్తున్నారు: రాహుల్ గాంధీ

ఇదే సమయంలో దేశంలోని ప్రస్తుత వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేస్తూ- ఈ వ్యవస్థ వెనుక ఆరుగురు కీలక వ్యక్తులు ఉన్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు రాహుల్ గాంధీ. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో పాటు పారిశ్రామికవేత్తలు గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీల పేర్లను ప్రస్తావిస్తూ వీరే వ్యవస్థను నడిపిస్తున్నారని ఆరోపించారు. ఇక ఛాత్రోం కీ గూంజ్ ప్రచారం ద్వారా కాంగ్రెస్- విద్యార్థులు, యువత సమస్యల్ని తెలుసుకుంటోంది. ముఖ్యంగా పలు పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలు, పేపర్ లీకులు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న ఫీజులు, ఉద్యోగ నియామకాల్లో సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలపై పోరాడుతోంది. ఇప్పటికే కొద్ది నెలలుగా రాహుల్ గాంధీ దేశంలోని పలు నగరాల్లో ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పక్కదారి

### పలు విద్యాసంస్థలపై విజిలెన్స్ తనిఖీలు

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ నగరంలో పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బోగస్ అడ్మిషన్లతో ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలతో అధికారులు సోదాలు చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పక్కదారి పట్టిస్తున్నారని వివిధ కళాశాలలపై ఆరోపణలున్నాయి. దీంతో బయోమెట్రిక్, సిబ్బంది వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పలు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌అధికారుల సోదాలు నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీలో ఈ రోజు ఉదయం నుంచి అధికారులు తనిఖీలు జరుపుతున్నారు. ఈ తనిఖీల్లో విద్యార్థుల వాస్తవ సంఖ్య, కళాశాల రికార్డులు, ప్రవేశాల వివరాలు, స్కాలర్‌షిప్‌లకు సంబం ధించిన డేటా తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

# డిజిటల్ ఇండియాకు బ్రేక్

వెంట తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. మరో వైపు, నగదు నిర్వహణ, భద్రత, లెక్కల నిర్వహణ వంటి అంశాలు కూడా వ్యాపారులకు సవాళ్లుగా మారవచ్చు.

**నగదు బాటలో వ్యాపారులు..**

ఘజియాబాద్‌లో కొందరు వ్యాపారులు ఏర్పాటు చేసిన నగదు చెల్లింపుల బోర్డులు, యూపీఐ రుసుములపై నెలకొన్న ఆందోళనకు ప్రతిబింబంగా కనిపిస్తున్నాయి. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా స్థిరంగా కొనసాగించడంతోపాటు, చిన్న వ్యాపారులు, వినియోగదారులపై అదనపు భారం పడకుండా చూడటం కీలకంగా మారింది. యూపీఐపై కొత్త రుసుముల విధానం అమల్లోకి వచ్చిన తర్వాత వ్యాపారులు, వినియోగదారుల ప్రవర్తనలో ఎలాంటి మార్పులు వస్తాయో వేచి చూడాల్సి ఉంది.

**పెట్రోల్ పంప్ నిర్వాహకుల అభ్యంతరం**

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అక్టోబర్ 15 నుంచి అమలు చేయనున్న నూతన మర్చంట్ డిస్కౌంట్ రేట్ నిబంధనలపై దేశవ్యాప్తంగా పెట్రోల్ పంప్ నిర్వాహకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఫ్రేమ్‌వర్క్ ప్రకారం రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన ఇంధన యూపీఐ లావాదేవీలపై వ్యాపారుల నుంచి 0.4 శాతం ఎమ్‌డీఆర్ చార్జీ వసూలు చేయనున్నారు. ఈ నిర్ణయంపై డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కార్లు, భారీ లారీలు, ట్రక్కులకు ఇంధనం నింపేటప్పుడు రూ. 3,000 నుండి రూ. 10,000 వరకు యూపీఐ చెల్లింపులు జరుగుతాయని, ఈ అదనపు భారాన్ని భరించడం తమ వల్ల కాదని స్పష్టం చేస్తున్నారు. ఇంధనం అత్యవసర సరుకు అయినందున పెట్రోల్ బంకులకు ఎమ్‌డీఆర్ నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలని, లేకపోతే అక్టోబర్ 15 నుంచి రూ. 2,000 పైబడిన ఇంధన కొనుగోళ్లకు యూపీఐ డిజిటల్ చెల్లింపులను నిలిపివేసి, కేవలం నగదు రూపంలో మాత్రమే స్వీకరిస్తామని హెచ్చరిస్తున్నారు. తాజాగా మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో పెట్రోల్ పంప్ డీలర్లు వాహనదారులకు హెచ్చరిక జారీ చేసినట్టు సమాచారం. ఓవైపు నిర్వహణ ఖర్చుల పెరుగుదల, మరోవైపు తగ్గని ముడిచమురు ధరలు నడుమ ఎండీఆర్ పేరిట విధించే ఈ అదనపు ఛార్జీలను తాము భరించలేమని వాపోతున్నారు. ఈ తరుణంలో తాము నగదు చెల్లింపునకే పరిమితం కావడానికి సిద్ధమయ్యామని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది స్పష్టత రావాల్సి ఉంది.

## సుప్రీం తలుపుతట్టిన దానం

దానం నాగేందర్‌పై హైకోర్టు శుక్రవారం అనర్హత వేటు వేసింది. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్‌లను కొట్టివేస్తూ స్పీకర్ వెలువరించిన తీర్పులను రద్దు చేస్తూ హైకోర్టు 91 పేజీల తీర్పు వెలువరించింది. స్పీకర్ తీర్పును రద్దు చేయాలని కోరుతూ భారాస, భాజపాలు దాఖలు చేసిన పిటిషన్‌లను అనుమతించింది. భారాస సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినందున రాజ్యాంగంలోని పదో షెడ్యూలు పేరా 2(1)(ఎ) రెడ్‌విత్ 191(2) ప్రకారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలంది. ఈ ఉత్తర్వుల ప్రతిని స్పీకర్ కార్యదర్శికి, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

## కార్బన్ ఉద్గారాలు భారత్ కంటే అభివృద్ధి చెందిన దేశాల్లోనే ఎక్కువ

ఎన్‌జీటీ మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "ప్రకృతి, పర్యావరణం విషయంలో శతాబ్దాలుగా భారతదేశం ఈ ప్రపంచానికి మార్గనిర్దేశం చేసింది. ఆ సైద్ధాంతిక నిబద్ధతను ముందుకు తీసుకెళ్తూ, మన గొప్ప సాంస్కృతిక అనుభవాలను పునాదిగా చేసుకొని, భారతదేశం ఇప్పుడు ఆధునిక వాతావరణ సవాళ్లకు పరిష్కారాలు అందిస్తోంది. కర్బన ఉద్గారాల విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలను తరచుగా అన్యాయంగా నిందిస్తున్నారు. గ్లోబల్ సౌత్ నుంచి నా సహచరులు, మిత్రులు చాలా మంది ఈ రోజు ఇక్కడ కూర్చున్నారు. చారిత్రక వాస్తవం ఏమిటంటే, ఈ రోజు కూడా తలసరి కర్బన ఉద్గారాల విషయంలో భారతదేశం వాటా ప్రపంచ సగటులో సగం కంటే తక్కువగా ఉంది. ఇదే సమయంలో అభివృద్ధి చెందిన దేశాల్లో తలసరి కర్బన ఉద్గారాలు భారత్ కంటే ఆరు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. భారత్? ఈ విషయాన్ని ప్రపంచ వేదికలపై నిలకడగా, దృఢ విశ్వాసంతో స్పష్టంగా చెబుతోంది. ప్రతి భారతీయుడు కూడా ఇదే దృఢ సంకల్పాన్ని ప్రదర్శించాలని నేను కోరుతున్నాను" అని మోదీ అన్నారు. "గత 12 ఏళ్లలో పర్యావరణానికి సంబంధించిన ప్రతి రంగంలోనూ, ప్రతి విభాగంలోనూ భారత్? గణనీయమైన పురోగతి సాధించింది. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధనంపై దృష్టి సారించాం. పారిస్ నిబంధనలకు అనుగుణంగా వాతావరణ కాలుష్యం జరగకుండా ముందుగానే తగు చర్యలు తీసుకున్నాం. అంతేకాదు పారిస్‌లో జరిగిన కాప్-21 సదస్సులో చేసిన నిబంధనలను, కట్టుబాట్లను గడువు కంటే ముందుగానే నెరవేర్చిన జీ-20లోని ఏకైక దేశంగా భారత్ నిలిచింది. ఇదే నూతన భారతదేశ శక్తి. శిలాజేతర ఇంధనాలు, సౌరశక్తి సామర్థ్యం, కర్బన ఉద్గారాల నియంత్రణల్లోనూ భారత్ పురోగతి సాధించింది" అని మోదీ పేర్కొన్నారు. భారతదేశం హైడ్రోజన్ ఆధారిత రవాణాను అభివృద్ధి చేస్తోంది ఈ సందర్భంగా ప్రధాని మోదీ తెలిపారు. దేశంలో ఇప్పటికే హైడ్రోజన్ రైలు ప్రారంభించిన విషయాన్ని ఆయన ప్రత్యేకంగా గుర్తుచేశారు. ఇక దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వృద్ధిని కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

## అభివృద్ధికి గేట్‌వే వరంగల్ ఏయిర్‌పోర్టు

ఉద్యోగాలు, పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని సీఎం అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానించబడిన తెలంగాణకు కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన దశలను దాటుకొని నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే రెండు ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే. విమానాశ్రయం నిర్మాణాలు జరిగే ప్రాంగణం 953 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణం తొలి ప్యాకేజీలో చేపట్టనున్నారు. రన్‌వే, ఆవరణలో పార్కింగ్, సీవరేజ్ వ్యవస్థ నిర్మాణ పనులను రెండో ప్యాకేజీలో ప్రతిపాదించారు. ఇక ఆఖరు ప్యాకేజీ పనులైన టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, ఫైర్ స్టేషన్, విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణాలను రూ. 213.59 కోట్లతో చేపట్టనున్నారు. ఈ పనులకు సంబంధించి తాజాగా టెండర్లు పిలిచి నవంబరు నాటికి పూర్తయ్యేలా కార్యాచరణను సిద్ధం చేశారు. డిసెంబరులో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఏఏఐ వర్గాల ద్వారా తెలిసింది.

## జన్వాడ ఫాంహౌజ్ వద్ద కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల హల్చల్

చామల కిరణ్ కుమార్ రెడ్డి హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఫామ్‌హౌస్ భూములు పరిశీలించేందుకు కాంగ్రెస్ బృందం.. గాంధీ భవన్ నుంచి బస్సులో నేరుగా జన్వాడకు చేరుకుంది. ఈ క్రమంలో వారిని.. బీఆర్‌ఎస్ కార్యకర్తలు అడ్డుకునేందుకు యత్నించారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు.. వారిని పక్కకు నెట్టి... బస్సును ముందుకు పంపించారు. ఫామ్‌హౌస్ వద్దకు వారు మళ్లీ రాకుండా రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో కాసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. జన్వాడ ఫామ్‌హౌస్ వద్ద మీడియాతో మాట్లాడిన కాంగ్రెస్ నేతలు.. ఈ భూములు సత్యం రామలింగరాజు కంపెనీ నుంచి రాజేష్‌కు.. ఆయన్నుంచి ప్రదీప్‌రెడ్డికి బదిలీ అయ్యాయని పేర్కొన్నారు. ప్రదీప్‌రెడ్డి... ఈ భూములను కేటీఆర్‌కు లీజ్‌కి ఇచ్చినట్లు ఆధారాలు లేవన్నారు. హరీశ్‌రావు... అధికార దుర్వినియోగం చేసి భూములు కొల్లగొట్టారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి...ఆరోపించారు. నిబంధనలు అతిక్రమించి నిర్మించిన ఫామ్‌హౌస్ యజమానులపై చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్, అఓఅ కమిషనర్ సృజనను ఫోన్ ద్వారా కోరారు."ఫామ్‌హౌస్ వద్దకు వస్తే ప్రదీప్‌రెడ్డి కేసులు పెడతామన్నారు. ఇన్ని ఎకరాల్లో ఫామ్‌హౌస్ ఎలా కట్టుకున్నారు. సర్వే నంబర్ 311, 301, 313లో అక్రమాలు జరిగితే నిగ్గు తేలుస్తాం. సత్యం రామలింగరాజు కంపెనీ నుంచి ఈ భూములు రాజేష్‌కు బదిలీ అయ్యాయి. రాజేష్ నుంచి ఈ భూములు ప్రదీప్‌రెడ్డికి బదిలీ అయ్యాయి. ఈ భూములు కేటీఆర్‌కు స్నేహితుడు ఇచ్చినట్లు ఆధారాలు లేవు. అధికార దుర్వినియోగం చేసి కేటీఆర్, హరీశ్‌రావు భూములు కొల్లగొట్టారు" అని చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అక్రమాల గురించి ప్రజలకు తెలియజేయాలనే ఫామ్‌హౌస్ వద్దకు వచ్చామని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి వివరించారు. ఫామ్ హౌస్ భూమి లెక్కలు తేలుస్తామని ప్రకటించారు. "అక్రమాల గురించి ప్రజలకు తెలియజేయాలనే ఇక్కడికి వచ్చాం. ఫామ్‌హౌస్‌ను నాలాపై కట్టారు. ఫామ్‌హౌస్ నిర్మాణానికి అనుమతులు లేవు. ఫామ్‌హౌస్ ఎవరి పేరుపై ఉందో స్పష్టత లేదు. ఫామ్‌హౌస్ భూ లెక్కలు తేలుస్తాం" అని మల్లు రవి అన్నారు.

## పార్టీ ఫిరాయింపులకు తెరలేపింది కేసీఆరే..

మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. కోర్టు తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. "పార్టీ ఫిరాయింపుల దుష్ట సంస్కృతిని తెచ్చిందే కేసీఆర్. తెదేపాలో గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను, కాంగ్రెస్‌లో గెలిచిన సబితను బీఆర్‌ఎస్‌లో చేర్చుకుని మంత్రులను చేశారు. ప్రభుత్వాలను పడగొట్టి.. పార్టీలను చీల్చిన చరిత్ర భాజపాది. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను భాజపా నాశనం చేస్తోంది" అని వ్యాఖ్యానించారు.

## ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరవు

ఆయన మాట్లాడారు. "ఈ ఏడాది శ్రీశైలంలో ఇప్పటికే 84 టీఎంసీలు తీసుకున్నట్టు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పారు. కల్వకుర్తికి ఇప్పటి వరకు కేవలం 8 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోసి.. 84 టీఎంసీలు అని చెప్పారు. కల్వకుర్తికి నీళ్లు ఎత్తిపోసే.. 5 మోటార్లకు గాను కేవలం 2 మోటార్లు నడుపుతున్నారు. 2024, 2025లో కృష్ణానదిలో అత్యధిక నీళ్లు వాడుకున్నామని మంత్రి ప్రకటించారు. కానీ, ఈ మూడేళ్లలో తెలంగాణ అతి తక్కువ వాడుకున్నట్టు కేఆర్‌ఎంబీ లెక్కలు చెబుతున్నాయి. ఈ మూడేళ్లలో ఏపీ 718 టీఎంసీలు వాడితే.. తెలంగాణ కేవలం 216 టీఎంసీలు వాడింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత అతితక్కువ వినియోగం 2024-25లో జరిగింది. నీళ్లుండి, మోటార్లు ఉండి, వ్యవస్థ ఉండి నడపలేకపోవడమంటే.. ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు. ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండకు నీళ్లు తరలించుకుపోతోంది" అని హరీశ్‌రావు ఆరోపించారు.

## నా బిడ్డల ఉద్యోగాల కోసం.. నా వ్యక్తిగత శ్రద్ధతో జాబ్‌మేళా..

పొందేందుకు ఒకే వేదిక కల్పించడమే లక్ష్యమన్నారు. గత ఏడాది హుజూర్‌నగర్‌లోనూ జాబ్‌మేళా నిర్వహించి పలువురు యువతకు ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజల రుణం తీర్చుకుంటాకోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ప్రజలు తన కుటుంబ సభ్యులని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వారికి ఎంత చేసినా రుణం తీర్చుకోలేనని తెలిపారు. తాము పదవుల్లో ఉన్నా లేకపోయినా ఇక్కడి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కోదాడలో త్వరలో టాస్క్ కేంద్రంయువతకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు ఉద్యోగ అవకాశాలను పెంపొందించేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) కేంద్రాన్ని కోదాడలో త్వరలో ఏర్పాటు చేస్తామని సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొని ఆయన మాట్లాడారు. మారుతున్న ఉద్యోగ రంగానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంయువతకు విద్యతో పాటు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు తగ్గే అవకాశం ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు లభించేలా పరిశ్రమలు, సంస్థలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జాబ్‌మేళాలో వివిధ రంగాలకు చెందిన కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థుల అర్హతలను పరిశీలించారు. ఎంపికైన అభ్యర్థులు నియా మక పత్రాలు అందుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**యువత ఉద్యోగార్థులుగా కాకుండా ఉపాధి ప్రదాతలుగా ఎదగాలి : గడ్డం ప్రసాద్**

అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో భారతీయ యువతకు ఉద్యోగ అవకాశాలు క్రమంగా తగ్గుతున్న వేళ, సుమారు 350 కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన కోదాడ మెగా జాబ్ మేళా తెలంగాణ నిరుద్యోగ యువతకు కొత్త ఆశాకిరణంగా నిలిచిందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి భారీ ఉద్యోగ మేళాలు నిర్వహించి, అర్హత కలిగిన యువతను నేరుగా ప్రముఖ సంస్థలతో అనుసంధానం చేయాలని ఆయన ఆకాంక్షించారు. శనివారం కోదాడలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో వేలాది మంది ఉద్యోగార్థులను ఉద్దేశించి స్పీకర్ ప్రసంగించారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు పొందడం రోజురోజుకూ కష్టంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సుమారు 350 కంపెనీలను కోదాడకు తీసుకురావడం అసాధారణమైన విజయమని కొనియాడారు. తాను దాదాపు 30 నుంచి 35 సంవత్సరాలుగా రాజకీయ, ప్రజాజీవితంలో ఉన్నప్పటికీ ఇంత భారీ స్థాయిలో నిర్వహించిన ఉద్యోగ మేళాను ఎప్పుడూ చూడలేదన్నారు. ఇది ఒక్కరోజు కార్యక్రమంగా మిగిలిపోకూడదని, తెలంగాణవ్యాప్తంగా నిరంతరం ఇటువంటి జాబ్ మేళాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలోశాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి,మిర్యాలగూడెం ఎమ్మెల్యే భక్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్‌జిల్లా ఎస్పీ నరసింహులు పాల్గొన్నారు

## ఒక్క ఎకరా అక్రమభూమిలేదు

ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని రైతులకు అందించలేకపోతోందని విమర్శించారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా ఏపీకి నీళ్లు వెళ్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు. జూరాలకు ఎగువ నుంచి నీరు రావడం లేదని, అందుకే కాలువలకు నీటి విడుదల నిలిపివేశామని అధికారులు చెబుతున్నారని అన్నారు. అయితే ఏపీకి నీళ్లు వెళ్తున్నప్పుడు తెలంగాణకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపులను తరచూ ఆన్, ఆఫ్ చేయడం సాధ్యం కాదని, ఒకసారి పంపులను ప్రారంభిస్తే నిరంతరంగా నడపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో విద్యుత్ స్థాపిత సామర్థ్యం సుమారు ఏడు వేల మెగావాట్లు ఉండగా, తమ ప్రభుత్వ హయాంలో దానిని 24 వేల మెగావాట్లకు పెంచామని కేటీఆర్ పేర్కొన్నారు. పాలమూరు ప్రాంతంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చామని, సుమారు ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని చెప్పారు. వరదలు వచ్చినప్పుడు నీటిని మళ్లించడం, చెక్‌డ్యామ్‌లు, చెరువులను నింపడం ద్వారా పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించామని ఆయన అన్నారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగడం లేదని కేటీఆర్ విమర్శించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తమ ప్రాజెక్టుల విషయంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నాయని అన్నారు. కర్ణాటకలో ఆలమట్టి ఆనకట్ట ఎత్తు పెంచే ప్రతిపాదనలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఆలమట్టి ఎత్తు పెరిగితే భవిష్యత్తులో పాలమూరు ప్రాంతానికి కృష్ణా జలాల లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

పార్టీ ఫిరాయింపు చేసిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో చేరిన మిగతా ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని అన్నారు. అధికారంలో ఉన్నవారు గతంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం, జిల్లాలోనే రైతులు విద్యుత్, సాగునీటి సమస్యలతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ విమర్శించారు. పాత్రికేయ సమావేశంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే లు మర్రి జనార్దన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ధర్మనాయక్ ,పెబ్బేరు మాజీ మున్సిపల్ చైర్మన్ కరుణశ్రీ, కర్రే స్వామి, బిఆర్ఎస్ నాయకులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగల మోసగాడు రేవంత్ రెడ్డి

రైతాంగం సాగు చేసిన పంటలకు నీళ్లు ఇవ్వకపోతే ఖబడ్దార్ రేవంత్ రెడ్డి అంటూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) హెచ్చరించారు. శనివారం పెబ్బేరు మండలం గుమ్మడం, పెబ్బేరు సబ్ స్టేషన్లు పరిశీలించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ పర్యటన కొనసాగింది. రైతులకు 12 గంటల పాటు కరెంటు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ కేవలం 6 గంటలు మాత్రమే ఇచ్చి దగా చేస్తున్నారని ఆరోపించారు. కాగితాలపై కాకి లెక్కలు చూపించడం సరైన విధానం కాదని విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పెబ్బేర్ లో అంబేద్కర్ చౌరస్తా నుండి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ, జూరాల డ్యామ్ లో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్ కు ఎగువ ఉన్న పోతిరెడ్డిపాడు వెలిగొండ ప్రాజెక్టులకు 18 టీఎంసీల నీరు విడుదల చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కు శిష్యుడు రేవంత్ రెడ్డి అని తెలంగాణ రైతాంగాన్ని నిలువునా ముంచుతున్నారనడానికి నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, గుర్తు చేశారు. పాలమూరు బిడ్డ అంటూ చెప్పుకునే రేవంత్ రెడ్డి పాలమూరుకే శాపంగా మారారని, ఎద్దేవా చేశారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు యూరియా ఎరువులు పుష్కలంగా లభించేయవని నేడు ఆ పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. తీస్తాం ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేసిన 22జీ లో కేవలం పెబ్బేరు మండలంలోని వెయ్యి ఎకరాలు వరకు నిషేధిత జాబితాలో ఉందని దీంతో రిజిస్ట్రేషన్లు కావని తెలిపారు. ఎలినినో తెచ్చింద కరువు కాదని కేవలం కాంగ్రెస్ తెచ్చిన కరువే అని రైతులు గుర్తించుకోవాలని సూచించారు. కర్ణాటక ఆల్మట్టి డ్యాం ఐదు మీటర్లు ఎత్తి పెంచడానికి లక్ష కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేస్తుందని, రైతు ప్రయోజనాల కోసం కేసీఆర్ ప్రభుత్వం 80 వేల కోట్లతో లక్ష ఎకరాలకు సాగునీళ్లు అందించేందుకు మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణం చేస్తే రేవంత్ రెడ్డి రాధాంతం చేస్తున్నారని గుర్తు చేశారు.

## ఎర్రవల్లి భూముల సర్వేలో కీలక మలుపు



- రైతులకు నోటీసులు ఇస్తున్న అధికారులు

ఎర్రవల్లి(జనంసాక్షి): సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవల్లిలో భూముల సర్వే మరో మలుపు తిరిగింది. కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోని 325 సర్వే నెంబరులో 388 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. అయితే, ఈ భూముల్లో తమకూ వాటా ఉందంటూ శివారు వెంకటాపూర్ గ్రామస్థులు ఆందోళనకు దిగారు. 388 ఎకరాల్లో ఎర్రవల్లి గ్రామస్థులకు 250 ఎకరాలు మాత్రమే ఉందని, మిగిలిన భూమిలో తమకూ హక్కులు ఉన్నాయని వెంకటాపూర్ వాసులు చెబుతున్నారు. కాస్రా, సిత్వార్ రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో అధికారులు, సిబ్బంది చేసిన తప్పిదాల కారణంగానే భూ రికార్డుల్లో మార్పులు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో తమకు అన్యాయం జరగకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు. ఎర్రవల్లిలోని సర్వే నెంబరు 325లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు అధికారులు నోటీసులు ఇచ్చారు. విడతల వారీగా నోటీసుల ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 215 మందికి నోటీసులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించగా.. ఇవాళ 50మంది రైతులకు జారీ చేశారు. సర్వే నెంబరు 325లో ఈనెల 21 నుంచి 4 విడతల్లో సర్వే కొనసాగనుంది. 21వ తేదీన రైతులు భూమి వద్దకు వచ్చి వివరాలు తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు. ఎర్రవల్లిలోని సర్వే నెంబరు 325లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు అధికారులు నోటీసులు ఇస్తున్నారు. ఈ నెల 21వ తేదీన రైతులు భూమి వద్దకు వచ్చి వివరాలు తెలియజేయాలని నోటీసులో వెల్లడించారు.

## వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణది కీలక పాత్ర

అందించడం ప్రధాన సవాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వికసిత్ భారత్ నిర్మాణాన్ని కేంద్రం లేదా రాష్ట్రాలు విడివిడిగా సాధించలేవని, సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రం?రాష్ట్రాలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ వనరులను సమర్థంగా సమీకరించడంతో పాటు బలమైన సంస్థలు, పరస్పర సహకార విధానాలు అవసరమన్నారు. తెలంగాణ కేవలం నిధులను కోరేందుకు కాకుండా, స్పష్టమైన అభివృద్ధి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణకు నిర్దిష్ట విధానం, దీర్ఘకాలిక లక్ష్యంతో ఈ చర్చలో భాగస్వామ్యమవుతోందని తెలిపారు.

**3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం**

తెలంగాణ బలమైన ఆర్థిక పునాదులతో తదుపరి దశ వృద్ధికి సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. 2025-26లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (ఉూఆఖ) రూ. 17.82 లక్షల కోట్లకు చేరిందని, ప్రస్తుత ధరల ప్రకారం 10.7 శాతం వృద్ధి నమోదైందన్నారు. స్థిర ధరల ప్రకారం వాస్తవ ఉూఆఖ వృద్ధి 8.5 శాతంగా అంచనా వేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కు చేరిందని, ఇది జాతీయ సగటు రూ. 2,19,575తో పోలిస్తే దాదాపు రెండింతలని వివరించారు. సేవల రంగం 13.5 శాతం, ద్వితీయ రంగం 9.4 శాతం వృద్ధి సాధించాయని తెలిపారు. ప్రస్తుత వృద్ధి పథంలో కొనసాగితే 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ 1.21 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా ఉందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం అంతకంటే పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకుందని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించామని ప్రకటించారు. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న దాదాపు 5 శాతం నుంచి 10 శాతానికి పెంచాలన్నది లక్ష్యమని తెలిపారు.

**ప్రైవేట్ పెట్టుబడుల సమీకరణకు ప్రాధాన్యం**

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించాలంటే మౌలిక వసతులకు నిధులు సమకూర్చే విధానంలో మార్పు అవసరమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక వసతుల కోసం ప్రభుత్వ రుణాలపైనే అధికంగా ఆధారపడే పద్ధతి నుంచి క్రమంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేట్ పెట్టుబడులు, సంస్థాగత నిధులు, సావరిన్ ఫండ్స్ నుంచి అధిక మొత్తంలో పెట్టుబడులను సమీకరించి, ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగించే నమూనా వైపు తెలంగాణ అడుగులు వేస్తోందన్నారు. ప్రాజెక్టుల్లో పెట్టుబడిదారుల రిస్క్‌ను తగ్గించడం, వయబిలిటీ గ్యాప్‌లను పూడ్చడం, ప్రైవేట్ పెట్టుబడులకు విశ్వాసం కల్పించడం వంటి అంశాల్లో ప్రభుత్వ నిధులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఇందుకోసం పబ్లిక్?ప్రైవేట్ భాగస్వామ్యాలు, గ్రీన్ బాండ్లు, బ్లెండెడ్ ఫైనాన్స్ వంటి మార్గాలను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు.



# రైస్ మిల్లర్ల బంద్ కొనసాగింపు

- సోమవారం నుంచి జిల్లాల్లో రిలే నిరాహార దీక్షలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తమ డిమాండ్లను ఆమోదించి జీవో రూపంలో ప్రకటించి అమలు చేసే వరకు బంద్ కొనసాగిస్తామని రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం నిర్వహించింది. ఆగస్టు 7 నుంచి వరుసగా నిర్వహిస్తున్న ప్రెస్ మీట్లు, సెప్టెంబర్ 8న నిర్వహించిన ధర్నా, సెప్టెంబర్ 11 నుంచి కొనసాగుతున్న రాష్ట్రవ్యాప్త రైస్ మిల్లుల నిరవధిక బంద్ నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ ఈరోజు హైదరాబాద్‌లో రైస్ మిల్లర్ల ప్రతినిధులతో చర్చలు జరిపింది. క్యాబినెట్ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు సభ్యులుగా ఉన్న ఈ సబ్ కమిటీ, రైస్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, బంద్‌ను విరమించాలని, నాలుగు రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన హామీని స్వాగతిస్తున్నప్పటికీ, రైస్ మిల్లర్లు సమర్పించిన అన్ని డిమాండ్లను అధికారికంగా జీవో రూపంలో ప్రకటించి, అమలు చేసే వరకు బంద్‌ను కొనసాగించాలని రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం నిర్ణయించింది. అదేవిధంగా, సోమవారం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించింది. రైస్ మిల్లర్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ఉద్యమాన్ని శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగిస్తామని అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ సమావేశంలో ఉద్యమ నేత సయ్యద్ రఫీ, అధ్యక్షులు గణపతి రెడ్డి, ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి, జనరల్ సెక్రటరీ ఉత్కూరి వీరేశం, అన్ని జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# పెళ్లయిన 18 రోజులకే బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

- అదనపు కట్నం కోసం భర్త వేధింపులే కారణమని తల్లి ఫిర్యాదు



**ఘట్‌కేసర్ (జనంసాక్షి) :** పెళ్లయిన 18 రోజులకే ఓ బీటెక్ విద్యార్థిని కళాశాల భవనం మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అదనపు కట్నం కోసం భర్త శారీరకంగా, మానసికంగా వేధించడంతోనే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన ఏనుగు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పల్లవి (20) ఘట్‌కేసర్ పరిధిలోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఈ ఏడాది ఆగస్టు 30న చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డితో పల్లవికి వివాహం జరిగింది. పెళ్లయిన కొద్ది రోజులకే అదనపు కట్నం కోసం భర్త వేధింపులు ప్రారంభమయ్యాయని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన పల్లవి గురువారం తాను చదువుతున్న కళాశాల భవనం మూడో అంతస్తు నుంచి దూకింది. తీవ్రంగా గాయపడిన ఆమెను తొలుత జీడిమెట్లలోని నీలిమ ఆసుపత్రికి, అనంతరం మేడిపల్లిలోని శ్రీకర ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ పల్లవి మృతి చెందింది. మృతురాలి తల్లి సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పల్లవి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు, కట్న వేధింపుల ఆరోపణలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# వినాయక నిమజ్జనానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

- తిరుగు ప్రయాణంలో అనంత లోకాలకు
- ఒకే తండాకు చెందిన నలుగురు దుర్మరణం



నవాబుపేట్ :సెప్టెంబర్ 19( జనం సాక్షి )శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జన వేడుకలు ముగించుకుని తిరుగు ప్రయాణమైన క్రమంలో శంషాబాద్ సమీపంలోని పాలుమాకుల వద్ద జాతీయ రహదారి–44 పై వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్ (కల్వర్టు)ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చౌదూరు గ్రామ పంచాయితీ పరిధిలోని మెట్టుగడ్డ తండాకు చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కేతావత్ లింబ్యా నాయక్ (55), ఆయన భార్య, మాజీ సర్పంచ్ జమున (50), మాజీ ఎంపిటిసి మాన్సింగ్ (50), మరియు వాసు రామ్ (48), అశోక్ (25) మెట్టుగడ్డ తండావాసుల ఆహ్వానం మేరకు వినాయక నిమజ్జన వేడుకల్లో పాల్గొనేందుకు వీరంతా వచ్చారు. నిన్నటివరకు పండుగ శోభతో కళకళలాడిన తండా, ఈ ఘోర వార్త వినగానే ఒక్కసారిగా రోదనలతో మునిగిపోయింది. మృతుల కుటుంబ సభ్యుల ఏడ్పులు స్థానికులను కలచివేస్తున్నాయి. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# నాలాపై ఫామ్‌హౌస్ నిర్మాణం

- ఎంపీ మల్లు రవి ఆరోపణలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ శివారులోని జన్వాడ ఫామ్‌హౌస్‌ను కాంగ్రెస్ ఎంపీలు, ప్రజాప్రతినిధుల బృందం సందర్శించి అక్కడి భూములు, నిర్మాణాలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.. ఫామ్‌హౌస్ నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? నాలాపై నిర్మాణం ఎలా చేపట్టారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. 111 జీవో పరిధిలోని భూముల్లో నిర్మాణాలకు నిబంధనలు ఉన్నాయని, గతంలో జన్వాడ ఫామ్‌హౌస్ వద్ద డ్రోన్ ఎగురవేసిన ఘటనకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదైన విషయాన్ని కాంగ్రెస్ నేతలు ప్రస్తావించారు. ప్రస్తుతం జన్వాడ భూములు, నిర్మాణాలపై నిజానిజాలు ప్రజలకు వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు. అయితే ఫామ్‌హౌస్ యజమానిగా పేర్కొంటున్న ప్రదీప్‌రెడ్డి మాత్రం భూమి తనదేనని, 2019లో కొనుగోలు చేశానని, కేటీఆర్‌కు ఆస్తిపై యాజమాన్య హక్కులు లేవని, కేవలం లీజుకు ఇచ్చినట్లు మీడియాతో తెలిపారు.

# పసిప్రాణానికి పునర్జన్మ

- శిశురక్ష ఆస్పత్రిలో అద్భుతమైన చికిత్స
- వైద్యులను అభినందించిన జగ్గారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నెలలు నిండకముందే పుట్టిన తమ బాబు ఆరోగ్యం అత్యంత విషమంగా ఉందని తల్లిదండ్రులు జగ్గారెడ్డి వద్దకు వచ్చారు. కేవలం 980 గ్రాముల బరువు ఉండటంతో పాటు లంగ్స్ కూడా డెవలప్ కాకపోవడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆ పసిబిడ్డను జగ్గారెడ్డి సంగారెడ్డిలోని శిశురక్ష చిల్డ్రన్స్ ఆసుపత్రిలో చేర్పించారు. శిశురక్ష ఆసుపత్రి వైద్యులు 50 రోజులపాటు చికిత్స అందించి బిడ్డకు పునర్జన్మ నిచ్చారు. ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడి 980 గ్రాముల బిడ్డ ప్రస్తుతం 1.6కిలోల బరువుకు చేరింది. ఈ విషయం తెలిసి స్వయంగా ఆసుపత్రికి వచ్చి శిశురక్ష ఆసుపత్రి డాక్టర్లను, యాజమాన్యాన్ని జగ్గారెడ్డి అభినందించారు. సంగారెడ్డిలో ఇలాంటి అరుదైన చికిత్స అందించి పసిబిడ్డ ప్రాణాలు కాపాడటం గొప్ప విషయమన్నారు. సంగారెడ్డి పట్టణంలోని శిశురక్ష చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్లు అరుదైన చికిత్స అందించి నవజాత శిశువు ప్రాణాలను కాపాడారు. నెలలు నిండకముందే, కేవలం 980 గ్రాముల బరువుతో జన్మించిన శిశువుకు పునర్జన్మనిచ్చారు. ఊపిరితిత్తులు డెవలప్ కాకపోవడంతో పాటు కిడ్నీలు పనిచేయకపోవడంతో డయాలసిస్ చేయాల్సి వచ్చింది. వెంటిలేటర్ పై శిశువును ఉంచి విజయవంతంగా చికిత్స అందించారు. 50 రోజుల చికిత్స తర్వాత ఆ పసి బిడ్డ బరువు 1.6 కిలోలకు పెరిగింది. అత్యంత విషమంగా ఆరోగ్య పరిస్థితి ఉన్న నవజాత శిశువును శిశురక్ష ఆసుపత్రి డాక్టర్లు బతికించారని తెలుసుకున్న జగ్గారెడ్డి స్వయంగా అక్కడికి వెళ్లారు. నవజాత శిశువును చూసి, డాక్టర్లను ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. హైదరాబాద్ కి వెళ్లాల్సిన అవసరం లేకుండా సంగారెడ్డి లోనే అత్యాధునిక వైద్య సేవలు అందించి, పసిబిడ్డకు ప్రాణం పోసిన తీరును ఆయన ప్రశంసించారు. శిశు రక్ష ఆసుపత్రి డాక్టర్లు ఆ శిశువును కంటికి రెప్పలా కాపాడి, ఆ తల్లిదండ్రుల కళ్ళల్లో సంతోషం నింపారని ఆయన వివరించారు. 50 రోజుల చికిత్స కు గాను దాదాపు నాలుగు లక్షల పైగా బిల్లు అయింది. శిశువు తల్లిదండ్రులు రెండు లక్షల వరకు చెల్లించారు. మిగతా మొత్తాన్ని తాను చెల్లిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. కానీ ఆసుపత్రి యాజమాన్యం బిల్లులో సగం మినహాయింపు ఇచ్చింది.

# మరిపెడలో నూతన న్యాయస్థానం ప్రారంభం

- ప్రారంభించిన గౌరవ హైకోర్టు న్యాయమూర్తులు
- బార్-బెంచ్ సమన్వయంతో ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించాలి: న్యాయమూర్తి



**మరిపెడ సెప్టెంబర్ 19(జనం సాక్షి) :** హైకోర్టు జడ్జ్ జస్టిస్ ఈవి వేణుగోపాల్, జస్టిస్ ఎన్. రాజేశ్వరరావు, జస్టిస్ బిఆర్.మధుసూదనరావు శనివారం మండల కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు భవనం ప్రారంభించారు. మరిపెడలో నూతన న్యాయస్థానం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవి వేణుగోపాల్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారానికి వేగం తీసుకురావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. న్యాయవ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడానికి బార్, బెంచ్ మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కోర్టులో వాదనలు వినిపించే ప్రతి న్యాయవాది ఆఫీసర్ అఫ్ ద కోర్ట్‌గా వ్యవహరిస్తూ, న్యాయస్థానానికి సహకరించాలని, చట్టపరమైన అంశాలను సమగ్రంగా కోర్టు ముందుంచాలని సూచించారు. న్యాయమూర్తులు ప్రతి కేసును ఎంతో శ్రద్ధగా పరిశీలించి, చట్టపరమైన అంశాలను అధ్యయనం చేసి నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. న్యాయవాదులు కూడా న్యాయస్థాన నిర్ణయాలను విస్తృత దృక్పథంతో అర్థం చేసుకోవాలని సూచించారు. తాను న్యాయవాదిగా ఉన్న సమయంలో ఎదుర్కొన్న ఒక కేసు అనుభవాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. కోర్టు ఇచ్చిన నిర్ణయాన్ని అనంతరం పూర్తిగా అధ్యయనం చేయడం ద్వారా, తాను వాదనలో ప్రస్తావించలేకపోయిన ముఖ్యమైన అంశాన్ని గుర్తించానని తెలిపారు. ఈ అనుభవం ద్వారా న్యాయవ్యవస్థలో నిరంతర అధ్యయనం, ఆత్మపరిశీలన ఎంత ముఖ్యమో వివరించారు.

### రాజ్యాంగ హక్కులు ప్రతి ఒక్కరికీ అందాలి

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ప్రాథమిక హక్కులు, న్యాయపరమైన రక్షణలు అందరికీ సమానంగా అందేలా చూడాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థ, బార్, కార్యనిర్వాహక వ్యవస్థతో పాటు ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21 మరియు ఆర్టికల్ 51ఏలోని స్ఫూర్తిని ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని బలహీన వర్గాలు, ఆశ్రయ గృహాల్లో ఉన్న పిల్లలు మరియు ఇతర అవసరమైన వారికి చట్టపరమైన రక్షణ, సంక్షేమ సేవలు అందేలా న్యాయవ్యవస్థ మరియు కార్యనిర్వాహక వ్యవస్థ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### మహబూబాబాద్ జిల్లా కోర్టు భవనానికి త్వరలో శంకుస్థాపన

వరంగల్ జిల్లా నుంచి విడిపోయి ఏర్పడిన మహబూబాబాద్ జిల్లాకు పూర్తిస్థాయి జిల్లా కోర్టు భవనం అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు భవనానికి త్వరలోనే గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తి గారి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులు, న్యాయవ్యవస్థకు చెందిన అధికారులు మరియు ఇతర సంబంధిత విభాగాల సమన్వయం అవసరమని అన్నారు. జిల్లా కలెక్టర్ న్యాయస్థాన మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం పట్ల చూపుతున్న నిబద్ధతను గౌరవనీయ న్యాయమూర్తి అభినందించారు. ఇటీవల ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా కూడా ఆమె కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. మరిపెడ న్యాయస్థాన ఏర్పాటుకు సహకరించిన జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు అధికారులు, పిడిజే మురళీ మోహన్, ఇతర న్యాయమూర్తులు, న్యాయస్థాన సిబ్బంది, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాదులు మరియు సంబంధిత అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మరిపెడ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, అధికారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రత్యేకంగా అభినందించారు. బార్–బెంచ్ సమన్వయంతో మరిపెడ న్యాయస్థానం ప్రజలకు సత్వర, సమర్థవంతమైన న్యాయం అందించే కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. న్యాయమూర్తులు ఎన్. రాజేశ్వర్ రావు, బిఆర్. మధుసూదనరావు, మాట్లాడుతూ జిల్లాలో కోర్టు భవనం ప్రారంభించడం సంతోషం కలిగించిందని, ప్రతీ ఒక్కరికీ తక్షణమే న్యాయ సేవలు అందించాలని సూచించారు, జిల్లాలో చరిత్రాత్మకమైన మరిపెడ లో కోర్టు ఆవిష్కృత , ప్రాముఖ్యత గురించి మాట్లాడారు, స్వంత జిల్లాలో ఉన్న అనుభవాలు గుర్తుకు చేసారు. అంతకు ముందు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో గౌరవ న్యాయమూర్తులకు ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఎస్పీ డాక్టర్ శబరిష్, స్వాగతం పలికి మర్యాద పూర్వకంగా కలిసి బోకే అందచేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ ప్రిన్సిపల్, సీనియర్, జూనియర్, జడ్జిలు శ్రీ డికె మురళీమోహన్, శాలిని షాకెల్లి, స్వాతి మురారి, కృష్ణతేజ్, ధీరజ్ కుమార్, జీవన్ కుమార్, మహతి వైష్ణవి, అఖిల, దిలీప్ కుమార్ నాయక్, సూర్య చంద్రకళ, క్యాన్ లాల్, చండే శరీ దేవి, జ్యోత్స్న, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, సంబంధిత జిల్లాలబార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సీనియర్ న్యాయవాదులు, ప్రజలు పాల్గొన్నారు.

# కేంద్రం రూ.30 వేల కోట్ల కరువు ప్యాకేజీ ప్రకటించాలి

- రైతులను ఆదుకోకుంటే ఉద్యమమే
- 22ఏ భూములపై నిజాలు నిగ్గుతేల్చాలి..పేదలకు భూములు పంచాలి
- సూర్యాపేటను కరువు జిల్లాగా ప్రకటించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ




**సూర్యాపేట (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులతో రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు.పంట నష్టంపై సమగ్రంగా అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.శనివారం జిల్లా కేంద్రంలోని ఎంవిఎన్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు కేంద్రం రూ.30 వేల కోట్ల ప్రత్యేక కరువు ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.రైతులకు కనీసం 14 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, సాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. రిజిస్ట్రేషన్‌తో సంబంధం లేకుండా అర్హులైన రైతులందరికీ పంటల బోనస్ అందించాలని అన్నారు.కరువు పరిస్థితుల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని అన్నారు.ఇందుకు అయ్యే వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకునే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టకపోతే ప్రజలను సమీకరించి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో భూముల ఆక్రమణలపై ప్రభుత్వం, ప్రతిపక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని అన్నారు. 22ఏ పేరుతో రాష్ట్రంలో మూడు లక్షల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని ప్రభుత్వం చెబుతోందని అన్నారు.ఈ వ్యవహారంపై రాజకీయ ఆరోపణలకు తావులేకుండా సమగ్ర కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం, మాజీ మంత్రులకు సంబంధించి భూముల ఆక్రమణపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారని, ఇదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబం కూడా భూములను ఆక్రమించిందంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష సభ్యులు వ్యక్తిగత విమర్శలు, దూషణలకు దిగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు. రైతులు, కూలీలు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర చర్చ జరిపి పరిష్కారాలు చూపాలని పేర్కొన్నారు.సూర్యాపేట జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నందున జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని కోరారు.

సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌ను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కోసం జరుగుతున్న ఉద్యమానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని, ఇప్పటికే ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని తెలిపారు.జిల్లాకు ప్రయోజనం చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని సూర్యాపేట మీదుగా ఖరారు చేయాలని కోరారు.ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, చెరుకు ఏకలక్ష్మి, నాగరపు పాండు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనాల సందర్భంగా సమన్వయంతో పనిచేయాలి

- రాష్ట్ర సీఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. శనివారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని టీ–జీఐసీసీసీ (కమాండ్ కంట్రోల్ సెంటర్)కు వెళ్లి రాష్ట్రంలో, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. భారీ వర్షాలతో పాటు నగరంలో జరగనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రకు చేపట్టిన ఏర్పాట్లను కూడా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిశీలించారు. గణేష్ శోభాయాత్ర ప్రారంభమయ్యే బాలాపూర్‌తో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన శోభాయాత్ర మార్గాల్లో రహదారుల పరిస్థితి, రోడ్ల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, నీరు నిలిచే ప్రాంతాల్లో చేపట్టిన చర్యలు తదితర ఏర్పాట్లను సీఎస్ పరిశీలించారు. సీఎస్‌కు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జరుగుతున్న రియల్‌టైమ్ పర్యవేక్షణ, వివిధ ప్రాంతాల్లో పరిస్థితులపై అందుతున్న సమాచారం, శోభాయాత్ర మార్గాల్లో చేపట్టిన నిఘా ఏర్పాట్లను టీ–జీఐసీసీసీ ఇన్‌చార్జ్ అధికారి కమల్ హాసన్ రెడ్డి వివరించారు. శోభాయాత్ర మార్గాల్లో సీసీటీవీ కెమెరాల ద్వారా చేపడుతున్న నిఘా, పర్యవేక్షణ ఏర్పాట్లను కూడా సీఎస్ పరిశీలించారు. కీలకమైన ప్రాంతాలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలు, శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో సీసీటీవీ నిఘాను మరింత పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చోట్ల వెంటనే నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. దెబ్బతిన్న రోడ్లకు అవసరమైన మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని, వర్షాల కారణంగా శోభాయాత్రకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గణేష్ శోభాయాత్ర సందర్భంగా భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, విద్యుత్, వైద్య, అత్యవసర సేవలను సమన్వయంతో అందుబాటులో ఉంచాలని సీఎస్ సూచించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరిస్థితులను రియల్‌టైమ్‌లో నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే సంబంధిత శాఖల అధికారులు స్పందించేలా సమన్వయం చేసుకోవాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. భారీ వర్షాలు, గణేష్ నిమజ్జన శోభాయాత్ర నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని ముందస్తు చర్యలను తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు.

# అనుకున్నదే అయ్యింది.. క్యాష్ లెస్ నుంచి క్యాష్ మాత్రమే

సంపాదకీయం

డిజిటల్ ఇండియా, నగదు రహిత లావాదేవీలు అంటూ ఏళ్ల తరబడి ప్రచారం చేసిన ప్రభుత్వాలు, చివరకు అదే డిజిటల్ వ్యవస్థను నిర్వీర్యం చేసే నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. పెద్ద వ్యాపార సంస్థలు, ఇ-కామర్స్ సంస్థలు రూ.2000కు మించిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) విధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. అక్టోబర్ 15 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఈ నిర్ణయం వెనుక ఆర్థిక కారణాలు ఏమైనా ఉండొచ్చు గానీ, దాని పర్యవసానాలు మాత్రం దేశం సాధించిన డిజిటల్ చెల్లింపుల విప్లవాన్ని వెనక్కి నెట్టేలా కనిపిస్తున్నాయి.


యూపీఐ అనేది కేవలం ఒక చెల్లింపు సాధనం కాదు, అది సామాన్యుడి రోజువారీ జీవితంలో భాగమైపోయింది. చిన్న కిరాణా దుకాణం నుంచి పెద్ద మాల్ దాకా, రిక్షావాలా నుంచి డాక్టర్ దాకా అందరూ యూపీఐనే నమ్ముకున్నారు. దీనికి ప్రధాన కారణం అది "జీరో ఎండీఆర్" విధానంతో ఉచితంగా అందుబాటులో ఉండటమే. ఇప్పుడు ఆ ఉచిత సదుపాయంపై చార్జీ విధించడంతో, వ్యాపారులు తమ లాభాల్లో కోత పడకుండా ఉండేందుకు నేరుగా నగదు వైపు మళ్లుతున్నారు. "క్యాష్ మాత్రమే" అనే బోర్డులు దిల్లీ శివార్లలోని ఘజియాబాద్ వంటి ప్రాంతాల్లో ఇప్పటికే దర్శనమివ్వడం మొదలైంది. ఇది ఒక్క ఘజియాబాద్‌కే పరిమితం కాదు, రేపు దేశవ్యాప్తంగా విస్తరించే ప్రమాదం ఉంది.

అదనపు భారాన్ని భరించేందుకు వ్యాపారులు ఇష్టపడకపోవడం సహజమే. కానీ దీని ప్రభావం నేరుగా వినియోగదారులపై పడుతుంది. యూపీఐ చెల్లింపులు తిరస్కరించే వ్యాపారులు పెరిగే కొద్దీ, ప్రజలు మళ్లీ జేబులో నగదు తీసుకెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. ఇది కేవలం అసౌకర్యం మాత్రమే కాదు, పారదర్శకత లోపించడం, పన్ను ఎగవేతలు పెరగడం వంటి తీవ్ర పరిణామాలకు దారితీయవచ్చు. నల్లధనాన్ని అరికట్టేందుకు, లావాదేవీల్లో జవాబు దారీతనాన్ని పెంచేందుకు నగదు రహిత విధానాన్ని ప్రోత్సహించిన ప్రభుత్వమే, ఇప్పుడు అటువంటి వెనుకడుగుకు కారణమయ్యే నిర్ణయం తీసుకోవడం విడ్డూరం.

అంతేకాదు, ఎండీఆర్ అమల్లోకి వచ్చిన తర్వాత కొందరు వ్యాపారులు గతంలో యూపీఐ ద్వారా చేసిన కొనుగోళ్లపై కూడా నగదు వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఇది వ్యాపారులు-వినియోగదారుల మధ్య అపనమ్మకాన్ని పెంచడమే కాక, న్యాయపరమైన చిక్కులకూ దారితీయవచ్చు. చిన్న మొత్తాల లావాదేవీలకు మినహాయింపు ఇచ్చినప్పటికీ, పెద్ద కొనుగోళ్లు చేసే మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వినియోగదారులపై ఈ భారం నేరుగా పడనుంది.

డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భారత్, ఈ ఒక్క నిర్ణయంతో తన సాధించిన ప్రగతిని ప్రశ్నార్థకం చేసుకుంటోందా అనే సందేహం కలుగుతోంది. వ్యాపారుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, ప్రజల ప్రయోజనాలకు భంగం కలగని రీతిలో ప్రభుత్వం ఈ విధానాన్ని పునఃసమీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే, "నగదు రహిత భారత్" అన్న నినాదం కాగితాలకే పరిమితమై, మళ్లీ "నగదు మాత్రమే" అన్న పాత పద్ధతికే దేశం మొగ్గు చూపే ప్రమాదం లేకపోలేదు.

# సామాన్యుడికి ఒక న్యాయం... అధికారికి మరో న్యాయమా?



తెలంగాణలో పోలీసు వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసం కేవలం నేరాలను అరికట్టడంపైనే ఆధారపడి ఉండదు. పోలీస్ స్టేషన్ గుమ్మం తొక్కిన సామాన్యుడికి అక్కడ న్యాయం జరుగుతుందా, లేక తన సమస్య మరింత పెద్ద సమస్యగా మారుతుందా అన్నదే అసలు కొలమానం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పోలీసింగ్‌లో సాంకేతికత, కమాండ్ కంట్రోల్, ఫ్రెండ్లీ పోలీసింగ్ వంటి అనేక మార్పులు వచ్చినప్పటికీ, కొంతమంది అధికారులు అధికార దుర్వినియోగం, లంచాలు, పౌరుల వ్యక్తిగత వివాదాల్లో అనవసర జోక్యం వంటి ఆరోపణలకు గురవుతుండటం వ్యవస్థలోని మరో చీకటి కోణాన్ని బయటపెడుతోంది.

పోలీసుల పని నేరాలను దర్యాప్తు చేయడం, శాంతిభద్రతలను కాపాడటం, చట్టాన్ని అమలు చేయడం. కానీ ఇద్దరు వ్యక్తుల మధ్య ఆస్తి వివాదం, కుటుంబ తగాదా, అప్పు-చెల్లింపు సమస్య, భూమి గొడవ వంటి సివిల్ స్వభావం కలిగిన అంశాలు పోలీసుల చేతుల్లోకి వెళ్లినప్పుడు సమస్య మొదలవుతోంది. చట్టం అనుమతించే పరిధిలో అవసరమైన చర్య తీసుకోవడం వేరు, ఒక పక్షానికి అనుకూలంగా మరో పక్షంపై పోలీసు అధికారాన్ని ప్రయోగించడం వేరు. ఈ సరిహద్దు చెరిగిపోతే పోలీస్ స్టేషన్ న్యాయస్థానానికి ప్రత్యామ్నాయంగా మారే ప్రమాదం ఉంటుంది.

ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కువగా నష్టపోయేది మధ్యతరగతి కుటుంబమే. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలమైన వ్యక్తి అధికారులను సంప్రదించగలడు. కానీ సాధారణ ఉద్యోగి, చిన్న వ్యాపారి, రైతు లేదా మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో తన మాట వినిపించుకోవడమే పెద్ద పరీక్షగా మారుతుంది. ఒక కేసు పెడతారేమో, అరెస్టు చేస్తారేమో, కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలుస్తారేమో అనే భయంతో చాలామంది తమ హక్కుల కోసం కూడా పోరాడలేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రజాస్వామ్యంలో పోలీసు అధికారానికి భయం ఉండటం సహజం కావచ్చు, కానీ పోలీసు అధికార దుర్వినియోగానికి ప్రజలు భయపడే పరిస్థితి మాత్రం ఆందోళనకరం.

అవినీతి విషయంలోనూ పరిస్థితి భిన్నంగా లేదు. తెలంగాణ అవినీతి నిరోధక శాఖ 2024లో 152 అవినీతి కేసులు నమోదు చేసి, 223 మందిని అరెస్టు చేసినట్లు అధికారుల వివరాలను ఆధారంగా వార్తా కథనాలు వెల్లడించాయి. ఇందులో 129 ట్రాప్ కేసులు ఉండగా, 200 మంది నిందితులు, వారిలో 159 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. అదే ఏడాది లంచం తీసుకుంటూ పట్టుబడిన పోలీసు సిబ్బందిలో కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు 31 మంది ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల్లో అవినీతి కేసులు అధికంగా నమోదయ్యాయని కూడా ఏసీబీ గణాంకాలపై వచ్చిన నివేదికలు సూచిస్తున్నాయి.

ఇవి మొత్తం పోలీసు శాఖ అవినీతిమయమైందని చెప్పడానికి ఆధారాలు కావు. కానీ వ్యవస్థలోని కొంతమంది అధికారుల ప్రవర్తన ఎంత తీవ్రమైన సమస్యగా మారగలదో మాత్రం ఈ గణాంకాలు చెబుతున్నాయి. ఉదాహరణకు 2025 జనవరిలో హైదరాబాద్‌లోని ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్‌పై మిస్సింగ్ కేసులో అనుమానితుడి పేరు తొలగించేందుకు రూ.1.5 లక్షల లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఏసీబీ కేసు నమోదు చేసి అరెస్టు చేసింది.

మరో సందర్భంలో 2025 మేలో సూర్యాపేటకు చెందిన డీఎస్పీ కె. పార్థసారథి, ఇన్‌స్పెక్టర్ పి. వీర రాఘవులు ఒక ఫిర్యాదుదారుడి అరెస్టును తప్పించేందుకు తొలుత రూ.25 లక్షలు, తరువాత రూ.16 లక్షలకు తగ్గించి లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఏసీబీ ట్రాప్‌లో అరెస్టయ్యారు.

ఈ కేసులు కోర్టుల్లో తుది తీర్పులతో ముగిసే వరకు ఆరోపణలను నిర్ధారిత నేరాలుగా పరిగణించలేం. కానీ ఇలాంటి ఘటనలు ఒక ప్రశ్నను మాత్రం తప్పనిసరిగా లేవనెత్తుతున్నాయి-చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులపై అదే చట్టం ఎంత వేగంగా, ఎంత సమర్థంగా అమలవుతోంది?

ఇటీవల జూబ్లీహిల్స్ మాజీ ఇన్‌స్పెక్టర్. శ్రీనివాసులు రెడ్డి వ్యవహారం ఈ ప్రశ్నను మరింత తీవ్రంగా ప్రజల ముందుకు తెచ్చింది. ఒక మహిళ చేసిన ఫిర్యాదు ఆధారంగా లైంగిక దాడి, బెదిరింపులు, అధికార దుర్వినియోగం తదితర తీవ్రమైన ఆరోపణలు ఆయనపై వచ్చాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆయనను సస్పెండ్ చేశారు. అనంతరం అమీన్‌పూర్ పోలీసులు అత్యాచారం, కుల్పబుల్ హోమిసైడ్, ఐటీ చట్టంలోని నిబంధనలు తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వార్తా సంస్థలు వెల్లడించాయి. ఈ వ్యవహారంలో ముఖ్యమైన మరో పరిణామం తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడం. 2026 సెప్టెంబర్ 11న కోర్టు కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరమని రాష్ట్రం చేసిన వాదనను పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్‌ను తిరస్కరించినట్లు నివేదికలు తెలిపాయి.

ఇక్కడ అసలు ప్రశ్న ఒక వ్యక్తి నేరస్తుడా కాదా అన్నదానికంటే పెద్దది. ఒక సాధారణ పౌరుడిపై తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు పోలీసులు అతన్ని చట్ట ప్రకారం వెతికి, అరెస్టు చేసి, దర్యాప్తు చేస్తారు. అదే వ్యవస్థలో పనిచేసే అధికారిపై ఆరోపణలు వచ్చినప్పుడు కూడా అదే ప్రమాణాలు, అదే వేగం, అదే పారదర్శకత కనిపించాలి. చట్టం ముందు అందరూ సమానమే అనే రాజ్యాంగ సూత్రం పోలీసు శాఖకు మరింత ముఖ్యమైనది.

అధికార దుర్వినియోగాన్ని అరికట్టడానికి కేవలం సస్పెన్షన్లు సరిపోవు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సివిల్ వివాదాల్లో పోలీసుల పాత్రకు స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలి. ఫిర్యాదుదారులపై ఒత్తిడి, బెదిరింపులు, అక్రమ నిర్బంధం, లంచాల డిమాండ్ వంటి అంశాలపై స్వతంత్ర పర్యవేక్షణ అవసరం. పోలీసులపై వచ్చే ఫిర్యాదుల దర్యాప్తు పోలీసుల అంతర్గత వ్యవస్థకే పూర్తిగా పరిమితం కాకుండా, చట్టబద్ధమైన స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థలు సమర్థంగా పనిచేయాలి.

ఇదే సూత్రం రెవెన్యూ, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్ వంటి శాఖలకు కూడా వర్తిస్తుంది. ఒక భూమి పత్రం, వారసత్వ ధ్రువీకరణ పత్రం, రికార్డు సవరణ లేదా స్థానిక అనుమతి కోసం సామాన్యుడు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటే డిజిటల్ పాలన లక్ష్యం నెరవేరినట్లే కాదు. సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకురావడం కంటే, నిర్ణయం తీసుకునే అధికారి బాధ్యతను కూడా ఆన్‌లైన్‌లోనే గుర్తించగలిగే విధానం అవసరం.

పోలీసులు ప్రజల శత్రువులు కాదు. అదే సమయంలో పోలీసులు చట్టానికి మించినవారూ కాదు. వేలాది మంది పోలీసులు ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తున్నారనే వాస్తవాన్ని మరచిపోకూడదు. అయితే కొద్దిమంది అధికారుల అవినీతి, అధికార దుర్వినియోగం మొత్తం పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తుంది. అందుకే నిజాయితీగా పనిచేసే పోలీసులకు కూడా అవినీతి అధికారులపై కఠిన చర్యలు అవసరం.

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న కొద్దీ పోలీసింగ్ కూడా ప్రజల హక్కులకు మరింత దగ్గర కావాలి. పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందని నమ్మాలి; భయపడకూడదు. అధికారి తన కుర్చీని వ్యక్తిగత అధికారంగా కాకుండా రాజ్యాంగం అప్పగించిన బాధ్యతగా భావించాలి. సివిల్ వివాదాన్ని క్రిమినల్ ఒత్తిడిగా మార్చే పరిస్థితి ఉండకూడదు. లంచం లేకుండా పని జరగడం ప్రత్యేకత కాకుండా సాధారణ పద్ధతిగా మారాలి.

చివరికి ప్రజలు కోరేది పెద్దది కాదు-తమపై చట్టం ఎలా అమలవుతుందో, అధికారులపై కూడా అదే చట్టం అలాగే అమల వ్వాలి. పోలీసు వ్యవస్థపై విశ్వాసం నిలబడేది ఆయుధాలతో కాదు, నిష్పక్షపాతంతో. అధికారపు పెత్తనంతో కాదు, జవాబుదారీతనంతో. ఒక పోలీసు అధికారి తప్పు చేస్తే అతని హోదా అతనికి రక్షణ కవచంగా మారకూడదు. అదే విధంగా నిర్ధారణ కాని ఆరోపణలతో ఎవరినీ ముందుగానే దోషిగా ముద్ర వేయకూడదు. చట్టబద్ధమైన దర్యాప్తు, పారదర్శక ప్రక్రియ, సమయానుకూల న్యాయం-ఇవే తెలంగాణ పోలీసు వ్యవస్థకు ప్రజల విశ్వాసాన్ని తిరిగి బలపరిచే నిజమైన మార్గం.

**మన్నారం నాగరాజు**
సామాజిక రాజకీయ విశ్లేషకులు

## లింగాన్నిమింగొద్దు!

బాలరాముడు కలలోకొచ్చి
గుచ్చి గుచ్చి చెప్పినా
'వాళ్లు' వినలేదు! గుడినిమింగినా
లింగాన్నిమింగొద్దని
సామెత ఉంది! ఐనా లెక్కలేదు!
గుడినిమింగినవాళ్లు
చాలామంది ఉన్నారు!
లింగాన్నిమిగల్చబట్టి
భక్తులొచ్చేవాళ్ళు!
'వీళ్లు' అలాకాదుగా!
గుడినిలింగాన్ని
మొత్తంమింగేసారు!
అదివాళ్ళ అత్యాశ!
బంగారుబాతుకథ
ఇదీ తెలుసు 'వీళ్ళకి'!
రోజుకో బంగారు గుడ్డు!
ఆది చాలలేదు!
బాతునుకోసేశారు!
ఇంకేముంది ఐపాయె!
గుడిలేదు లింగంలేదు!
ఎంతకష్టం తెచ్చారు!
నీతి :'ధర్మ'కర్తలారా!
గుడిని మింగినా
లింగాన్ని మింగకండి!
దురాశ ఎంతో దుఃఖం!

-తమ్మినేని అక్కిరాజు

## పోరొక్కటే దారిప్పుడు..

జో లాలీ అహ లాలీ
జోజో లాలీ జో లాలీ..
గమ్మున బజ్జుకో లాలీ
లోలిపాప్లిస్తర్లే లాలీ..
ఉద్యోగుల ఆశలన్నీ
బూడిదేలే లాలీ..
పెన్షనర్ల కోరికలు
అగ్గి పాలే లాలీ..
నీతి లేని పాలనలో
మోసపోవుడే లాలీ..
హోపులన్నీ గంగలో
కలి పేసుడే లాలీ..
తోలు పెరికె వాడెల్లి
కండ పెర్కుడొచ్చె లాలీ..
పెనం మీంచి బతుకు
పొయిల వడెనే లాలీ..
ముష్టి లెక్క జెయ్యనీకె
మూడేండ్లెట్లాయ్ లాలీ..
పీఆర్సీ కమిటి గాళ్ళు
మనుషులేనా లాలీ..
డెమాక్రసీ ఇది ఎట్లవ్
బందిపోట్లె బెటరు లాలీ..
ఈ ఏడ్సే సర్కార్ల కన్నా
కసాయిల్మేల్గాదా లాలీ..
వామ్మో ఒకటి గాదు
రెండుగాదు లాలీ..
అవ్వ రెండూ మూడు
కానె గాదు లాలీ..
ఆరయినా డీ ఏ లూ
షరం లేకపోయే లాలీ..
మనకన్నా ఇంతనన్న
సోయి లేపాయె లాలీ..
ముక్కు దుడ్స మంటే
ముడ్డైనా సరేనని లాలీ
పోటా పోటీ ఉర్కులాడి
బోర్లవడ్డ నతీజిదే లాలీ..
సొంత లాభాల యావ
ఇంగెట్లుంటది లాలీ..
నాకిన కాడ నాల్కుంటదా
ముడ్డెన్క తోకైంది లాలీ..
పాత పెన్షన్ హామీలకు
పాత రేయవట్టిరి లాలీ..
హెల్తు కార్డు మాయ
ఝూట కూతలే లాలీ..
ఈ పొద్దు ఆపొద్దని
వాయిదాలేసిరే లాలీ..
కమిటి మీద కమిటంటే
సొల్లుకూతగాద లాలీ..
పోరొక్కటే దారిప్పుడు
ఐక్యత చెడొద్దు లాలీ..
పార్టీల భ్రమలొద్దు
లంగల మర్వొద్దు లాలీ..

డా. ఇక్బాల్ పాషా
9440775732

లక్షలాది ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపట్ల తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ దివాలాకోరు వాయిదా పన్నాగాల రంగుతేలుతున్న వేళ.. గొంతెత్తుతున్న నిరసన స్వరం..

# పర్యాటకం.. దేశ ప్రగతికి కొత్త ఆర్థిక ఇంధనం!

*సెప్టెంబర్ 27 వస్తుందంటే ప్రపంచ పర్యాటక దినోత్సవం గుర్తుకొస్తుంది. సాధారణంగా పర్యాటకం అంటే కొత్త ప్రదేశాలను చూడటం, ప్రకృతి అందాలను ఆస్వాదించడం, చారిత్రక కట్టడాలను సందర్శించడం, విశ్రాంతి తీసుకోవడం అనే భావన ఉంది. కానీ నేటి ప్రపంచంలో పర్యాటకం అంతకంటే ఎంతో విస్తృతమైనది. అది ఆర్థిక వ్యవస్థను కదిలించే శక్తి. లక్షలాది మందికి ఉపాధి కల్పించే రంగం. ఒక ప్రాంత సంస్కృతిని మరో ప్రాంతానికి పరిచయం చేసే వేదిక. చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే సాధనం. ప్రకృతి పరిరక్షణకు ఆర్థిక విలువను కల్పించే మార్గం. భిన్న సంస్కృతుల మధ్య అవగాహన, స్నేహం పెంచే మానవీయ వారధి.*



ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 27న నిర్వహిస్తున్నారు. 1980 నుంచి ఈ రోజును అధికారికంగా నిర్వహించడం ప్రారంభమైంది. ప్రపంచ పర్యాటక సంస్థకు సంబంధించిన చట్టబద్ధ పత్రాలు 1970 సెప్టెంబర్ 27న అమల్లోకి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 27ను ప్రపంచ పర్యాటక దినోత్సవంగా ఎంచుకున్నారు. పర్యాటక రంగం సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక ప్రాధాన్యంపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం.

నేడు ప్రపంచ పర్యాటక రంగం ఎంత పెద్ద ఆర్థిక శక్తిగా మారిందో గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 2025లో అంతర్జాతీయ పర్యాటకుల రాక 153.4 కోట్లకు చేరింది. 2024తో పోలిస్తే ఇది 4.9 శాతం పెరుగుదల. అదే సమయంలో ప్రపంచ పర్యాటక రంగం ద్వారా వచ్చిన విదేశీ మారక ఆదాయం సుమారు 1.884 ట్రిలియన్ డాలర్లుగా నమోదైంది. 2025లో ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక రంగం 36.6 కోట్ల ఉద్యోగాలకు మద్దతు ఇచ్చిందని ప్రపంచ ప్రయాణ, పర్యాటక మండలి అంచనా వేసింది. అంటే ప్రపంచంలో దాదాపు ప్రతి తొమ్మిది ఉద్యోగాల్లో ఒకటి పర్యాటక రంగంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధం కలిగి ఉంది.

భారతదేశానికి వస్తే పర్యాటక రంగం ప్రాధాన్యం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. భారత పర్యాటక శాఖ గణాంకాల ప్రకారం 2025లో దేశంలో దేశీయ పర్యాటకుల సందర్శనలు సుమారు 428.69 కోట్లు నమోదయ్యాయి. 2024తో పోలిస్తే దేశీయ పర్యాటక సందర్శనలు 45.6 శాతం పెరిగాయి. విదేశీ పర్యాటకుల సందర్శనలు కూడా 2.527 కోట్లకు చేరి 21.36 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2025లో అంతర్జాతీయ పర్యాటకుల రాక 20.22 మిలియన్లుగా నమోదైంది. ఇందులో 9.15 మిలియన్లు విదేశీ పర్యాటకులు కాగా, 11.07 మిలియన్లు విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల రాకలు.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గమనించాలి. భారతదేశ పర్యాటక రంగానికి ప్రధాన బలం విదేశీ పర్యాటకులు మాత్రమే కాదు. దేశీయ పర్యాటకమే అసలైన వెన్నెముక. కోట్లాది మంది భారతీయులు ప్రతి సంవత్సరం దేవాలయాలు, చారిత్రక ప్రాంతాలు, ప్రకృతి ప్రదేశాలు, సముద్ర తీరాలు, పర్వత ప్రాంతాలు, కుటుంబ విహార కేంద్రాలను సందర్శిస్తున్నారు. 2025లో దేశీయ పర్యాటక సందర్శనలు 428 కోట్లకు పైగా ఉండటం ఈ రంగం విస్తృతిని తెలియజేస్తోంది. పర్యాటకుడు ఒక ప్రాంతానికి వెళ్లినప్పుడు రవాణా, వసతి, ఆహారం, స్థానిక కొనుగోళ్లు, ప్రవేశ రుసుములు, మార్గదర్శక సేవలు వంటి అనేక రంగాల్లో ఖర్చు చేస్తాడు. ఆ డబ్బు స్థానిక ఆర్థిక వ్యవస్థలోకి ప్రవహిస్తుంది.

పర్యాటకం ఉద్యోగాల సృష్టిలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. భారత పర్యాటక శాఖ మూడో పర్యాటక ఉపగ్రహ ఖాతా అంచనాల ప్రకారం 2023-24లో దేశంలోని మొత్తం ఉద్యోగాల్లో పర్యాటక రంగానికి సంబంధించిన వాటా 13.34 శాతంగా ఉంది. అదే అంచనాల ప్రకారం దేశ స్థూల దేశీయోత్పత్తిలో పర్యాటక రంగం ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలతో 5.22 శాతం వాటా కలిగి ఉంది.

ప్రపంచ ప్రయాణ, పర్యాటక మండలి 2025 గణాంకాలు మరో కోణాన్ని చూపుతున్నాయి. దాని అంచనా ప్రకారం 2025లో భారత ప్రయాణ, పర్యాటక రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు 263.6 బిలియన్ డాలర్ల మేరకు తోడ్పడింది. ఈ రంగం 4.62 కోట్ల ఉద్యోగాలకు మద్దతు ఇచ్చింది. 2025లో ఈ రంగం 7.3 శాతం విస్తరించిందని ఆ సంస్థ పేర్కొంది. భారతదేశ పర్యాటక వ్యయంలో దేశీయ పర్యాటకుల వాటా 86 శాతంగా ఉందని కూడా తాజా నివేదిక వెల్లడించింది.

ఈ గణాంకాలన్నీ ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పర్యాటకాన్ని కేవలం సెలవుల రంగంగా చూడటం ఇక సాధ్యం కాదు. ఇది ఉపాధి, పెట్టుబడులు, రవాణా, హోటళ్లు, చిన్న వ్యాపారాలు, హస్తకళలు, ఆహార పరిశ్రమ, వినోదం, సమాచార సాంకేతికత వంటి అనేక రంగాలను అనుసంధానించే విస్తృత ఆర్థిక వ్యవస్థ.

తెలంగాణకు కూడా పర్యాటక రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయి. కాకతీయుల చరిత్రకు నిలయమైన వరంగల్, రామప్ప, వేయి స్తంభాల దేవాలయం, వరంగల్ కోట, భద్రకాళి దేవాలయం, లక్నవరం సరస్సు, బొగత జలపాతం వంటి ప్రాంతాలు చరిత్ర, సంస్కృతి, ప్రకృతి పర్యాటకానికి కేంద్రాలుగా అభివృద్ధి చెందగలవు. ముఖ్యంగా రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ గుర్తింపు రావడం తెలంగాణ చారిత్రక వైభవానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది. అయితే ఇలాంటి ప్రదేశాలను కేవలం సందర్శనా కేంద్రాలుగా కాకుండా స్థానిక ఆర్థికాభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

ఒక పర్యాటక ప్రాంతం అభివృద్ధి చెందితే అక్కడి హోటల్ యజమానికే లాభం కలగదు. స్థానిక వాహనదారుడు, చిరు వ్యాపారి, హస్తకళాకారుడు, గైడ్, ఫొటోగ్రాఫర్, ఆహార విక్రేత, కళాకారుడు, రైతు ఇలా అనేక వర్గాలకు ఆదాయ అవకాశాలు ఏర్పడతాయి. అందుకే గ్రామీణ పర్యాటకానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. నగరాల్లోని ప్రముఖ పర్యాటక కేంద్రాలపైనే ఆధారపడకుండా గ్రామాల్లోని చెరువులు, అడవులు, జలపాతాలు, జానపద కళలు, సంప్రదాయ వంటకాలు, హస్తకళలు, స్థానిక జీవన విధానాన్ని కూడా పర్యాటకంలో భాగం చేయాలి.

అయితే అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేస్తే పర్యాటక రంగానికే భవిష్యత్తులో ముప్పు ఏర్పడుతుంది. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, నీటి కాలుష్యం, చెత్త, అక్రమ నిర్మాణాలు, వాహన కాలుష్యం పెరిగితే ప్రకృతి ఆకర్షణ తగ్గిపోతుంది. పర్యాటకుడు ప్రకృతిని చూడటానికి వస్తాడు. ప్రకృతిని నాశనం చేసిన ప్రాంతానికి తిరిగి ఎందుకు వస్తాడు? అందుకే పర్యాటక అభివృద్ధికి పర్యావరణ పరిరక్షణ తప్పనిసరి.

స్థిరమైన పర్యాటకం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కీలక అంశంగా మారింది. నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ, పునరుత్పాదక ఇంధనం, ప్లాస్టిక్ నియంత్రణ, స్థానిక వనరుల పరిరక్షణ, జీవవైవిధ్య రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల సంఖ్య పెరగడమే అభివృద్ధికి కొలమానం కాకూడదు. అక్కడి ప్రకృతి ఎంతకాలం నిలిచి ఉంటుంది? స్థానిక ప్రజలకు ఎంత ఆదాయం వస్తుంది? యువతకు ఎన్ని ఉద్యోగాలు లభిస్తున్నాయి? స్థానిక సంస్కృతి ఎంతవరకు పరిరక్షించబడుతోంది? అనే ప్రశ్నలకు సమాధానం లభించినప్పుడే అది నిజమైన పర్యాటక అభివృద్ధి.

డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం పర్యాటక రంగానికి కొత్త అవకాశాలను తెరిచింది. ఒక చిన్న గ్రామంలోని పర్యాటక ప్రాంతం గురించి ప్రపంచానికి తెలియజేయడానికి ఇప్పుడు భారీ ప్రచార సంస్థ అవసరం లేదు. ఒక మంచి చిత్రీకరణ, ఆకర్షణీయమైన సమాచార వీడియో, సామాజిక మాధ్యమ ప్రచారం ద్వారా ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంది. కృత్రిమ మేధస్సు, డిజిటల్ పటాలు, ఆన్‌లైన్ టికెట్లు, డిజిటల్ చెల్లింపులు, బహుభాషా సమాచార వ్యవస్థలు పర్యాటక అనుభవాన్ని మరింత సులభతరం చేస్తున్నాయి.

అయితే సాంకేతికతకు మించి మానవీయతే పర్యాటకానికి అసలు బలం. ఒక పర్యాటకుడు ఒక ప్రాంతాన్ని గుర్తుంచుకోవడానికి అక్కడి కట్టడం మాత్రమే కారణం కాదు. అక్కడి ప్రజల ఆతిథ్యం, ఆహారం, సంస్కృతి, ప్రవర్తన, భద్రత, పరిశుభ్రత కూడా అతని అనుభవాన్ని నిర్ణయిస్తాయి. భారతీయ సంస్కృతిలోని "అతిథి దేవో భవ" భావన పర్యాటక రంగానికి ఎంతో విలువైన సందేశాన్ని ఇస్తుంది. పర్యాటకం దేశాల మధ్య స్నేహాన్ని, పరస్పర అవగాహనను పెంచగలదని ప్రపంచ పర్యాటక సంస్థ కూడా వివిధ సందర్భాల్లో స్పష్టం చేసింది.

భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలనే లక్ష్యాన్ని పెట్టుకున్న నేపథ్యంలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేయడం అవసరం. మౌలిక వసతులు, రహదారులు, రైలు, విమాన సౌకర్యాలు, పరిశుభ్రత, భద్రత, పర్యాటక సమాచార కేంద్రాలు, శిక్షణ పొందిన మార్గదర్శకులు, స్థానిక ఉత్పత్తుల మార్కెటింగ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే సమయంలో చారిత్రక వారసత్వాన్ని కాపాడుతూ కొత్త తరానికి పర్యాటక రంగంలో నైపుణ్యాలను అందించాలి.

ప్రపంచ పర్యాటక దినోత్సవం మనకు ఇచ్చే సందేశం ఒక్కటే---ప్రపంచాన్ని చూడాలి, కానీ ప్రపంచాన్ని మార్చివేయకూడదు. ప్రకృతిని ఆస్వాదించాలి, కానీ ప్రకృతిని నాశనం చేయకూడదు. చరిత్రను తెలుసుకోవాలి, కానీ చారిత్రక వారసత్వాన్ని దెబ్బతీయకూడదు. స్థానిక సంస్కృతిని అనుభవించాలి, కానీ దానిని అవమానించకూడదు. పర్యాటకం ద్వారా సంపద సృష్టించాలి, అయితే ఆ సంపద స్థానిక ప్రజలకు కూడా చేరాలి.

పర్యాటకం ఒక ప్రయాణం మాత్రమే కాదు... అది ఆర్థిక ప్రగతికి అడుగు, సంస్కృతుల మధ్య వారధి, ఉపాధికి మార్గం, ప్రకృతి పరిరక్షణకు బాధ్యత. పర్యాటక ప్రదేశాలను మన తరానికి మాత్రమే కాకుండా రాబోయే తరాలకు కూడా అందంగా, పరిశుభ్రంగా, సురక్షితంగా అందించగలిగినప్పుడే సెప్టెంబర్ 27న జరుపుకునే ప్రపంచ పర్యాటక దినోత్సవానికి నిజమైన అర్థం లభిస్తుంది. ప్రపంచాన్ని చూసే కళ్లతో పాటు ప్రపంచాన్ని కాపాడే బాధ్యత కూడా మనలో ఉండాలి. అదే బాధ్యతాయుత పర్యాటకం... అదే భవిష్యత్ పర్యాటకానికి దిశానిర్దేశం.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

## కుల గోడలకు సవాల్ విసిరిన
# సమానత్వ స్వరం

**(శ్రీ నారాయణ గురు వర్ధంతి సెప్టెంబర్ 20)**



"“ఒకే కులం.. ఒకే మతం.. ఒకే దేవుడు.. మనిషికి" అనే మానవతా మహాసందేశంతో కుల వివక్ష, మత ఆధిపత్యం, సామాజిక అసమానతలపై తిరుగుబాటు స్వరం వినిపించిన గొప్ప వ్యక్తి శ్రీ నారాయణ గురు. ఆయన కేరళ సమాజాన్నే కాదు, భారత సమాజాన్ని కదిలించిన సమానత్వ విప్లవ స్ఫూర్తి. వేల సంవత్సరాలుగా కులం పేరుతో మనిషిని మనిషి నుంచి వేరు చేసిన సామాజిక వ్యవస్థపై ఆయన పోరాటం చేశారు. పుట్టుక ఆధారంగా మనిషి విలువను నిర్ణయించే భావజాలాన్ని ప్రశ్నిస్తూ, విద్య, సంఘటితం, ఆత్మగౌరవం, సామాజిక సంస్కరణలను విముక్తి మార్గాలుగా చూపించారు. నారాయణ గురు కేవలం ఆధ్యాత్మిక గురువు కాదు, సామాజిక పరివర్తనకు దారిచూపిన సంస్కర్త. ఆయన 1856 ఆగస్టు 20న కేరళలోని చెంపజంతి గ్రామంలో జన్మించారు. కుల వివక్ష, సామాజిక అసమానతలపై జీవితాంతం పోరాడిన ఆయన 1928 సెప్టెంబర్ 20న శివగిరిలో పరమపదించారు. దేవాలయ ప్రవేశం, విద్య, సామాజిక గౌరవం వంటి హక్కుల కోసం అణగారిన వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచారు. అరువిప్పురంలో శివప్రతిష్ఠ చేపట్టి, కుల ఆధిపత్యం ఉన్న మతవ్యవస్థపై నారాయణ గురు బలమైన సామాజిక--భావజాలానికి సవాలు విసిరారు. ఆయన స్థాపించిన శ్రీ నారాయణ ధర్మ పరిపాలన (ఎస్ఎన్డీపీ) యోగం సామాజిక సంఘటితతకు వేదికగా ఎదిగింది.

నారాయణ గురు మనిషిని కులం నుంచి విముక్తి చేసి మానవత్వం, సమానత్వం వైపు నడిపించాలని ఉద్యమించాడు. కుల వివక్షను కేవలం మాటల్లో ఖండించడం కాకుండా, విద్యను ఆయుధంగా, సంఘటిత శక్తిని మార్పు సాధనంగా ఉపయోగించాలనే దిశను చూపించారు.

నేడు కుల వివక్ష, అంటరాని తనం కొత్త రూపాల్లో కొనసాగుతున్నప్పుడు నారాయణ గురు ఆలోచనలు మరింత ప్రాసంగికంగా మారుతున్నాయి. ఈ దేశంలో భూమి, సంపద, అధికారం అగ్రకులాల ఆధిపత్యంలో కేంద్రీకృతమైన నేపథ్యంలో, కుల గోడలను కూల్చడం ఒక్కటే సరిపోదు, అణగారిన వర్గాలకు భూమి, సంపద, విద్య, రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికారంలో సమాన వాటా దక్కేలా పోరాడాల్సిన అవసరత ఉంది. ఈ సందర్భంగా బీసీ-ఎస్సీ-ఎస్టీ కులాలను చైతన్యపరచి, జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికారంలో వాటా సాధించే దిశగా ముందుకు సాగాలి. కుల ఆధిపత్యాన్ని అంతం చేయాలంటే అణగారిన వర్గాలు తమ సంఖ్యాబలాన్ని సామాజిక, రాజకీయ శక్తిగా మలచుకోవాలి. ఉత్తరప్రదేశ్‌లో కాన్షీరామ్ నిర్మించిన బహుజన రాజకీయ చైతన్యం, నేడు తెలంగాణలో డాక్టర్ విశారదన్ మహారాజ్ "ఎవరి కులమెంతో వారికి అంత వాటా" అనే నినాదంతో సాగుతున్న బహుజన చైతన్య ఉద్యమం ఇదే దిశలో ముందుకు పోతుంది. మనిషిని కులం నిర్ణయించే సమాజం నుంచి, సమాన హక్కులు-సమాన ప్రాతినిధ్యం నిర్ణయించే సమాజం వైపు అడుగులు వేయడమే నారాయణ గురు ఆశయాలకు నిజమైన నివాళి.

ఇదే నారాయణ గురు చూపిన మానవ సమానత్వ మార్గం. ఇదీ శివునీ సమానత్వానికి కొనసాగింపు కూడా.



**సంపతి రమేష్ మహారాజ్**
సామాజిక విశ్లేషకులు
7988579428



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లోని ప్రముఖ విద్యాసంస్థల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చేపట్టిన ఆకస్మిక తనిఖీలు తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. మరోవైపు, ప్రభుత్వ నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో పాటు, కాలేజీ యాజమాన్యాల వేధింపులతో ఇంజనీరింగ్ విద్యార్థులు అక్షరాలా నరకం అనుభవిస్తున్నారు.

# విద్యాసంస్థలపై.. విజిలెన్స్

## సోదాలతో యాజమాన్యాల ఉక్కిరిబిక్కిరి

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల మోత
- నరకయాతన అనుభవిస్తున్న విద్యార్థులు
- ఒరిజినల్ సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు గల్లంతు
- సర్టిఫికెట్లు ఇవ్వకుండ కాలేజీల వేధింపులు
- నిధుల లేమితో విద్యార్థులపై తీవ్ర ప్రభావం
- చదువు ముగిరాగానే సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశాలు
- ప్రభుత్వ ఆదేశాలను బేకాతరు చేస్తున్న వైనం

**రంగారెడ్డి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** ప్రధాన విద్యాసంస్థల్లో సోదాలు.. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీ, సీవీఆర్, శ్రీ ఇందు తదితర ఇంజనీరింగ్ కళాశాలల్లో శనివారం ఉదయం నుంచి విజిలెన్స్ అధికారులు అత్యంత రహస్యంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. కళాశాలల్లో విద్యార్థుల వాస్తవ సంఖ్య, ప్రవేశాల వివరాలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ లెక్కలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఏ మేరకు ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాలు నిబంధనలను పాటిస్తున్నాయన్న అంశాలపై ఆరా తీస్తున్నారు. అనేక కళాశాలలో విద్యార్థులు లేకుండానే విద్యార్థులు హాజరుకాకుండానే కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తరగతులు బోధిస్తున్నట్లుగా రికార్డులను సృష్టిస్తూ ప్రభుత్వ దాదాయాన్ని ఈ గండి కొడుతున్నారు అన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ దాడులకు ఆదేశాలు జారీ చేసింది అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాలలపై విజిలెన్స్ దాడులు కొనసాగుతున్నాయి.

### నిధుల లేమి.. విద్యార్థులపై తీవ్ర ప్రభావం

ఇదిలా ఉంటే, గత నాలుగైదు సంవత్సరాలుగా ప్రభుత్వ విద్యా దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. ఈ ఆర్థిక భారం పూర్తిగా విద్యార్థులపై పడుతోంది. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న విద్యార్థులకు నిరాశే ఎదురువవుతోంది. ఇంటర్వ్యూలు సాధించినా, జాబ్స్ వచ్చినా సరైన సమయంలో సర్టిఫికెట్లు చేతికి అందక అనేక మంది ఉజ్వల అవకాశాలను కోల్పోతున్నారు. ఫీజు బకాయిలు చెల్లిస్తేనే ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇస్తామని ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు మొండికేస్తున్నాయి. డబ్బులు చెల్లించలేని పేద, మధ్యతరగతి విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ తిరుగుతూ తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఓవైపు విద్యార్థులు చదువులు పూర్తయిన వెంటనే సర్టిఫికెట్లను కళాశాల యాజమానులు తమ వద్ద పెట్టుకోకుండా విద్యార్థులు చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్న పట్టించుకోవడం లేదు. సర్టిఫికెట్లు కావాలంటే ఫీజు చెల్లించాల్సిందేనని మొండి పట్టుబడుతున్నాయి. దాంతో అనేకమంది నిరుద్యోగులు ఒరిజినల్ సర్టిఫికెట్లు లేక ఇంటర్వ్యూలకు హాజరు కాలేక ఉన్నత ఉద్యోగాలు సైతం వదులుకోవాల్సిన పరిస్థితిని ఏర్పడిందని మనోవేదనకు గురవుతున్నారు. ఒకవైపు ప్రభుత్వ విజిలెన్స్ సోదాలు కాలేజీ యాజమాన్యాల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తుంటే.. మరోవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక, సర్టిఫికెట్లు ఇవ్వక కాలేజీలు పెడుతున్న హింసను భరించలేక తాము నరకం చూస్తున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, అలాగే సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### విద్యార్థులను వేధించవద్దు

**సీపీఐ మండల కార్యదర్శి కావలి సురేష్**



ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ ఇస్తున్నామని చెప్తున్నా వాస్తవంగా నిధులు విడుదల కావడం లేదు. ఫీజు బకాయిల కారణంగా ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా తమ వద్దనే పెట్టుకుంటున్నాయి. తద్వారా విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించాలంటే ఒరిజినల్ సర్టిఫికెట్లు అందుబాటులో లేవు. ఫీజు బకాయిలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటుంది. లక్షల రూపాయలు పేద విద్యార్థులు ఎక్కడినుంచి తీసుకొచ్చి కడతారు. ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ ఇస్తామంటేనే ఇంజనీరింగ్ విద్యాభ్యాసం చేశారు. ఇప్పుడు ఫీజు రీయంబర్స్మెంట్ రాకపోవడం వల్ల కళాశాలలు సర్టిఫికెట్ జారీ విషయంలో మొండికేస్తున్నాయి. ఇలాంటి కళాశాలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చదువు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలి.




# నిమ్స్‌లో ఫార్మాకోవిజిలెన్స్ అవగాహన ర్యాలీ

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలు-2026లో భాగంగా నిమ్స్ క్లినికల్ ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యం లో శనివారం ఫార్మాకోవిజిలెన్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'ప్రమోటింగ్ రేషనల్ యూస్ ఆఫ్ మెడిసిన్స్ త్రు ఫార్మాకోవిజిలెన్స్' అనే థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమంలో మందుల దుష్ప్రభా వాలను(ఏడీఆర్ఎస్) గుర్తించి, సకాలంలో నివేదించడం, మందులను వైద్యుల సలహా మేరకు మాత్రమే వినియోగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. నిమ్స్ డైరెక్టర్ ప్రొ.రాహుల్ దేవరాజ్, డీన్ డాక్టర్ పి.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ పరమజ్యోతి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారెడ్డి, క్లినికల్ ఫార్మకాలజీ హెడ్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, మెడికల్ ఆంకా లజీ ప్రొఫెసర్ డాక్టర్ మెహర్ లక్ష్మి, ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్, అడిషనల్ ప్రొఫెసర్, పీవీ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జి.శ్రీనివాస్, డాక్టర్ మాధవితో పాటు రెసిడెంట్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కప్పపహాడ్‌లో.. పామాయిల్ పంట ధ్వంసం

### పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతు



**రంగారెడ్డి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామంలో పామాయిల్ పంటను కొందరు దుండగులు ధ్వంసం చేశారు. ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం ఇబ్రహీంపట్నం పోలీసులకు రైతు దొరస్వామి నాయుడు ఫిర్యాదు చేశారు. బాధిత రైతు దొరస్వామి నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. కప్పపహాడ్ గ్రామంలో 10 ఏళ్ల క్రితం సర్వే నంబర్ 150లో భూమిని కొనుగోలు చేసి, అప్పటి నుంచి సాగు చేసుకుంటున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన ప్రభాకర్, దేవదాస్, బుగ్గరాములు తదితరులు శుక్రవారం రాత్రి పొలంలోకి ప్రవేశించి పామాయిల్ చెట్లను పీకేసి పంటను నాశనం చేశారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న దొరస్వామి నాయుడు వెంటనే ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంట నష్టాన్ని పరిశీలించారు. ఈ మేరకు శనివారం బాధితుడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో కావాలని కొంతమంది వ్యక్తులు ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతూ అశాంతిని రేకెత్తిస్తున్నారని భాదిత రైతు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భూమి విషయమై స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ కొంతమంది వ్యక్తులు ఇలాంటి దచర్లకు పాల్పడుతున్నారని తెలిపారు. కోర్టు అధికారాలను ధిక్కరిస్తూ పంటను దోషం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దోషులపై కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

# సీఎం నియోజకవర్గంలో కరెంటు ఉంటది ఎట్లా.? స్పీకర్ నియోజకవర్గంలో ఉండదు ఎట్లా.?

- కరెంట్ కోతలపై మోమిన్ కలాన్ రైతుల కన్నెర్ర.. సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా
- ఏఈని నిలదీసిన రైతులు... వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్



**ధారూర్,సెప్టెంబర్ 19(జనంసాక్షి) :** వ్యవసాయానికి విద్యుత్ కోతలు విధించడంపై ధారూర్ మండలం మోమిన్ కలాన్ గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.కరెంట్ కోతలను నిరసిస్తూ రైతులు ర్యాలీగా తరలివచ్చి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా రైతులు విద్యుత్ శాఖ ఏఈ వేణుగోపాల్‌రెడ్డిని నిలదీశారు.వ్యవసాయ బోర్లకు సక్రమంగా విద్యుత్ అందకపోవడంతో పంటలకు నీరందించలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం,సరఫరాలో అంతరాయాలతో మోటార్లు నడవక సాగునీటి సమస్య ఎదురవుతోందని తెలిపారు.సీఎం నియోజకవర్గంలో కరెంటు ఉంటది ఎట్లా.? స్పీకర్ నియోజకవర్గంలో కరెంట్ ఉండదు ఎట్లా.?అంటూ రైతులు ప్రశ్నించారు. ప్రజాప్రతినిధుల నియోజకవర్గాల్లోనే రైతులకు విద్యుత్ కష్టాలు ఎదురైతే తమ పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు కీలకమైన సమయంలో విద్యుత్ కోతలు విధిస్తే పెట్టుబడులు పెట్టిన రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతుల ఆందోళనపై ఏఈ వేణుగోపాల్‌రెడ్డి స్పందిస్తూ విద్యుత్ కొరత కారణంగా ఆశించిన స్థాయిలో సరఫరా చేయలేకపోతున్నామని వివరించినట్లు రైతులు తెలిపారు.సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సరఫరా మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.వ్యవసాయానికి నాణ్యమైన,నిరంతర విద్యుత్ అందించాలని, తరచూ ఏర్పడుతున్న కోతలు,అంతరాయాలకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు డిమాండ్ చేశారు.సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాజుగుప్త, మున్నీర్,ఆమీర్,హరీష్ రావు, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.




# జన్వాడ భూముల కథలో కొత్త మలుపు

### అఫిడవిట్ నుంచి భూ బదిలీల వరకు.. అసలు యజమాని ఎవరు..?

**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 19 (జనం సాక్షి) :** జన్వాడ ఫామ్‌హౌస్ భూముల వ్యవహారం మరోసారి రాజకీయ చర్చకు దారితీస్తోంది. సర్వే నంబర్లు 301, 311, 313లలోని భూములకు సంబంధించి యాజమాన్య హక్కులు,భూ బదిలీలు,నిర్మాణ అనుమతులపై కొత్త ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా 2023 ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తికి సంబంధించిన వివరాలు,ప్రస్తుతం ప్రదీప్‌రెడ్డి చేస్తున్న యాజమాన్య ప్రకటనల మధ్య స్పష్టత అవసరమని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు.ఫామ్‌హౌస్ ఉన్న భూములను గతంలో ఎవరు కలిగి ఉన్నారు..?ఏయే దశల్లో భూములు బదిలీ అయ్యాయి..? ప్రస్తుతం రికార్డుల్లో యాజమాన్యం ఎవరి పేరుపై ఉంది? అనే అంశాలపై అధికారిక రికార్డులను బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఫామ్‌హౌస్ భూములకు సంబంధించి 2015--16 మధ్యకాలంలో ట్రిబ్యునల్ పరిధి,ఈడీ పరిధి వంటి అంశాలు తెరపైకి వచ్చాయని, అలాంటి పరిస్థితుల్లో భూములు ఎలా విడుదలయ్యాయి..? వాటి బదిలీలకు సంబంధించిన అనుమతులు, ఉత్తర్వులు ఏమిటి? అనే ప్రశ్నలను కాంగ్రెస్ నాయకులు లేవనెత్తుతున్నారు. డీఎన్‌యూ సంస్థ నుంచి రాజేష్ పేరుకు, అనంతరం రాజేష్ నుంచి ప్రదీప్‌రెడ్డికి భూములు ఎలా బదిలీ అయ్యాయన్న అంశంపైనా వారు వివరణ కోరుతున్నారు.ఫామ్‌హౌస్ నిర్మాణాలపై కూడా వివాదం కొనసాగుతోంది.ఫిరంగి నాలా పరిధి, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, జీవో 111 నిబంధనలకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘించారా? నిర్మాణాలకు ఏవైనా అనుమతులు ఉన్నాయా..? ఉంటే వాటిని ఏ సంస్థలు మంజూరు చేశాయి..? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు, ఫామ్‌హౌస్ తన స్నేహితుడు ప్రదీప్‌రెడ్డికి చెందినదని,తాను లీజుకు మాత్రమే తీసుకున్నానని కేటీఆర్ గతంలో వెల్లడించారు. జన్వాడలోని నాలుగు ఎకరాల ఆస్తి చట్టబద్ధంగా తనదేనని ప్రదీప్‌రెడ్డి స్పష్టం చేశారు.దీంతో ఇప్పుడు ప్రధానంగా భూముల అసలు యాజమాన్యం, రిజిస్ట్రేషన్, బదిలీ చరిత్ర, ఎన్నికల అఫిడవిట్‌లోని వివరాలు, నిర్మాణ అనుమతులు, భూములపై ఉన్న ఆంక్షలు-విడుదల ఉత్తర్వులు వంటి అంశాలపై దృష్టి సారించింది. సంబంధిత శాఖల అధికారిక రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, కోర్టు/ట్రిబ్యునల్ ఉత్తర్వులు వెలుగులోకి వస్తేనే జన్వాడ భూముల వ్యవహారంలో వాస్తవ పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# 'సీఐఐ-జీబీసీ' జాతీయ స్థాయి వేదిక ఏర్పాటు



**ఖైరతాబాద్, సెప్టెంబర్ 19 (జనం సాక్షి) :** శక్తి సామర్థ్యం, సుస్థిరత రంగాల్లో పరిశోధనను పరిశ్రమల ఆచరణాత్మక అవసరాలతో అనుసంధా నించేందుకు సీఐఐ-గ్రీన్ బిజినెస్ సెంటర్(సీఐఐ-జీబీసీ) జాతీయ స్థాయి వేదికను ఏర్పాటు చేస్తోం దని ఐఐ-జీబీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎస్. వెంకటగిరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన 25వ సిఐఐ ఎనర్జీ ఎఫిషి యెన్సీ సమ్మిట్-2026లో 'తక్కువ కార్బన్ టెక్నాల జీలు, శక్తి సామర్థ్యం'పై 40కి పైగా పరిశోధనా పత్రా లు అందగా, 18 పత్రాలను ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు తెలిపారు. పారిశ్రామిక డీకార్బనైజేషన్, పునరుత్పాదక శక్తి, బయోఫ్యూయల్స్, సిమెంట్, సర్క్యులర్ ఎకానమీ, ఏఐ తదితర అంశాలపై పరిశోధనలు ప్రదర్శనలు జరిగాయన్నారు. పరిశో ధనలను పైలట్లు, పరిశ్రమ భాగస్వామ్యాలు, ప్రాజెక్టులుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. జ్యూ రీ సభ్యులు ప్రొ.జ్యోతిర్మయ్ మాథుర్, ప్రొ.మోరపాకల శ్రీనివాస్, ప్రొ.విజయలక్ష్మి తాటిపర్తి తదితరు లు పాల్గొన్నారు.

### మహిళా పోలీసుల నైపుణ్యాభివృద్ధికి టీజీపీఏ- యుఎంఈఈడి భాగస్వామ్యం

**రాజేంద్రనగర్,సెప్టెంబర్19(జనంసాక్షి) :** మహిళా పోలీసులకు సేవ చేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందని యుఎం ఈఈడి కో-ఫౌండర్, ప్రెసిడెంట్ గౌరీ మహేంద్ర పేర్కొన్నారు.మహిళా పోలీసు సిబ్బంది వృత్తిపరమైన అభివృద్ధి, ఆత్మవి శ్వాసం, నాయకత్వ లక్షణాలు, సామర్థ్యాల పెంపు కోసం ఆర్బీవిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ యుఎంఈఈడి ఎన్జీఓ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఏకశిల అడ్మినిస్ట్రేటివ్ భవనంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఉదితా చద్దా ఎంఓయుపై సంతకాలు చేశారు.ఈ సందర్భంగా అభిలాష బిస్త్ మాట్లాడుతూ మహిళా పోలీసులకు నిరంతర మార్గదర్శకత్వం, మెంటరింగ్, ప్రోత్సాహం అవసరమన్నారు. యుఎంఈఈడి సహకారంతో వ్యక్తిత్వ వికాసం, నాయకత్వం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వృత్తిపరమైన సామర్థ్యాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ చేతన, మురళీధర్, వెంకటేశ్వర్లు, కెఆర్కె. ప్రసాద్, ఇతర అధికారులు, యుఎంఈడి ప్రతినిధులు పాల్గొన్నారు.

# పార్టీ ఫిరాయింపులకు హైకోర్టు తీర్పు గుణపాఠం

- హైకోర్టు తీర్పు బీఆర్ఎస్ న్యాయ పోరాటానికి విజయం
- బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి
- దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ భవన్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు



**ఖైరతాబాద్, సెప్టెంబర్ 19 (జనం సాక్షి) :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతకు సంబంధించి తెలంగాణ హైకోర్టు తీర్పును స్వాగ తిస్తూ ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగా ణ భవన్ ఏదుట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా మన్నె గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇది బీఆర్ఎస్ న్యాయ పోరాటానికి దక్కిన విజయం ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు బీఆర్ఎస్ చేసిన పోరాటానికి ఈ తీర్పు బలం చేకూర్చింది అన్నారు. పార్టీ మారి ప్రజల తీర్పును అవమానించిన వారికి ఈ తీర్పు ఒక గుణపాఠం అని చెప్పారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రోత్సహి ంచిన ఫిరాయింపు రాజకీయాలకు ఈ తీర్పు చెంపపెట్టు అన్నారు. అని బీఆర్ఎస్ తరఫున గెలిచి అనంతరం కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్ వ్యవహారంపై దాఖలైన అనర్హత పిటిషన్లను హైకోర్టు విచారిం చింది. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ అనంతరం కోర్టు తాజా తీర్పు వెలువరించిన నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి.ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజ కవర్గ మాజీ కార్పొరేటర్లు వెల్లండ వెంకటేష్, మహేష్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారులు రామ్ చందర్, నరసింహ, ప్రభాకర్ రెడ్డి, బిట్ల శ్రీనివాస రాజు, శశిరాజ్, ధనరాజ్, వెంకీ ముదిరాజ్, హైమద్, యూసుఫ్ బాయ్, ముత్తుంజ, నవీన్ నాయక్, ముస్తాక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# శామీర్‌పేట్ ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం

- ఆగి ఉన్న మినీ వ్యాన్‌ను వెలకాల నుండి ఢీ కొట్టిన టాటా ట్రక్ వాహనం
- ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి



**శామీర్ పేట్, సెప్టెంబర్ 19(జనం సాక్షి)** శామీర్ పేట్ ఔటర్ రింగ్ రోడ్డు మార్గంలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. శామీర్ పేట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేగుంట నుండి స్క్రాప్ లోడుతో అశోక్ లేలాండ్ వాహనంలో శామీర్ పేట్ ఓఆర్ఆర్ నుండి కీసర వైపు వెళ్తుండగా మార్గ మధ్యలో శామీర్ పేట్ కు చేరుకోగానే వారి వాహనం టైర్ పంచర్ కావడంతో టైర్ మార్చేందుకు రింకు, ఇబ్రహీం ప్రయత్నిస్తుండ గా ఇస్మాయిల్, హుస్సేన్ వాహనం కింద ఉన్నారు. అదే సమయంలో వెనుక నుంచి అతివేగంగా దూసుకొచ్చిన టాటా ట్రక్ సదరు మినీ వ్యాన్‌ను అత్యంత బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రింకు, ఇస్మాయిల్, హుస్సేన్ అక్కడిక్కడే మృత్తి చెందాగా మరో వ్యక్తి ఇబ్రహీం కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రక్ డ్రైవర్ నాగరాజు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న శామీర్ పేట్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనంతరం మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, ప్రమాదానికి గల పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- రైతు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే కాలే యాదయ్య



చేవెళ్ల, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) రైతు అభివృద్ధి, వ్యవసాయ అభివృద్ధి, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలకు చెందిన రైతులకు తెల్ల కుసుమ విత్తనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించుకుని మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సదుపాయాలను అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గ రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజా ఆగిరెడ్డి, పైండ్ల మధుసూధన్‌రెడ్డి, మద్దెల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, చేవెళ్ల, శంకర్పల్లి మండల పార్టీ మున్సిపల్ పట్టణ అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ లు పడాల ప్రభాకర్, జాంగిర్, వీరేందర్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్గారి కార్తిక్ రెడ్డి, పార్టీ నాయకులు గుండాల రాములు, మద్దెల చింటు, టేకులపల్లి శ్రీనివాస్, కర్నె శివప్రసాద్, అధికారులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఆర్‌కే పురం ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ పనులు వేగవంతం చేయాలి
- నిమజ్జన ఏర్పాట్లపై కమిషనర్ విస్తృత పరిశీలన
- పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలి
- టీడీఆర్, సమ్మతి ప్రక్రియలు పూర్తి చేయాలి



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 19 (జనం సాక్షి):** నేరెడ్‌మెట్‌లోని రామకృష్ణాపురం ఫ్లైఓవర్ (ఆర్‌ఓబీ), రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) పనుల్లో పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. జోనల్ కార్యాలయంలో ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించిన ఆయన.. ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే ఆస్తి యజమానులతో చర్చించి టీడీఆర్ దరఖాస్తులు, సమ్మతి ప్రక్రియలను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, న్యాయ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రయాణ సమయం ఆదా అవుతుందన్నారు.

అంతకుముందు మౌలాలి, మల్కాజిగిరి సర్కిళ్లలో నిమజ్జన ఏర్పాట్లు, రహదారులు, వీధి దీపాల నిర్వహణను కమిషనర్ పరిశీలించారు. వెంకటేశ్వరనగర్‌లో స్థానికుల సమస్యలు తెలుసుకుని వీధి దీపాల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దీన్‌దయాల్‌నగర్ మార్గంలో చెట్ల కొమ్మల తొలగింపు పనులను పరిశీలించి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. బండ చెరువు బేబీ పాండ్ వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను సమీక్షించి భక్తులకు ఇబ్బందులు లేకుండా 24 గంటలు సేవలు అందుబాటులో ఉంచాలని, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, డీసీ బాలకృష్ణ ప్రసాద్, ఎస్ఈ లక్ష్మణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# క్యువిఎస్ఈ ఫేక్ యాప్ పేరిట రూ.13.25 లక్షల సైబర్ మోసం

### ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లతో జాగ్రత్త

### అపరిచిత యాప్‌లను నమ్మి మోసపోవద్దు

### పట్టణ సీఐ కమలాకర్



**జడ్చర్ల, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** అధిక లాభాలు, డాలర్ల రాబడుల పేరుతో రూ. 13.25 లక్షల మోసానికి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జడ్చర్ల పట్టణ సీఐ కమలాకర్ శనివారం తెలిపారు. క్యువిఎస్ఈ యాప్‌లో పెట్టుబడి పెడితే లాభాలొస్తాయని ఓ వ్యక్తి నమ్మించడంతో పలువురు బాధితులు అతడు పంపించిన లింక్ ద్వారా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నారు. ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపి, యాప్‌లో సొమ్ము పెరుగుతున్నట్లు కనిపించడంతో బంధువులు, మిత్రుల వద్ద సేకరించిన మొత్తం రూ. 13,25,000- పెట్టుబడి పెట్టారు. అయితే, ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సెప్టెంబర్ 18న కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆన్‌లైన్ ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లను నమ్మవద్దని సూచించారు. స్క్రీన్‌పై లాభాలు కనిపించినంత మాత్రాన అది నిజమైన పెట్టుబడి కాదన్నారు. తెలియని లింక్‌లు క్లిక్ చేయకూడదని, ఓటిపి, యూపీఐ పిన్, బ్యాంక్ వివరాలు ఎవరికీ వెల్లడించవద్దని, మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనుమానాస్పద స్కీమ్‌లను ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ కమలాకర్ హెచ్చరించారు.

# జాతీయ లోక్‌అదాలత్‌లో జోగుళాంబ గద్వాల జిల్లాకు నాలుగో స్థానం

### కోఆర్డినేషన్ సమావేశంలో అభినందించిన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కే. కళ్యాణ్ చక్రవర్తి

### లోక్‌అదాలత్ విజయవంతానికి కృషిచేసిన కోర్టు డ్యూటీ అధికారులకు ప్రశంసా పత్రాలు



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 19(జనంసాక్షి) :** జోగుళాంబ గద్వాల జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో శనివారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కే. కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. న్యాయపరమైన అంశాలు, వివిధ శాఖల మధ్య సమన్వయం, పెండింగ్ కేసుల పరిష్కారం, ప్రజలకు సత్వర న్యాయం అందించే విధానాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. న్యాయశాఖతో పాటు పోలీస్,రెవెన్యూ తదితర శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించే అంశాలపై అధికారులు చర్చించారు. అనంతరం సెప్టెంబర్ 12న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో జోగుళాంబ గద్వాల జిల్లా నాలుగో స్థానం సాధించడంపై ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కే. కళ్యాణ్ చక్రవర్తి లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయడంలో సమన్వయంతో పనిచేసిన అధికారులు, సిబ్బంది కృషిని ప్రశంసించారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కీలకంగా పనిచేసిన కోర్టు డ్యూటీ అధికారులను ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కే. కళ్యాణ్ చక్రవర్తి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ టి శ్రీనివాసరావు లోక్‌అదాలత్ లక్ష్యాలను సాధించేందుకు అంకితభావంతో విధులు నిర్వర్తించిన అధికారుల సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ సమావేశానికి జిల్లా అదనపు ఎస్పీ కే. శంకర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుమోహన్, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య, గద్వాల అలంపూర్ శాంతినగర్ సర్కిల్ ఆఫీసర్స్, తదితర అధికారులు హాజరయ్యారు.

# సాగునీటి కోసం రోడెక్కిన రైతాంగం



**ధరూరు,సెప్టెంబర్ 19 (జనం సాక్షి)** జూరాల ప్రాజెక్టు నుంచి కుడి కాలువకు సాగు నీరందించాలని రోడ్డు దిగ్బంధం.. పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదనజూరాల కుడికాలువ వద్ద నిలిచిపోయిన వాహనాల రాకపోకలు..రైతులకు సంఘీభావం తెలిపిన భారతీయ జనతా పార్టీ ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడికాలువకు నీరు వదలాలని జూరాల డ్యాం వద్ద నిర్వహిస్తున్న రైతుల ధర్నాకు బీజేపీ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. జిల్లా యువ నాయకురాలు డీకే.స్నిగ్ధ రెడ్డి, బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు రైతులకు సంఘీభావం తెలిపి వెంటనే కుడి కాలువకు నీటిని విడుదల చేసి పంటలు కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేష్ అయ్యా, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు హన్మంత రాయ్, రజక నరసింహా, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పాండు, మోహన్ రెడ్డి, రైతులు తదితరులు హాజరయ్యారు..రైతుల ఆవేదన - అదనపు సమాచారం:రెక్కల ముక్కలు చేసుకొని, అప్పులు తెచ్చి సాగు చేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే రైతుల గుండెలు తరుక్కుపోతున్నాయి. చేతికొచ్చే దశలో ఉన్న పంట నీరు లేక మాడిపోతుండటంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. రాత్రి పగలు కష్టపడి పండించిన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతోందని, తాము చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ చివర భూములకు కనీసం తడులు అందే పరిస్థితి కూడా లేకపోవడంతో తీవ్ర అన్యాయం జరుగుతోందని మండిపడుతున్నారు. పాలకులు, అధికారులు ఏమాత్రం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టులో నీరున్నా కాలువకు వదలకుండా కాలయాపన చేయడం వల్ల తమ జీవితాలు రోడ్డున పడుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి, తక్షణమే జూరాల కుడి కాలువకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను, తమ కుటుంబాలను కాపాడాలని అన్నదాతలు దీనంగా వేడుకుంటున్నారు.

# ఎండిన కృష్ణమ్మ

### గణపయ్య నిమజ్జనానికి తప్పని తిప్పలు



**గద్వాల, సెప్టెంబర్ 19(జనంసాక్షి)** నవరాత్రులు అత్యంత వైభవంగా పూజలందుకున్న ముక్కంటి కుమారుడు గంగమ్మ ఒడికి చేరే వేళ భక్తులకు కన్నీటి కష్టాలు తప్పడం లేదు. గద్వాల పట్టణ పరిధిలోని నదీ అగ్రహారం వద్ద కృష్ణానది పూర్తిగా ఎండిపోవడంతో గణనాథుల నిమజ్జనం భక్తులకు, నిర్వాహకులకు ఒక పెద్ద సవాలుగా మారింది. ఎప్పుడూ కళకళలాడే నదీ తీరం,ఇప్పుడు నీరు లేక రాళ్లు తేలి భీతావహంగా కనిపిస్తోంది.జూరాల మూసివేతతో మారిన పరిస్థితి:ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గడంతో జూరాల ప్రాజెక్టు గేట్లను అధికారులు పూర్తిగా మూసివేశారు. దీంతో నదీ అగ్రహారం వద్ద కృష్ణానదిలో నీటి ప్రవాహం నిలిచిపోయింది. నిమజ్జన సమయానికి నదిలో కనీస స్థాయిలో కూడా నీరు లేకపోవడంతో, ఉన్న అరకొర నీటిలోనే చిన్న చిన్న విగ్రహాలను నిమజ్జనం చేయాల్సి వస్తోంది. అయితే, ఆ కొద్దిపాటి నీటిలో విగ్రహాలు పూర్తిగా మునగకుండా పైకే తేలియాడుతుండటం భక్తులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.పట్టణంలోని వివిధ చౌరస్తాల్లో ప్రతిష్టించిన భారీ విగ్రహాల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారింది. భారీ గణనాథులను నిమజ్జనం చేయడానికి నదిలో కనీసం ఐదు నుంచి ఆరు అడుగుల లోతు నీరైనా ఉండాలి. కానీ ప్రస్తుతమున్న పరిస్థితుల్లో అంత పెద్ద విగ్రహాలను నదిలోకి తీసుకువెళ్లడం, నిమజ్జనం చేయడం సాధ్యం కావడం లేదు. దీంతో భారీ విగ్రహాల నిర్వాహకులు ఏం చేయాలో పాలుపోక ఆందోళన చెందుతున్నారు. భక్తుల ఇబ్బందులను గమనించిన మున్సిపల్, పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఎక్కడైనా నీరు ఎక్కువగా ఉన్న లోతైన ప్రాంతాలు ఉన్నాయా అని పరిశీలిస్తున్నారు. అలాంటి ప్రాంతాలను గుర్తించి, అక్కడికి భారీ విగ్రహాలను తరలించి నిమజ్జనం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్రేన్లు, లైటింగ్, మరియు తగినంత భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు.తమ ఇష్టదైవాన్ని భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలకాలనుకున్న భక్తులకు.. ఈసారి ప్రకృతి కరుణించకపోవడం, నీటి కొరత ఏర్పడటం తీవ్ర నిరాశను మిగిల్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రేన్ల సహాయంతో సురక్షితమైన ప్రదేశాల్లో నిమజ్జనం సజావుగా సాగేలా చూడాలని గద్వాల ప్రజలు కోరుతున్నారు.


# రేపల్లె ఘటనపై ఎస్పీ పరిశీలన

### శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు తావులేదు

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 19(జనం సాక్షి) :** జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం రేపల్లె గ్రామంలో కులాంతర వివాహం నేపథ్యంలో చోటుచేసుకున్న ఇంటి కూల్చివేత ఘటనపై ఇప్పటికే చట్టపరమైన చర్యలు చేపట్టిన నేపథ్యంలో, జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ శనివారం సాయంత్రం రేపల్లె గ్రామాన్ని సందర్శించారు. ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, సంబంధిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి గ్రామంలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతున్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రజలు సంయమనం పాటించాలని ఎస్పీ సూచించారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోరాదని, ఏదైనా సమస్య లేదా వివాదం ఉంటే పోలీసుల దృష్టికి తీసుకువచ్చి చట్టపరమైన పరిష్కారం పొందాలని తెలిపారు. ఇప్పటికే ఈ ఘటనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నామని, గ్రామంలో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య, గద్వాల రూరల్ ఎస్ఐ సీహెచ్. శ్రీకాంత్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గుడ్ల ఘటనపై ఐసీడీఎస్ విచారణ

### అంగన్వాడీ టీచర్ నిర్లక్ష్యం లేదని వెల్లడి



**కేటీదొడ్డి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** లబ్ధిదారుడి వద్ద గుడ్లను ఎక్కువ కాలం నిల్వ ఉంచడం వల్లే అవి పాడయ్యాయని, ఇందులో అంగన్వాడీ టీచర్ నిర్లక్ష్యం లేదా తప్పిదం లేదని జిల్లా సంక్షేమ అధికారి సునంద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కె.టి.దొడ్డి మండలం, కె.టి.దొడ్డి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం--2 పరిధిలో గుడ్లు పాడైన ఘటనపై ఐసీడీఎస్ గద్వాల (అర్బన్) సిబ్బంది గ్రామస్థాయిలో విచారణ నిర్వహించగా, వాస్తవ పరిస్థితులు వెల్లడయ్యాయని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. విచారణలో భాగంగా సంబంధిత అంగన్వాడీ కేంద్రానికి సెప్టెంబర్ నెలలో బ్లూ కలర్ స్టాంప్/మార్క్ కలిగిన గుడ్లు సరఫరా కాలదని అధికారులు స్పష్టం చేసినట్లు ఆమె తెలిపారు. అయితే, ఆగస్టు నెలలో లబ్ధిదారులకు సరఫరా చేసిన బ్లూ స్టాంప్ కలిగిన గుడ్లను సంబంధిత లబ్ధిదారుడు శ్రావణ మాసం కారణంగా వినియోగించకుండా తన వద్దే నిల్వ ఉంచినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఆ గుడ్లను సెప్టెంబర్ నెలలో వినియోగించేందుకు ప్రయత్నించడంతో, ఎక్కువ కాలం నిల్వ ఉండటం వల్ల అవి పాడైపోయినట్లు గుర్తించామని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. గుడ్లు పాడవడానికి అంగన్వాడీ టీచర్ నిర్లక్ష్యం లేదా తప్పిదం కారణం కాదని, లబ్ధిదారుడి వద్ద గుడ్లను ఎక్కువ కాలం నిల్వ ఉంచడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విచారణలో స్పష్టమైందని ఆమె పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహార పదార్థాలను లబ్ధిదారులు సరైన సమయంలో స్వీకరించి, నిర్దేశిత సమయంలోనే వినియోగించుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి సునంద సూచించారు. పోషకాహార పదార్థాల నాణ్యత, ప్రయోజనం కాపాడేందుకు వాటిని ఎక్కువ కాలం నిల్వ ఉంచకుండా సకాలంలో వినియోగించడం ముఖ్యమని ఆమె తెలిపారు.



# పంటలను కాపాడండి

### గద్వాల్ కలెక్టరేట్ వద్ద స్తంభించిన రాకపోకలు

**గద్వాల జిల్లా, ప్రతినిధి సెప్టెంబర్ 19( జనం సాక్షి)** "రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే మేము ఎలా ఊరుకోవాలి? మా నీటి దాహార్తిని తీర్చి, పంటలను కాపాడండి" అంటూ గద్వాల జిల్లా రైతాంగం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడి కాలువకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రైతులు ఉమ్మడిగా పోరుబాట పట్టారు. ఒకే సమయంలో జూరాల ప్రాజెక్టు డ్యాం రహదారిపై, అలాగే గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఉన్న కర్నూలు రహదారిపై వందలాది మంది రైతులు బైఠాయించి ఉధృత ధర్నా నిర్వహించారు.కలెక్టరేట్ ముఖద్వారం వద్ద రైతులు బైఠాయించడంతో ఇరువైపులా గంటల తరబడి వాహనాలు భారీగా నిలిచిపోయాయి. గద్వాల్-కర్నూలు ప్రధాన రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. చేతికందే దశలో ఉన్న పంటలు నీరు లేక ఎండిపోతున్నాయని, అధికారులు స్పందించి కాలువకు నీరు వదిలేంత వరకు ఇక్కడి నుండి కదిలేది లేదని రైతులు తెగేసి చెప్పారు. అన్నదాతల ఆందోళనల నేపథ్యంలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

# ఆర్టీసీ బస్సు టిప్పర్ ఢీ

### డ్రైవర్లకు స్వల్ప గాయాలు

### ఘటన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపో సమీపంలో శనివారం ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. తాండూర్ నుంచి శ్రీశైలం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, టిప్పర్‌ను ఢీకొనడంతో కొద్దిసేపు రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో బస్సు, టిప్పర్ డ్రైవర్లకు స్వల్ప గాయాలైనట్లు అధికారులు తెలిపారు.అదే సమయంలో అటుగా వెళ్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రమాదాన్ని గమనించి వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించిన కలెక్టర్, బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుల పరిస్థితిపై ఆరా తీశారు. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరిగిందా, ఎవరైనా గాయపడ్డారా అనే వివరాలను అక్కడ ఉన్న అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

# పోడు భూముల్లో బోర్లకు అనుమతులు ఇప్పించాలి

### మంత్రి జూపల్లి కృష్ణారావుకు వేడుకరావుపల్లి తండా రైతుల వినతి



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో , సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు తమ పోడు భూముల్లో బోర్లు వేసుకునేందుకు అనుమతులు ఇప్పించాలని వేడుకరావుపల్లి తండాకు చెందిన రైతులు రైతు నాయకులు శ్రీను నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. ఈ మేరకు రైతులు మంత్రికి వినతిపత్రం సమర్పించి తమ సమస్యను వివరించారు. వేడుకరావుపల్లి తండాకు చెందిన రైతులు మాట్లాడుతూ.. తాము ఎన్నో ఏళ్లుగా పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తమకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారమని, ప్రస్తుతం వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పోడు భూముల్లో మామిడి చెట్లను నాటుకుని వాటిపై ఆధారపడి జీవిస్తున్నామని, నీటి వసతి లేకపోవడంతో మొక్కలు, చెట్లు ఎండిపోతున్నాయని తెలిపారు.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలను కాపాడుకోవడంతో పాటు మామిడి తోటలను సంరక్షించుకోవాలంటే సాగునీటి వసతి కల్పించుకోవడం అత్యవసరమని రైతులు పేర్కొన్నారు. అయితే తమ పోడు భూముల్లో బోర్లు వేసుకునేందుకు అటవీశాఖ అనుమతులు అవసరమవుతున్నాయని, సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన అనుమతులు ఇప్పించాలని మంత్రి జూపల్లి కృష్ణారావును వారు కోరారు.ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితుల్లో బోరు బావుల ద్వారా నీటిని అందించుకోగలిగితే పంటలను కాపాడుకోవడంతో పాటు తమ కుటుంబాల జీవనోపాధిని కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని రైతులు తెలిపారు. తమ సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించి, అటవీశాఖ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి బోర్లు వేసుకునేందుకు అనుమతులు ఇప్పించాలని వారు మంత్రిని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు శంకర్, కిషన్, హర్షవర్ధన్, రవి, శ్రీరాములు, రాములు, బోజ్యా, సేవ్య, శంకర్, బోజ్యా పాల్గొన్నారు.

# ఒంటరిగా ఉన్న మహిళపై దాడి

### పోలీసులకు ఫిర్యాదు

**తెలకపల్లి, సెప్టెంబర్ 19 (జనం సాక్షి):** ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై బల ప్రయోగం చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. శనివారం ఈ సందర్భంగా స్థానిక ఎస్సై యం. రమేష్ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామానికి చెందిన డి.రాధ తనపై గ్రామానికి చెందిన కొనిజల రామస్వామి బలప్రయోగానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ సెప్టెంబర్ 16న సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో తాను ఇంట్లోని వంటగదిలో పని చేసుకుంటుండగా రామస్వామి ఉద్దేశపూర్వకంగా ఇంట్లోకి వచ్చి తనపై బలప్రయోగం చేశాడని పేర్కొంది. తాను అతడిని అడ్డుకునే ప్రయత్నం చేయగా, ఇంట్లో తాను ఒక్కరే ఉన్న విషయాన్ని గమనించిన సదరు వ్యక్తి తన కుడిచేతిని గట్టిగా పట్టుకుని, తన గౌరవానికి భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తూ దాడికి పాల్పడ్డాడని ఫిర్యాదు ద్వారా తెలిపారు. ఘటనపై విచారణ జరిపి, బాధ్యుడిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

# భర్త ఆత్మహత్య.. భార్య ఫిర్యాదు

**తెలకపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** మండల పరిధిలోని లక్నారం గ్రామానికి చెందిన నిరంజన్ బి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. తన భర్త అబ్దుల్ ఖాదర్‌తో కలిసి తన తల్లి గ్రామమైన లక్నారంలో నివాసం ఉంటూ కూలి పనిచేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 18న రాత్రి సుమారు 11 గంటల సమయంలో తన భర్త మద్యం సేవించి ఇంటికి వచ్చాడని, తరచూ మద్యం సేవిస్తే సంసారం ఎలా సాగుతుందని ప్రశ్నించడంతో తనతో గొడవకు దిగినట్లు పేర్కొన్నారు. ఆవేశంతో తనను ఇంటి నుంచి బయటకు తోసివేసి తలుపులు మూసుకుని లోపల గడియ పెట్టుకున్నాడని తెలిపారు. దీంతో తాను గట్టిగా కేకలు వేయగా చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని తలుపులు విరగొట్టి లోపలికి వెళ్లి చూడగా, అబ్దుల్ ఖాదర్ ఇంటి పైకప్పుకు ఉన్న రాడ్‌కు చీరతో ఉరివేసుకుని కనిపించాడని తెలిపారు. వెంటనే అతడిని కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై నిరంజన్ బీ పోలీసులకు ఫిర్యాదు చేయగా, స్థానిక ఎస్సై యం రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సాధారణ కాన్పులను పెంచేలా డాక్టర్లు, సిబ్బంది కృషి చేయాలి

### జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు



**జడ్చర్ల, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ కాన్పుల శాతాన్ని పెంచేలా ప్రత్యేక ప్రణాళికలతో వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం జడ్చర్ల మండలం గంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఫార్మసీలో మందుల నిల్వలు, ల్యాబ్ సేవలు, వ్యాధినిరోధక టీకాల రికార్డులను పరిశీలించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా. మనుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకులాల్లో పేద విద్యార్థుల ప్రాణాలకు విలువ లేదా..?

### శ్రీపురం ఎంజేపీ గురుకుల కళాశాలను జిల్లా కలెక్టర్, ఎంజేపీ గురుకులాల కార్యదర్శి తక్షణమే సందర్శించాలి

### విద్యార్థి భరత్ యాదవ్ ఆత్మహత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్విరాజ్



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 19(జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా నాగర్ కర్నూల్ మండల పరిధిలోని శ్రీపురంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో విద్యార్థుల భద్రత, వసతుల పరిస్థితి, సిబ్బంది వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్, ఎంజేపీ గురుకులాల కార్యదర్శి తక్షణమే కళాశాలను సందర్శించి సమగ్ర విచారణ చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు.శనివారం బీఎస్పీ ఆధ్వర్యంలో శ్రీపురంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల కళాశాలను పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ అడ్వకేట్, పార్లమెంట్ ఇంచార్జ్ సి. కళ్యాణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ మాట్లాడుతూ విద్యార్థి భరత్ యాదవ్ ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన మరియు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల నుంచి తమ దృష్టికి వచ్చిన వివరాల ప్రకారం, లెక్చరర్ ప్రభాకర్ రెడ్డి విద్యార్థులను తీవ్రంగా వేధించేవారని, కొట్టడం, తన్నడం, బెంచీల మధ్యలో వేసి కొట్టడం వంటి ఆరోపణలు ఉన్నాయని నాయకులు తెలిపారు. విద్యార్థులపై ఇలాంటి ప్రవర్తన జరిగిందన్న ఆరోపణలపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.అదేవిధంగా లెక్చరర్ శంకర్ వ్యవహారశైలిపై కూడా విద్యార్థుల నుంచి ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని బీఎస్పీ నాయకులు తెలిపారు. విద్యార్థులు తమ సమస్యలను ప్రిన్సిపాల్‌కు స్వేచ్ఛగా చెప్పుకోలేని పరిస్థితి ఉందని ఆరోపించారు.భరత్ యాదవ్ మృతికి సంబంధించి తోటి విద్యార్థులు తమకు వెల్లడించిన విషయాలను కూడా నాయకులు ప్రస్తావించారు. అయితే ఈ ఆరోపణలన్నింటిపై అధికారికంగా సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను నిర్ధారించాలని వారు డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఈసీ సభ్యులు శ్రీ హర్ష ముదిరాజ్, శాయిన్ పేట్ రాములు, నాయకులు దేవరపాగ రాముడు, జన్ను ఆంజనేయులు, అర్జున్, మహేష్ యాదవ్, ఆంజనేయులు, కె. రాములు, శ్రీనువాసులు, మల్లేష్, బీవీఫ్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY


# ప్రైవేటు ఫైనాన్స్ వేధింపులకు పోస్టుమెన్ బలి!

- ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యుల డిమాండ్



**నెరడిగొండ సెప్టెంబర్ 19(జనంసాక్షి):** మండలంలోని సావుర్ గాం గ్రామానికి చెందిన జాదవ్ అనిల్(35) కోర్టీకల్(బి) లో పోస్టుమెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం ఎలక్ట్రానిక్ ఫైనాన్స్ సంస్థ నుంచి రుణం తీసుకుని ప్రతినెలా సుమారు రూ.20 వేల చొప్పున ఈఎంఐ చెల్లిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.అనంతరం మరో వాస్తు ఫైనాన్స్ సంస్థ నుంచి సుమారు రూ.5 లక్షల రుణం తీసుకుని దానికి సంబంధించిన రూ.15వేలు ఈఎంఐలను కూడా చెల్లిస్తూ వచ్చారని పేర్కొన్నారు.అయితే అనిల్ బ్యాంకు ఖాతా ఫ్రీజ్ కావడంతో ఈఎంఐల చెల్లింపులో ఇబ్బందులు ఎదురైనట్లు స్థానికులు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ క్రమంలో ఫైనాన్స్ సిబ్బంది ఇంటికి వచ్చి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేసినట్లు ఆరోపించారు. అంతేకాకుండా శనివారం విధులకు వెళ్లి హెడ్ పోస్టాఫీసు నుంచి మధ్యాహ్న భోజనానికి ఇంటికి తిరిగి వస్తుండగా గ్రామ శివారులో ఫైనాన్స్ సిబ్బంది అడ్డుకుని ఈఎంఐ చెల్లిస్తావా లేదా అంటూ బెదిరించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన అనిల్ మధ్యాహ్నం సమయంలో పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వాంతులు చేసుకుంటున్న ఆయనను స్థానికులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు తెలిపారు.కుటుంబ సభ్యుల ఆవేదన ఫైనాన్స్ సంస్థల వేధింపుల కారణంగానే జాదవ్ అనిల్ ఈ దారుణ నిర్ణయం తీసుకున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి,వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫైనాన్స్ సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు.పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తేవాలని చావుకు కారణమైన ఫైనాన్స్ వారిపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.పిర్యాదు మేరకు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మల్లూరు క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

- లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి పనులపై మంత్రి సీతక్క సమీక్ష
- త్వరలో మల్లూరు క్షేత్రంలో పర్యటించి అభివృద్ధి పనుల డిజైన్ ఖరారు చేయాలని నిర్ణయం
- కళ్యాణ మండపం, డార్మిటరీ, అన్నదాన సత్రం తదితర సౌకర్యాల అభివృద్ధికి చర్యలు
- దేవాలయ పవిత్రతకు, ప్రస్తుత నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశం



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 19(జనంసాక్షి) :** జిల్లాలోని ప్రసిద్ధ మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క దేవాలయ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో పాటు ప్రముఖ ఆర్కిటెక్టులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ప్రస్తుత పరిస్థితి, భక్తుల రాకపోకలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, మల్లూరు క్షేత్ర ప్రాశస్త్యం, చారిత్రక మరియు ఆధ్యాత్మిక ప్రాధాన్యతకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి సీతక్క సూచించారు. అభివృద్ధి పనులలో భాగంగా కళ్యాణ మండపం, డార్మిటరీ, అన్నదాన సత్రం వంటి అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయడంపై సమావేశంలో చర్చించి, వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అదేవిధంగా, దేవాలయ ప్రధాన నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది లేదా డిస్టర్బెన్స్ కలగకుండా, క్షేత్ర పవిత్రతను కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. దేవాలయ నిర్మాణ స్వరూపం, పరిసర ప్రాంతాల ప్రత్యేకత, భక్తుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆర్కిటెక్టులు, అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన డిజైన్‌ను ఖరారు చేసేందుకు త్వరలో మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం దేవాలయ అభివృద్ధికి అనువైన డిజైన్‌ను ఖరారు చేయనున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించి భూమి స్థితిగతులు, నిర్మాణ సామర్థ్యం తదితర అంశాలను నిర్ధారించేందుకు రాక్ టెస్ట్‌ను త్వరితగతిన చేపట్టాలని నిర్ణయించారు. రాక్ టెస్ట్ నివేదిక ఆధారంగా తదుపరి నిర్మాణ పనులకు సంబంధించిన సాంకేతిక అంశాలను ఖరారు చేయనున్నారు. మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, సమన్వయంతో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టాలని అధికారులకు సూచించారు.

# గాలివానకు కుప్పకూలిన పెంకుటిల్లు

- త్రుటిలో తప్పిన ప్రమాదం





**కెరమెరి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** కెరమెరి మండలంలోని పరంధోలి తండాకు చెందిన రాథోడ్ వకీల్ నివసిస్తున్న పెంకుటిల్లు శనివారం కురిసిన భారీ గాలివానకు కుప్పకూలింది. ఘటన జరిగిన సమయంలో వకీల్ తల్లి పారూబాయి ఇంట్లోనే ఉన్నారు. ఇల్లు కూలిపోవడంతో ఆమె శిథిలాల కింద చిక్కుకున్నారు. వెంటనే గమనించిన గ్రామస్తులు హుటాహుటిన స్పందించి పారూబాయిని ఇంట్లో నుంచి బయటకు తీశారు. దీంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. నిరుపేద కుటుంబానికి చెందిన వకీల్ నివసించడానికి ఇల్లు లేకుండా పోయిందని బోరున విలపిస్తున్నాడు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులను వేడుకుంటున్నారు.

# బావిలో మహిళ మృతదేహం లభ్యం

- మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు



**లక్ష్మణ చందా, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** మండలంలోని బోరిగం తండాలో విషాద ఘటన చోటుచేసుకుంది. తండాకు చెందిన రాథోడ్ శోభ 31, శనివారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. కొంతసేపటి తర్వాత కూడా ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తండా పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో తండా సమీపంలోని ఓ బావి వద్ద శోభకు చెందిన చెప్పులు కనిపించడంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. బావిలో గాలించగా శోభ మృతదేహం లభ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తల్లి రమీబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బోరిగం తండాకు చెందిన గంగాధర్ కుటుంబ సభ్యులు కమల, కావేరి, సురేఖలతో శోభకు నిన్న జరిగిన గొడవ నేపథ్యంలో ఆమె మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# మలేషియా ఇంటర్ నేషనల్ అవార్డ్ అందుకున్న రాజన్ బాబు



**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 19 (జనం సాక్షి) :** కన్నతల్లి వృద్ధా ఆశ్రమ సేవలను సోషల్ మీడియా ఇంస్టాగ్రామ్ చూసి మలేషియా తెలుగు అసోసియేషన్ వారు సెప్టెంబర్ 8 తేదీన మలేషియా దేశంలో మలేషియా ఇన్ స్ప్రెషన్ గ్లోబల్ ఇంటర్ నేషనల్ అవార్డ్ కన్నతల్లి వృద్ధా ఆశ్రమ చైర్మన్ కొండమీది రాజన్ బాబు ఆహ్వానం అందజేశారు కొన్ని అనివార్య కారణాల రీత్యా మలేషియా దేశానికి వెళ్లలేకపోయన కొండమీది రాజన్ బాబు మలేషియా తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్ కంచర్ల మరియు పాన్ ఇండియా సెంట్రల్ అసోసియేషన్ చైర్మన్ అందకి రాజ్ శుక్రవారం రోజున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గుంటూరు జిల్లా మంగళగిరి వడ్డేశ్వరంలో ఉన్నటువంటి మండలి వెంకటేశ్వరావు అధికార భాష కార్యాలయంలో పులా. త్రివిక్రమరావు (విక్రమ్) చైర్మన్ మండలి వెంకటేశ్వరావు అధికార భాషా సంఘము వారి చేతుల మీదుగా మలేషియా గ్లోబల్ ఇంటర్ నేషనల్ అవార్డ్ అందజేశారు కన్నతల్లి వృద్ధా ఆశ్రమ చైర్మన్ కొండమీది రాజన్ బాబు మాట్లాడుతూ నేను చేసిన సేవలను గుర్తించి నాకు మలేషియాలో ఇంత పెద్ద అవార్డ్ అందుకోవడం కోసం నన్ను ఆహ్వానం అందించిన మలేషియా టీం కంచర్ల ఆనంద్ మరియు అందకి రాజ్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు నేను మలేషియా వెళ్లలేకపోయాను నాకు చాలా బాధ పడ్డాను కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో మళ్ళీ అదే అవార్డ్ పులా త్రివిక్రమ్ రావు(చైర్మన్) మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘము అధ్యక్షులు చేతుల మీదుగా అందుకోవడం నాకు చాలా సంతోషంగా ఉంది అని అన్నారుఇంకా వృద్దులకు మా కన్నతల్లి పౌండేషన్ మరియు వృద్ధా అశ్రయం నుండి ఇంకా సేవలను చేయడానికి ఈ అవార్డ్ ఆదర్శంగా తిసుకొని ముందుకు వెళ్తాను అని అన్నారు.

# నవోదయలో ప్రవేశాలకు అవకాశం

- 9, 11వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**నిర్మల్ జిల్లా, సెప్టెంబర్ 19,(జనం సాక్షి):** సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో మిగిలిన సీట్ల భర్తీకి 9వ, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పాలన విభాగం తెలిపింది. సెప్టెంబర్ 30, 2026 దరఖాస్తులకు చివరి తేదీగా పేర్కొంది. ప్రవేశ పరీక్షను 2027 ఏప్రిల్ 10న నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఆసక్తి గల విద్యార్థులు 9వ తరగతి ప్రవేశాల కోసం cbseitms.nic.in/2026/nvsix_9/, 11వ తరగతి ప్రవేశాల కోసం cbseitms.nic.in/2026/nvsxi_11/ వెబ్‌సైట్లలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అర్హత ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# కాజీపేటలో రూ.1.38 కోట్ల రద్దయిన నోట్లు

- స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**కాజీపేట సెప్టెంబర్ 19:( జనం సాక్షి) :** కాజీపేట పోలీస్ స్టేషన్లో కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి విలేకరుల సమావేశం లో ఈ సందర్భంగా ఏసిపి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ కాజీపేట పట్టణ ప్రధాన రహదారిలో వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా తప్పించుకునేందుకు ప్రయత్నించిన కారును కాజీపేట పోలీసులు ఛేజ్ చేసి పట్టుకున్నారు. కారులో డ్రైవర్‌తో సహా 8 మంది ఉండగా, డిక్కీలో రూ.1.38 కోట్ల విలువైన రద్దయిన రూ.500, రూ.1000 నోట్లు లభించాయి. పాత నోట్లను ప్రస్తుత కరెన్సీగా మార్చుకునేందుకు తీసుకెళు ్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కారు,10 మొబైల్ ఫోన్లు, రూ.6 వేల ప్రస్తుత కరెన్సీని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ముల్లా అబ్బాస్ అలీను గుర్తించిన పోలీసులు, 8 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు వెల్లడించారు. పాత నోట్లు అందించిన చెన్నైకి చెందిన మహమ్మద్ రియాజ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. మోసాలపై ప్రజలకు ఏసిపి ప్రశాంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు రకరకాల ఆశలు చూపిస్తూ, కుటిల ప్రయత్నాలతో సామాన్య ప్రజలను మోసం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా అత్యాశ, దురాశ, అతి నమ్మకం కారణంగానే చాలామంది ఎా నా ల క ం గు ర వు తు న్నా ర ని తెలిపారు. సైబర్ క్రైమ్, నకిలీ జాబ్ ఆఫర్లు, ఇతర మోసపూరిత ప్రయత్నాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, మాటలు లేదా ఆఫర్లు ఎదురైతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఏ విషయాన్నైనా నమ్మే ముందు తప్పనిసరిగా క్రాస్ చెక్ చేసి నిర్ధారించుకోవాలని సూచించారు. రాత్రికి రాత్రే లక్షాధికారులు, కోటీశ్వరులు కావాలనే అత్యాశకు దూరంగా ఉంటే మన సొమ్మును భద్రంగా కాపాడుకోవచ్చని ఏసీపీ స్పష్టం చేశారు.

# ప్రపంచ పర్యాటక దినోత్సవానికి పటిష్ట కార్యాచరణ

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 19 (జనం సాక్షి) :** ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో పర్యాటక శాఖ వివిధ కార్యక్రమాల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 27న నిర్వహించే ప్రపంచ దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లు, నిర్వహణపై పర్యాటక, విద్యా, పురావస్తు, అటవీ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. చారిత్రక ఆలయాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు కల్పించాలని, అందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. యువ టూరిజం క్లబ్ లో నమోదయి ఉన్న విద్యార్థులకు పర్యాటక, వారసత్వ సంపద పై మండల, జిల్లా స్థాయి వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని డీఈఓ,డిఐఈఓలకు సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన ఉదయం 6:00 గంటలకు హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో యోగ కార్యక్రమాలు, 25వ తేదీన హనుమకొండ పద్మాక్షి జైన దేవాలయం, సిద్దేశ్వరాలయం వద్ద హెరిటేజ్ వాక్ ను పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని పేర్కొన్నారు. హెరిటేజ్ వాక్ లో యువ టూరిజం క్లబ్ విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. 26వ తేదీన ఉదయం 7 గంటలకు తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా యువ టూరిజం క్లబ్ విద్యార్థులకు జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పర్యాటకశాఖ ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా అటవీ శాఖ అధికారి ముకుంద రెడ్డి, డీఈవో గిరిరాజ్ గౌడ్, హనుమకొండ ఏసీపీ నరసింహ రావు, అడిషనల్ డీఆర్డీఏ వెంకటేశ్వర్లు, జీడబ్ల్యూఎంసి సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి రీ-సర్వే ప్రక్రియకు గ్రామస్తులు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ సత్య శారద



**నల్లబెల్లి, సెప్టెంబరు 19(జనంసాక్షి):** భూభారతి రీ- సర్వే ప్రక్రియకు గ్రామస్తులు సహకరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద పేర్కొన్నారు. శనివారం మండలంలోని అర్షనపల్లి గ్రామంలో భూభారతి రీ-సర్వేపై నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. రీ-సర్వే ప్రక్రియ, భూ వివరాల నమోదు, సర్వే సమయంలో భూ యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రీ-సర్వే ప్రక్రియకు గ్రామస్థులు సహకరించాలని కలెక్టర్ కోరారు. తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. భూ వివరాల్లో ఏవైనా తేడాలు, అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ కృష్ణ, సర్పంచ్ సిద్ధ సంతోష్, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నర్సంపేటలోని ప్రత్యేక మహిళా జైలు సందర్శన



**నర్సంపేట సెప్టెంబర్ 19 (జనం సాక్షి) :** మహిళ జైలులోని ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, న్యాయ సహాయం తదితర అంశాలను పరిశీలించి, మహిళా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న వరంగల్ జిల్లా చైర్పర్సన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి విబి నిర్మల తెలుసుకున్నారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం యొక్క నాణ్యత, పరిమాణం మరియు పరిశు భ్రతను స్వయంగా పరిశీలించి, ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా త్రైమాసిక నివేదికకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. అనంతరం నర్సంపేట కోర్టు ప్రాంగణాన్ని కూడా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ మరియు కార్యదర్శి సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయ సేవల ప్రాధాన్యత, లోక్ అదాలత్‌లు మరియు ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలపై న్యాయవాదులు, కక్షిదారులకు అవగాహన కల్పించాలని సంబంధిత న్యాయాధికారులకు సూచించారు. కక్షిదారులు, న్యాయవాదులకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సేవలు, లోక్ అదాలత్ ప్రయోజనాలు మరియు కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునే అవకాశాల గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. న్యాయ సేవలు అవసరమైన ప్రతి ఒక్కరికీ సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి కందుకూరి పూజ, నర్సంపేట మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ప్రతీక్ సిహాగ్, న్యాయమూర్తులు ఎం.డి.యూసుఫ్, పి.గిరిధర్ మరియు జైలు సూపరింటెండెంట్ స్రవంతి, జైలు సిబ్బంది, జైలు సందర్శక న్యాయవాది సునీత, ప్యానెల్ న్యాయవాది డి.సాంబయ్య పాల్గొన్నారు.



# జాతీయ, అంతర్జాతీయ రికార్డుల్లో జివెన్ ప్రతిభ

**నిర్మల్ బ్యూరో : సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** చిన్న వయస్సులోనే అసాధారణ జ్ఞాపకశక్తి, గుర్తింపు సామర్థ్యంతో నిర్మల్‌కు చెందిన జివెన్ అల్లూరు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాడు. మూడేళ్లు నిండకముందే పలు అవార్డులు, రికార్డు సంస్థల గుర్తింపులను సొంతం చేసుకున్నాడు. జివెన్ ప్రతిభను గుర్తించిన ఇంటర్నేషనల్ స్టార్ కిడ్స్ అవార్డ్స్ సంస్థ 'ఇంటెలిజెన్స్ అండ్ మెమరీ' విభాగంలో 'స్టార్ కిడ్' అవార్డుతో సత్కరించింది. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ 'సూపర్ టాలెంటెడ్ కిడ్', 'వన్ ఇన్ ఎ మిలియన్'గా గుర్తించింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 'ఐబీఆర్ అచీవర్'గా ఎంపిక చేసింది. మూడేళ్లు నిండకముందే సుమారు 100 రకాల జంతువులు, పక్షులు, కీటకాలను గుర్తించి పేర్లు చెప్పగలుగుతున్నాడు. అలాగే 70 రకాల వాహనాలు, 50 కార్ల లోగోలు, 24 రంగులు, 12 ఆకారాలు, 39 రకాల పండ్లు, కూరగాయలను గుర్తిస్తున్నాడు. జివెన్ నిర్మల్‌లో వైద్య సేవలు అందిస్తున్న న్యూరాలజిస్ట్ డాక్టర్ మనోజ్ భరత్, పీడియాట్రిషియన్ డాక్టర్ దివ్య దంపతుల కుమారుడు. చిన్నప్పటి నుంచే అతడి ఆసక్తిని గమనించిన కుటుంబ సభ్యులు ప్రోత్సహిస్తూ కొత్త విషయాలను నేర్చుకునేలా చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జివెన్ సాధిస్తున్న గుర్తింపులు కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు, నిర్మల్ ప్రజల్లో ఆనందం నింపుతున్నాయి.

# వినాయక నిమజ్జనానికి పటిష్ఠ భద్రత

- ఘాట్‌లను పరిశీలించిన ఎస్పీ జానకి షర్మిల



**నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల శనివారం తెల్లవారుజామున నిమజ్జన ఘాట్‌లను పరిశీలించారు. భక్తుల రాకపోకలు, బారికేడింగ్, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

నిమజ్జన శోభాయాత్రలు సాగే మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఘాట్‌ల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కృష్ణ, సమ్మయ్య, ఎస్ఐలు, బందోబస్తు సిబ్బంది పాల్గొన్నారు.



## డీజేలకు నో.. క్రమశిక్షణతో

# వినాయక ఊరేగింపులు

## కలెక్టర్ అంకిత్

- భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యం.. ఘాట్ల వద్ద ప్రత్యేక రక్షణ చర్యలు
- పోలీస్, రెవెన్యూ, వైద్య, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు
- నిమజ్జన ఘాట్ల వద్ద బారికేడింగ్, లైటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు

**భద్రాచలం, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):**
భద్రాచలంలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో జరిగే వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం గోదావరి నది తీరంలోని నిమజ్జన ఘాట్లను సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్, డీఎస్పీ అరుణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఘాట్ల వద్ద బారికేడింగ్, లైటింగ్, సీసీ కెమెరాలు, తాగునీరు, వైద్య బృందాలు, లాంచీలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. గోదావరిలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ, రవాణా, వైద్య, అగ్నిమాపక, ఇరిగేషన్, దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే నిమజ్జనం చేయాలని, వాహనాలను కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలపాలని భక్తులకు సూచించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఘాట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని, మద్యం సేవించి నిమజ్జనానికి రావద్దని కోరారు. డీజేలకు నో.. క్రమశిక్షణతో ఊరేగింపులు నిర్వహించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆలయ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల ప్రారంభానికి ముందే ఘాట్లు, పరివాహక ప్రాంతంలోని అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సూచించారు.

# టీజీ జెన్‌కోలో అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్

- దీర్ఘకాలిక పోస్టింగ్‌లు, బదిలీలు, పదోన్నతులపై సమగ్ర విచారణ చేపట్టాలి
- ప్రభుత్వ ఆస్తుల డిస్మాంట్లింగ్, ఆర్థిక లావాదేవీలపైనా దర్యాప్తు చేయాలి



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 19 (జనం సాక్షి):**
తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ పరిధిలో జరుగుతున్న ఉద్యోగుల పోస్టింగ్‌లు, బదిలీలు, పదోన్నతులు, దీర్ఘకాలిక సర్వీసులు, ప్రభుత్వ ఆస్తుల తొలగింపుపై సమగ్ర విచారణ జరిపించాలని ది నేషనల్ అంబేద్కర్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలూకా రాజేష్ డిమాండ్ చేశారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు పారదర్శకంగా విచారణ జరిపి, వాస్తవాలను తేల్చి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. జెన్‌కోలో వ్యక్తుల ఇష్టారాజ్యం కాకుండా నిబంధనలు, రాజ్యాంగ సూత్రాల ప్రకారం పరిపాలన సాగాలని అన్నారు. ఎలాంటి సిఫారసులకు తావులేకుండా పత్రాలు, సీనియారిటీ, అర్హత, ఖాళీల ఆధారంగానే పోస్టింగ్‌లు కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పష్టం చేయాల్సిన అంశాలుకేటీపీఎస్ డిస్మాంట్లింగ్ వివరాలు బహిర్గతం చేయాలి: కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌లో జరిగిన ప్రభుత్వ ఆస్తుల తొలగింపునకు సంబంధించిన ఆయిల్ ట్యాంకర్లు, ఇనుప స్క్రాప్, టేకు చెట్లు, ఇతర ఆస్తుల అంచనాలు, టెండర్లు, అనుమతులు, విక్రయ వివరాలు, ప్రభుత్వానికి వచ్చిన ఆదాయాన్ని రికార్డులతో సహా బహిర్గతం చేయాలని రాజేష్ కోరారు. ఎస్ఏఓ-1 పోస్టింగ్‌పై స్పష్టత ఇవ్వాలి: కేటీపీఎస్ ఏడో దశలో ఎస్ఏఓ-1 బాధ్యతల అప్పగింతలో అర్హత, సీనియారిటీ, క్యాడర్ నిబంధనలు పాటించారా లేదా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని అన్నారు. ఐదో, ఆరో దశల్లో అమలు చేసిన ప్రమాణాలనే ఇక్కడా పాటించారా అన్నది వెల్లడించాలని కోరారు. ఏఏఓ బదిలీలపై వివరణ ఇవ్వాలి: ఏఏఓ హోదాలో ఉన్నవారిని ఖాళీలు ఉన్న సీఈటీడీకి బదిలీ చేయకుండా కేటీపీఎస్ ఏడో దశలోనే కొనసాగించాల్సిన పరిపాలనా అవసరాన్ని వివరించాలని అన్నారు. అర్హులైన ఏఏఓలకు సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.5 లక్షల లావాదేవీలపై విచారణ: కేటీపీఎస్‌లో కొందరు ఉద్యోగులు రియల్ ఎస్టేట్, ఇతర వ్యక్తిగత లావాదేవీల పేరుతో సుమారు పది మంది నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.5 లక్షల చొప్పున వసూలు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై బ్యాంకు లావాదేవీల ఆధారంగా సమగ్ర విచారణ జరపాలని కోరారు. దీర్ఘకాలిక పోస్టింగ్‌ల సమీక్ష: ఒకే ప్రాంతంలో లేదా పోస్టులో ఐదేళ్లు, అంతకంటే ఎక్కువ కాలంగా కొనసాగుతున్న ఏడీఈ నుంచి చీఫ్ ఇంజనీర్ వరకు, ఏఏఓ నుంచి ఎఫ్ఏ అండ్ సీసీఏ వరకు అధికారుల సర్వీస్ రికార్డులను పరిశీలించి నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పాత ప్రభావాలకే ప్రాధాన్యమా? రాష్ట్రంలో ప్రభుత్వం మారినా జెన్‌కోలో కొన్ని నిర్ణయాల్లో పాత పాలకులు, అధికారుల ప్రభావాలు కొనసాగుతున్నాయనే భావన ఉద్యోగుల్లో ఉందని రాజేష్ పేర్కొన్నారు. మహిళా ఉద్యోగుల కుటుంబ పరిస్థితులు, భద్రతను పరిగణనలోకి తీసుకుంటూనే పదోన్నతులు, పోస్టింగ్‌లలో సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ అంశాలపై టీజీ జెన్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ), ఇంధన శాఖ ఉన్నతాధికారులు, మంత్రి, ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించాలని తాలూకా రాజేష్ డిమాండ్ చేశారు.





# జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలి

### రిలే నిరాహార దీక్షకు దేవరకొండ డివిజన్ జర్నలిస్టుల సంఘీభావం

**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):**
జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షకు దేవరకొండ డివిజన్ జర్నలిస్టులు శనివారం సంఘీభావం తెలిపారు. దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు గాదె గిరిధర్ రావు నేతృత్వంలో జర్నలిస్టులు దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా గాదె గిరిధర్ రావు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్న ప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం జర్నలిస్టుల సమస్య పై సానుకూలంగా స్పందించి వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయని సమస్య పరిష్కారం కాకపోతే దేవరకొండ డివిజన్ స్థాయిలోనూ రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు.

**సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం**
జర్నలిస్టులు తమ వృత్తిని నమ్ముకుని పరిమిత ఆదాయంతో కుటుంబాలను పోషిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని గాదె గిరిధర్ రావు అన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు ప్రజా సమస్యలపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. ప్రజల గొంతుకగా, ప్రభుత్వాలను జవాబుదారీగా నిలపడంలో జర్నలిస్టులు ముఖ్య భూమిక పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షుడు ఖాజా మొహినుద్దీన్, కోశాధికారి బూడిద శ్రీనివాస్ యాదవ్, సహాయ కార్యదర్శి ఇలియాస్ బాబా తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## భూ రీ సర్వేను వేగవంతం చేయాలిడిజిటల్ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ అంకిత్

**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):**
భూ రీ సర్వే పనులను నిర్దేశిత లక్ష్యాల మేరకు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. పినపాక పట్టీనగర్ రెవెన్యూ విలేజ్ పరిధిలోని అంజనాపురంలో కొనసాగుతున్న డిజిటల్ భూ రీ సర్వేను శనివారం పరిశీలించారు. సర్వే విధానం, భూముల కొలతలు, వివరాల నమోదుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. 1,863 ఎకరాలకు గాను 1,698 ఎకరాల్లో సర్వే పూర్తయిందని లైసెన్స్‌డ్ సర్వేయర్లు తెలిపారు. అటవీశాఖకు సంబంధించిన సుమారు 200 ఎకరాలకు అనుమతులు వచ్చిన వెంటనే సర్వే పూర్తి చేస్తామని వెల్లడించారు. అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలు, సందేహాలను తెలుసుకున్నారు. భూ యజమానులు పూర్తి వివరాలు అందించి సర్వేకు సహకరించాలని కోరారు. అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు సమన్వయంతో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

# వరుస కథనాలతో కదిలిన విద్యుత్ శాఖ

- గుంజపై నుంచి కరెంటు వైర్ల తొలగింపు..
- నూతన స్తంభానికి కనెక్షన్‌రెండేళ్ల సమస్యకు పరిష్కారం..
- జనం సాక్షి కథనాలపై మాడుగులపల్లి ప్రజల హర్షం

**మాడుగులపల్లి సెప్టెంబర్ 19 (జనంసాక్షి ):**
మాడుగులపల్లి మండల కేంద్రంలో గత రెండేళ్లుగా నిరుపయోగంగా ఉన్న కరెంటు స్తంభం సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. ప్రమాదకరంగా గుంజ (కర్ర) పైనుంచి వేలాడుతున్న కరెంటు వైర్లను విద్యుత్ అధికారులు తొలగించి, నూతన స్తంభానికి కనెక్షన్ ఇచ్చారు మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం స్తంభం నాటినప్పటికీ లైన్ కలపకపోవడం, లంచం డిమాండ్ చేయడం గుంజపై వైర్లు వేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న తీరుపై జనం సాక్షి దినపత్రికలో వరుసగా ఘాటైన వార్తా కథనాలు ప్రచురితమయ్యాయి ప్రజా సమస్యను వెలుగులోకి తెస్తూ, అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ వచ్చిన ఈ కథనాలకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించారువెంటనే స్పందించిన అధికారులు క్షేత్రస్థాయికి చేరుకుని, ప్రమాదకరంగా ఉన్న గుంజపై నుంచి వైర్లను తొలగించి, రవాణా సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండేలా స్తంభానికి విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించారు. గత రెండేళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యను వరుస కథనాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేసిన జనం సాక్షి దినపత్రిక యాజమాన్యానికి, విలేకరికి మాడుగులపల్లి ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





# కొరటికల్ పాఠశాలలో బ్యాగ్‌లెస్ డే

- విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించి ఆనందంగా నేర్చుకునేలా కార్యక్రమాలు

**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి :**
కొరటికల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బ్యాగ్‌లెస్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెల మూడవ శనివారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల భారం, చదువు ఒత్తిడికి దూరంగా ఆనందంగా నేర్చుకునే వాతావరణం కల్పించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడంతో పాటు వివిధ ఆటలు ఆడించారు. పాఠశాలలో నెల రోజుల పాటు బ్యాగులతో హాజరయ్యే విద్యార్థులకు మూడవ శనివారం రోజున బ్యాగ్‌లెస్ డే ద్వారా ఆహ్లాదకరమైన, ఒత్తిడి లేని విద్యను అందించడమే కార్యక్రమం ఉద్దేశమని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు డి. వెంకన్న×× తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు వారిలో ఆసక్తి, సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వామి, రవి, వరప్రసాద్, శ్రీనివాసచారి, అనురాధ, వెంకటేశం, మాధవి తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ నిర్మాణ పనుల పరిశీలన

**ఆత్మకూరు (ఎం) జనంసాక్షి :**
పల్లెర్ల గ్రామంలోని పల్లెర్ల మిశ్రమ చేనేత సహకార సంఘం భవన ఆవరణలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చేపడుతున్న నిర్మాణ పనులను చేనేత సహకార సంఘం అధ్యక్షులు పొడుగు వెంకటేశం పరిశీలించారు. ఈ సందర్భంగా విగ్రహ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, పనులు నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. చేనేత రంగానికి, సమాజానికి విశిష్ట సేవలందించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ స్మారకంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం కోశాధికారి సాయిని పురుషోత్తం, డైరెక్టర్ గుర్రం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ పంట నమోదును సద్వినియోగం చేసుకోవాలి

**ఆత్మకూరు (ఎం) జనంసాక్షి :**
మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ పంట నమోదు కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి బి. రాజశేఖర్ కోరారు. ప్రభుత్వం నియమించిన పంట నమోదు సర్వేయర్లు కొసన మల్లేశం, గణేష్, ఏ. మహేష్‌రైతుల పొలాలను సందర్శించి రైతులు సాగు చేస్తున్న పంట, సర్వే నంబర్, సాగు విస్తీర్ణం తదితర వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా సన్న రకాల వరి సాగు చేస్తున్న రైతులుతాము సాగు చేస్తున్న వరి రకం, సాగు విస్తీర్ణాన్ని పంట నమోదు సిబ్బందికి ఖచ్చితంగా తెలియజేయాలని సూచించారు. పంట నమోదులో నమోదైన వివరాల ఆధారంగానే సన్న రకాల వరికి ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్‌అందించే ప్రక్రియలో పరిగణన జరుగుతుందని తెలిపారు. అలాగే పంట నమోదు వివరాల ఆధారంగానే ప్రభుత్వం పంటల ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. పంట నమోదు సిబ్బంది గ్రామాలకు వచ్చినప్పుడు రైతులు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి, సాగు చేస్తున్న పంటకు సంబంధించిన సరైన వివరాలను అందించి నమోదు చేయించుకోవాలని సూచించారు. ఇప్పటివరకు పంట వివరాలను నమోదు చేయించుకోని రైతులు సంబంధిత పంట నమోదు సిబ్బందిని సంప్రదించి వెంటనే నమోదు చేయించుకోవాలని కోరారు. పంట నమోదు కార్యక్రమానికి సంబంధించి సందేహాలు, సమస్యలు లేదా ఫిర్యాదులు ఉంటే సమీప రైతువేదికను సంప్రదించాలని తెలిపారు. పంట నమోదు చివరి తేదీ 30-09-2026అని, గడువులోగా ప్రతి రైతు తమ పంట వివరాలను నమోదు చేయించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి బి. రాజశేఖర్‌తెలిపారు.



# అన్నాదైవం చెరువుకు గోదావరి జలాలు

### సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటి తరలింపు

### రెండు పంటలకు సాగునీటి ఇబ్బందులు ఉండవని రైతుల హర్షం

**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 19 (జనం సాక్షి)**
అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని అన్నాదైవం చెరువుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను శనివారం తరలించారు. చెరువులోకి గోదావరి జలాలు చేరడంతో గ్రామ రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సాగునీటి వసతి మెరుగుపడటంతో వ్యవసాయానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గోదావరి జలాలతో అన్నాదైవం చెరువు నిండితే పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ భూములకు సాగునీటి లభ్యత పెరుగుతుందని రైతులు తెలిపారు. రెండు పంటలకు సాగునీటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు నీటితో తమ ప్రాంతంలో వ్యవసాయానికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు సుగ్గల నరసింహారావు, సున్నం సమ్ములు, రైతులు పలగాని నాగేంద్రబాబు, పాడియా జోగారావు, లాకావత్ సత్యనారాయణ, మల్లెల స్వామి, వడ్డే నరసింహారావు, చల్లా రమేష్, ఇజ్జిగిరి సత్యం తదితర గ్రామస్తులు చెరువుకు గోదావరి జలాలు చేరడంపై హర్షం వ్యక్తం చేశారు.



## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలి

### నల్గొండ కలెక్టరేట్ వద్ద మాడుగులపల్లి విలేకరుల రిలే నిరాహార దీక్ష



**మాడుగులపల్లి, సెప్టెంబర్ 19( జనంసాక్షి):**
జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నల్గొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలో మాడుగులపల్లి మండలానికి చెందిన పత్రికా విలేకరులు పెద్ద ఎత్తున పాల్గొని తమ మద్దతు తెలిపారు ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ మాడుగులపల్లి మండల అధ్యక్షుడు ఎస్.కె. రసూల్, కార్యదర్శి దర్శనం రాంబాబు మాట్లాడుతూ జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ, హెల్త్ కార్డ్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు ఈ కార్యక్రమంలో మాడుగులపల్లి మండల విలేకరులు బొంగరాల శ్రీనివాస్, చక్రపాణి, గంట రవి, పెరమళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసింగ్ సేవల్లో నాణ్యత పెంచాలి: పోలీస్ కమిషనర్

- చింతకాని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్




చింతకాని, సెప్టెంబర్ 19 (జనంసాక్షి)చింతకాని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్)లో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పూర్తి స్థాయిలో అప్‌డేట్ చేయాలని, దర్యాప్తులో ఈ-సాక్ష్యను సమర్థవంతంగా వినియోగించి, ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో భద్రపరచాలని సూచించారు. నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్ (నాట్‌గ్రిడ్), తెలంగాణ క్రిమినల్ ఆపరేషన్ పోర్టల్ (టీజీకాప్) వంటి సాంకేతిక వేదికలను దర్యాప్తులో సమర్థవంతంగా వినియోగించాల న్నారు. భూ వివాదాల కేసుల్లో నిర్దేశిత స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను తప్పనిసరిగా పాటిస్తూ, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగించాలని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ/యూపీఐ మోసాలు, నకిలీ లింకులు, డిజిటల్ అరెస్టులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి, కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేసులో దర్యాప్తు నాణ్యత, ఆధారాల సేకరణ, కేసు డాక్యుమెంటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే స్వీకరించి, వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటూ మెరుగైన పోలీసింగ్ సేవలు అందించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, నేరస్తులపై నిఘా, ప్రజలకు భద్రత కల్పించడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.




## టాటా ఎలక్ట్రానిక్స్‌తో ఎల్‌ఖటీ సెమీకండక్టర్ జట్టు

### దేశీయంగా చిప్‌సెట్‌ల తయారీకి




దిల్లీ: అంతర్జాతీయ మార్కెట్ల కోసమూ మన దేశంలో సెమీకండక్టర్ చిప్‌లు తయారు చేసేందుకు దేశీయ చిప్ కంపెనీలు టాటా ఎలక్ట్రానిక్స్, ఎల్ అండ్ టీ సెమీకండక్టర్ టెక్నాలజీస్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్, సహాయ మంత్రి జితిన్ ప్రసాద, ఐటీ కార్యదర్శి ఎస్.కృష్ణన్, ఇండియా సెమీకండక్టర్ మిషన్ సీఈఓ అమితేష్ సిన్హా సమక్షంలో ఇరు కంపెనీల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. టాటా ఎలక్ట్రానిక్స్ గుజరాత్‌లోని ధొలేరాలో రూ.91,000 కోట్ల పెట్టుబడితో దేశంలోనే మొదటి భారీ వాణిజ్య చిప్ ఫ్యాబ్రికేషన్ యూనిట్ నిర్మిస్తోంది. ఎల్ అండ్ టీ సెమీకండక్టర్ టెక్నాలజీస్ అధునాతన చిప్ డిజైనింగ్, ఫ్యాబ్‌లెస్ అభివృద్ధిలో నైపుణ్యం కలిగి ఉంది. ఎల్ అండ్ టీ ఇంజినీరింగ్, ఫ్యాబ్‌లెస్ డిజైన్ నైపుణ్యాన్ని టాటా సెమీకండక్టర్ తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్ సామర్థ్యాలతో అనుసంధానించడమే ఈ భాగస్వామ్యం ప్రధాన ఉద్దేశం. దీంతో పాటు సుమిటోమో కెమికల్, కెలింగ్టన్, ఎనోమోటో, సోజిట్జ్ కార్పొరేషన్, ఎన్‌ఆర్‌ఎస్ కార్పొరేషన్ వంటి అంతర్జాతీయ సంస్థలతో టాటా ఎలక్ట్రానిక్స్ ఒప్పందం కుదుర్చుకుంది. 40 ఉత్పత్తుల ఆవిష్కరణ: ఎల్ అండ్ టీ అనుబంధ సంస్థ ఎల్ అండ్ టీ సెమీకండక్టర్ టెక్నాలజీస్, దిల్లీలో సెమికాన్ ఇండియా 2026 సదస్సులో 40 కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించింది. 'సిలికాన్ టూ సిస్టమ్స్: బిల్డింగ్ ది ఎకోసిస్టమ్' థీమ్‌తో వీటిని ప్రదర్శించింది. పవర్ కన్వర్షన్ అప్లికేషన్‌ల కోసం రూపొందించిన తొలి 1200వీ సిలికాన్ కార్బైడ్ (ఎస్ఐసీ) మాస్‌ఫెట్ ప్లాట్‌ఫామ్‌ను ఎల్ అండ్ టీ సెమీకండక్టర్ ఆవిష్కరించింది. విద్యుత్ వాహనాల ఫాస్ట్ ఛార్జర్లు, మైక్రోగ్రిడ్‌లు, సాలిడ్-స్టేట్ ట్రాన్స్‌ఫార్మర్లు, ట్రాక్షన్ ఇన్వర్టర్లు అధిక సామర్థ్యంతో పనిచేసేందుకు ఇవి ఉపయోగపడతాయి. సంస్థ సొంతంగా అభివృద్ధి చేసిన ఎస్ఐసీ పవర్ మాడ్యూల్స్, పరికరాలను సైతం ప్రదర్శించింది.

## డిస్నీ నూతన సీటీఓగా కరణ్‌దీప్ ఆనంద్

ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ డిస్నీ నూతన చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా కరణ్‌దీప్ ఆనంద్‌ను నియమించింది. క్యారక్టర్.ఏఐ సంస్థ సీఈఓగా పనిచేసిన ఆయన అక్టోబర్ 2న నూతన బాధ్యతలు స్వీకరిస్తారని డిస్నీ వెల్లడించింది. సీటీఓతోపాటు కొత్తగా సృష్టించిన సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గానూ ఆయన కొనసాగుతారని తెలిపింది. మౌలిక సదుపాయాలు, వినియోగదారుల సాంకేతికత, కృత్రిమ మేధ వంటి భిన్న రంగాల్లో కరణ్‌దీప్‌కు విశేష అనుభవం ఉందని, తమ సీనియర్ నాయకత్వ బృందంలో మరో కీలక సభ్యుడిగా ఉంటారని డిస్నీ వెల్లడించింది. మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, బ్రెక్స్ తదితర సంస్థల్లో సుదీర్ఘకాలం పాటు పనిచేసిన కరణ్‌దీప్.. బ్యాచిలర్ డిగ్రీని ఐఐఐటీ హైదరాబాద్ లోనే పూర్తి చేశారు.

# స్టాక్‌మార్కెట్లో పెనుమార్పులు!

### టాటా సన్స్ లిస్టింగ్‌పై నిపుణుల అంచనా

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నిబంధనలను పాటించడం కోసం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో టాటా సన్స్ నమోదైతే (లిస్టింగ్ జరిగితే).. భారత ఈక్విటీ మార్కెట్ల స్వరూపమే మారిపోవచ్చు. దేశంలో అతిపెద్ద, అత్యంత సంక్లిష్ట కార్పొరేట్ సామ్రాజ్యాల్లో ఒకటైన టాటా గ్రూప్ ప్రధాన సంస్థలో వాటాదార్లయ్యే అవకాశం సామాన్యులకూ కలగనుంది. ఇంట్లో వాడే ఉప్పు నుంచి ఆకాశంలో ఎగిరే విమానాల దాకా టాటా గ్రూప్ చేతిలో ఎన్నో వ్యాపారాలున్నాయి. గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.30 లక్షల కోట్ల దాకా, అన్‌లిస్టెడ్ కంపెనీల విలువ 360 బిలియన్ డాలర్ల (రూ.34 లక్షల కోట్లకు పైగా) ఉంటుందని అంచనా. ఇందులో ఎక్కువ భాగం ప్రస్తుత హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ చేతిలో ఉంది. క్రాస్ హోల్డింగ్‌ల రూపంలో లిస్టెడ్, అన్‌లిస్టెడ్ వ్యాపారాల్లోనూ టాటా సన్స్‌కు వాటాలున్నాయి. ఒక్కసారి టాటా సన్స్ పబ్లిక్ లిస్టింగ్‌కు వస్తే, ఈ వాటాల విలువలన్నీ బయటకు వచ్చినట్లవుతుంది. అంతర్జాతీయ క్యాపిటల్ మార్కెట్ శక్తిగా మనదేశం మారే క్రమంలో, ఈ పరిణామం కీలకం కావొచ్చని బ్రోకరేజీ సంస్థలు అంటున్నాయి. మార్కెట్ పరిమాణం, పారదర్శకత, విలువ, మదుపర్ల పాల్గొనే ధోరణి.. ఇలా అన్నిటిలోనూ పెనుమార్పులు రావొచ్చని చెబుతున్నాయి. 'సుపరిపాలన కలిగిన, మార్కెట్లో ఆధిపత్యం సాగిస్తున్న భారీ వ్యాపార సామ్రాజ్యంలో వాటాదార్లయ్యే అవకాశం' ఒక్క పెట్టుబడితో కోట్ల మంది రిటెయిల్ మదుపర్లకు దక్కుతుంది. టాటా గ్రూప్ కంపెనీల్లోని 1.77 కోట్ల (నాన్ యూనిక్) మంది వాటాదార్లకూ ప్రయోజనం లభించొచ్చని కార్పొరేట్ గవర్నెన్స్ సలహా సంస్థ




ఇన్‌గవర్న్ రీసెర్చ్ సర్వీసెస్ అంటోంది. వీరికి హోల్డింగ్ కంపెనీలో వాటా ద్వారా టాటా గ్రూప్ కంపెనీల్లో పరోక్షంగా వాటాలున్నాయి. టాటా సన్స్ కనీసం 5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.47,500 కోట్ల) సమీకరణ లక్ష్యంతో పబ్లిక్ ఇష్యూకు రావొచ్చని అంచనాలున్నాయి. సంస్థ విలువను ఎంతగా పరిగణిస్తారు, ఎంత వాటాను పబ్లిక్ ఇష్యూలో విక్రయిస్తారనే దానిపై ఐపీఓ పరిమాణం ఆధారపడి ఉంటుందని ఇన్‌గవర్న్ అంటోంది. ఇప్పటికే మార్కెట్లోని టాటా గ్రూప్ నమోదిత కంపెనీల షేర్లు లాభాలు పంచుతున్నాయి. మాతృసంస్థకున్న క్రాస్ హోల్డింగ్స్ వల్ల ప్రయోజనం లభించొచ్చన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. టాటా సన్స్‌కు మరో అయిదేళ్ల పాటు ఛైర్మన్‌గా చంద్రశేఖరన్‌ను పునర్నియమించడంతో, నాయకత్వం విషయంలో ఎటువంటి అనిశ్చితీ ఉండదు.. సెమీకండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ, విమానయానం, ఇతర వ్యూహాత్మక రంగాల్లోకి టాటా సన్స్‌ను విస్తరించడంలో చంద్ర పాత్ర దృష్ట్యా ఆయన కొనసాగించాలనే బోర్డు నిర్ణయించింది. చంద్రను కొనసాగించడం, లిస్టింగ్‌కు అంగీకరించడమనే నిర్ణయాలతో నాయకత్వ స్థిరత్వం, గొప్ప పారదర్శకత అందిస్తామన్న సంకేతాన్ని టాటా సన్స్ మార్కెట్లోకి పంపింది. ఇది మదుపర్ల విశ్వాసాన్ని పెంచగలదు. ఎస్‌పీ గ్రూప్ మద్దతు: టాటా సన్స్‌లో 66% వాటా ఉన్న టాటా ట్రస్ట్స్‌కు ఛైర్మన్ అయిన నోయల్ టాటా సంస్థ లిస్టింగ్‌కు, ఛైర్మన్‌గా చంద్ర పునర్నియామకానికి వ్యతిరేకంగా ఉన్నప్పటికీ.. రెండో అతిపెద్ద వాటాదారు (18.4%) అయిన షాపూర్జీ పల్లోంజీ(ఎస్‌పీ) గ్రూప్ మాత్రం లిస్టింగ్‌కు మద్దతు ఇస్తున్నట్లు తెలిపింది. భారత్‌లోని అత్యంత ప్రభావవంత వ్యాపార సంస్థల్లో ఒకటైన టాటా సన్స్ లిస్టింగ్ వల్ల గ్రూప్‌లో పారదర్శకత, బాధ్యత పెరుగుతుందని ఎస్‌పీ గ్రూప్ ఛైర్మన్ షాపూర్ మిస్త్రీ అన్నారు. ఇది కేవలం ఆర్థిక/నియంత్రణ పరమైన అంశం కాదని, సామాజిక, నైతిక ఆవశ్యకతగా మారిందన్నారు.

## కొత్త ఐఫోన్లు వచ్చేశాయ్

అమెరికా సాంకేతిక దిగ్గజం యాపిల్ కొత్తగా ఆవిష్కరించిన ఐఫోన్ 18 ప్రో (ప్రారంభ ధర రూ.1,64,900), ఐఫోన్ 18ప్రో మ్యాక్స్ (రూ.1,79,900).. శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లోనూ అందుబాటులోకి వచ్చాయి. ముందస్తుగా బుకింగ్ చేసుకున్న వారిలో కొందరికే ఈ స్మార్ట్‌ఫోన్లను విక్రయశాలల నిర్వాహకులు అందచేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ 2 ఫోన్లకు తమ వద్ద 400 వరకు ముందస్తు బుకింగులు జరిగినా, కంపెనీ 100కు పైగా మాత్రమే సరఫరా చేయడంతో, వాటినే తొలిరోజు కొనుగోలుదార్లకు అందించగలిగామని ప్రముఖ విక్రయశాలల సంస్థ ప్రతినిధి తెలిపారు. కొత్త ఐఫోన్లను తొలిరోజే అందుకోవాలనే ఉత్సాహం కలిగిన యువత సందడి దిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై వంటి ప్రధాన నగరాల్లోనూ కనిపించింది. ఆధునికీకరించిన ఏ20 చిప్‌సెట్, అత్యంత నాణ్యమైన కెమేరాలు, ఆకర్షణీయ రంగుల్లో లభిస్తున్న ఐఫోన్ 18 సిరీస్ కోసం ఈనెల 12 నుంచి ప్రీబుకింగ్‌లు జరిగాయి. డెలివరీ కూడా ముందుగా అందుకునేందుకు షోరూంలు తెరవకముందే, అడ్వాన్స్‌లు చెల్లించిన వారు బారులుతీరారు.



## భవిష్యతరం రంగాలకు క్యాష్-ఫ్లో ఆధారిత రుణాలే కీలకం

### ఎస్‌బీఐ ఎండీ అశ్వినీ కుమార్ తివారీ

ముంబయి: డేటా కేంద్రాలు, సౌర విద్యుదుత్పత్తి పరికరాల తయారీ, టెక్నాలజీ ఆధారిత వ్యాపారాల వంటి కొత్త తరం పరిశ్రమలకు క్యాష్-ఫ్లో ఆధారిత (ఇప్పటివరకు ఎంత ఆర్జించింది.. ఎంత ఆర్జించే అవకాశం ఉంది అని చూసుకుని ఇచ్చే) రుణాలు కీలక పాత్ర పోషించనున్నాయని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఎండీ అశ్వినీ కుమార్ తివారీ వెల్లడించారు. శుక్రవారం ముంబయిలో భారత్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన ఫైనాన్షియల్ మార్కెట్ కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడారు. బ్యాంకులు అడిగే 'సంప్రదాయ భౌతిక ఆస్తుల హామీల'ను భవిష్య తరం కంపెనీలు ఇవ్వలేకపోవచ్చని పేర్కొన్నారు. ఆస్తుల తనఖా ఆధారంగా మాత్రమే కాకుండా, వ్యాపార సంస్థలు సాధించగల నగదును అంచనా వేసి, రుణాలిచ్చే కొత్త మదింపు నమూనాలను బ్యాంకులు తప్పనిసరిగా అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కొన్ని రంగాలకు క్యాష్-ఫ్లో ఆధారిత రుణాలను అందిస్తోందని, దీన్ని 'చక్ర' మోడల్‌గా పిలుస్తున్నామని తివారీ వెల్లడించారు. వర్ధమాన టెక్నాలజీ రంగంలో ఈ పద్ధతి చాలా కీలకమని, డేటా కేంద్రాలు, సెమీకండక్టర్లు/స్టాటిక్ కండక్టర్లు, సోలార్ తయారీ సరఫరా వ్యవస్థ వంటి వ్యూహాత్మక రంగాలకు రుణాలు అందించడానికి తోడ్పడుతుందని తెలిపారు. బ్యాంకులు కొత్తతరం పరిశ్రమలకు రుణాలు ఇచ్చే ముందు వాటి సాంకేతికత, ఆదాయ సామర్థ్యం, ప్రాజెక్ట్ ఆర్థిక వివరాలు, క్యాష్-ఫ్లో ఉత్పాదకతను లోతుగా విశ్లేషించాలని స్పష్టం చేశారు.

### గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.40 | వరంగల్ ₹ 5.42

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

₹ 1,62,254 (22 క్యారెట్లు) | ₹ 1,77,008 (24 క్యారెట్లు)

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,50,000

# 3 కంపెనీలను హ్యాక్ చేసిన జెమినై ఏఐ..!





**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అత్యాధునిక ఏఐ మోడళ్లతో సైబర్ భద్రతకు సవాళ్లు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఓపెన్‌ఏఐకి చెందిన కృత్రిమ మేధ ఏజెంట్ సైబర్ దాడికి పాల్పడినట్లు తెలిసింది. తాజాగా గూగుల్‌కు చెందిన ఏఐ మోడల్ 'జెమినై ఏఐ కూడా 3 కంపెనీలను హ్యాక్ చేసింది. ఈ విషయాన్ని గూగుల్ ధ్రువీకరించింది. ంఏ ఏజెంట్ల దాడి సామర్థ్యాలను అంచనా వేయడానికి ఈ సంస్థ ఇటీవల సైబర్ సెక్యూరిటీ వ్యవస్థను రూపొందించింది. దానిని పరీక్షిస్తున్న సమయంలో జెమినై తన నిర్దేశిత పరిధులను దాటి.. మూడు ఇతర కంపెనీలకు చెందిన డిజిటల్ సమాచారాన్ని హ్యాక్ చేసినట్లు సంస్థ వెల్లడించింది. ఈ తప్పిదాన్ని గుర్తించిన వెంటనే తమ ఏఐ సైబర్ సెక్యూరిటీ వ్యవస్థ పనిచేయడం దానంతట




అదే ఆగిపోయిందని తెలిపింది. "సైబర్ సెక్యూరిటీ పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఇతర పాస్‌వర్డ్‌లను ఊహించి జెమినై ఏఐ (ఉవఎతినితి ంఏ) బహిరంగ వెబ్ నుంచి మరో మూడు కంపెనీల డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలోకి అనధికారికంగా ప్రవేశించింది. ఈ హ్యాకింగ్ వల్ల ప్రభావిత కంపెనీల డేటాకు ఎటువంటి హాని జరగలేదని ధ్రువీకరించుకున్నాం. ఈ విషయంలో మా ఏఐ బాధ్యతాయుతంగా వ్యవహరించింది. హ్యాకింగ్ వల్ల ప్రభావితమైన సంస్థలను ఇప్పటికే సంప్రదించాం. ఆయా సంస్థలు బలహీనమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం వల్ల ఈ సమస్య తలెత్తింది. శక్తిమంతమైన ఏఐ నమూనాలు బాధ్యతాయుతంగా ప్రవర్తించేలా వాటికి శిక్షణ ఇవ్వడం ఎంత ముఖ్యమో దీని ద్వారా తెలిసింది" అని గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ వైస్ ప్రెసిడెంట్ హీథర్ అడ్కిన్స్ వెల్లడించారు. ఇదీ చదవండి: 2030కి భారత్‌లోనే అతిపెద్ద డెవలపర్ కమ్యూనిటీ

## ఆ పదవి నుంచి మంత్రిని తొలగించండి: ఆర్బీఐ

మహారాష్ట్ర మంత్రి బాబాసాహెబ్ పాటిల్‌తోపాటు మరో ఏడుగురిని లాతూర్ డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ల పదవుల నుంచి తొలగించాలని భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆదేశాలు జారీ చేసింది. పదేళ్ల పదవీకాల పరిమితిని మించిన నేపథ్యంలో ఈమేరకు చర్యలు తీసుకుంది. బాబాసాహెబ్ పాటిల్.. ఉప ముఖ్యమంత్రి సునేత్ర పవార్ నాయకత్వంలోని ఎన్సీపీకి చెందిన నేత. బ్యాంకు సభ్యుడు సతీశ్ జాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ జారీ చేసిన ఆదేశాల మేరకు ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. బ్యాంకింగ్ చట్టాల ప్రకారం.. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల డైరెక్టర్ల పదవీకాలం గరిష్ఠంగా పదేళ్లు ఉంటుంది. ఈ ఏడాది మేలో సతీశ్ జాదవ్ ఇదే అంశాన్ని లేవనెత్తి.. లాతూర్ డీసీసీ బ్యాంక్‌కు చెందిన ఎనిమిది మంది డైరెక్టర్లను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఆర్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే.. ఆర్బీఐ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో.. జూన్‌లో బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఆరు వారాల్లోగా దీనిపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఆగస్టు 3న ఆదేశించడంతో.. ఆర్బీఐ ఈమేరకు చర్యలు తీసుకుంది.




## రూ.3.7 లక్షల కోట్లు పెరిగిన సంపద

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఐటీ, టాటా గ్రూప్ కంపెనీల షేర్లలో అమ్మకాల కారణంగా సూచీలు మళ్లీ మిశ్రమంగా ముగిశాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధర దిగివచ్చినా, ఆ సానుకూలత పెద్దగా కనిపించలేదు. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు తగ్గి 95.96 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 1.07% నష్టంతో 103.71 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో సింగపూర్ మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు నష్టాల్లో ఆరంభమయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.3.7 లక్షల కోట్లు పెరిగి రూ.479.78 లక్షల కోట్ల (5.01 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 74,575.24 పాయింట్ల వద్ద లాభాల్లో ఆరంభమైంది. ఆ తర్వాత స్వల్ప శ్రేణిలో కదలాడుతూ 74,728.44 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. ఈ స్థాయి వద్ద అమ్మకాలతో సూచీ నష్టాల్లోకి జారుకుంది. చివరకు 19.63 పాయింట్ల నష్టంతో 74,294.96 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ మాత్రం 75.80 పాయింట్లు పెరిగి 23,346.40 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 23,389.15 వద్ద గరిష్ఠాన్ని; 23,286.60 వద్ద కనిష్ఠాన్ని ఈ సూచీ తాకింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 486.80 పాయింట్లు, నిఫ్టీ 51.7 పాయింట్లు కోల్పోయాయి. టాటా సన్స్, టాటా ట్రస్ట్స్ మధ్య భేదాభిప్రాయాల నేపథ్యంలో టాటా గ్రూపునకు చెందిన పలు కంపెనీల షేర్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. టాటా కెమికల్స్ 11.14%, టాటా టెక్నాలజీస్ 4.65%, టీసీఎస్ 4.33%, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 3.45%, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ 2.32%, టైటన్ 2.11%, టాటా స్టీల్ 1.73%, టాటా ఎలెక్సీ 1.33%, టాటా కమ్యూనికేషన్స్ 1.1%, ట్రెంట్ 0.64%, వోల్టాస్ 0.5% నష్టపోయాయి. గ్రూప్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.58,000 కోట్ల మేర తగ్గింది. సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 10 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. టీసీఎస్, టైటన్ తర్వాత ఏషియన్ పెయింట్స్ 2%, మారుతీ సుజుకీ 1.98%, టెక్ మహీంద్రా 1.82%, టాటా స్టీల్ 1.73%, సన్‌ఫార్మా 1.63% తగ్గాయి. అదానీ పోర్ట్స్ 3.72%, పవర్ గ్రిడ్ 2.47%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.26%, భారతీ ఎయిర్‌టెల్ 2.11%, బజాజ్ ఫైనాన్స్ 1.08% పెరిగాయి. వీగాల్యాండ్ డెవలపర్స్ షేరు ఇష్యూ ధర రూ.140తో పోలిస్తే, తొలిరోజు బీఎస్ఈలో 3.53% లాభంతో రూ.144.95 వద్ద ముగిసింది.

ఐపీఓ సమాచారం

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ఐపీఓ రెండో రోజుకే 100% స్పందన లభించింది. అయితే చిన్న మదుపర్ల విభాగంలో 66% షేర్లకే బిడ్‌లు దాఖలయ్యాయి. హీరో మోటార్స్ ఐపీఓ ముగిసేసరికి 6.66 రెట్ల బిడ్‌లు దాఖలయ్యాయి. రిటెయిల్ మదుపర్ల విభాగంలో 8.23 రెట్లు అధికంగా బిడ్‌లు వచ్చాయి. జిందాల్ సుప్రీమ్ ఇండియా లిమిటెడ్ ఐపీఓకు 181.07 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 149.34 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) కోసం సంబంధిత ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించినట్లు హై-టెక్ ఫ్లో సొల్యూషన్స్ లిమిటెడ్ తెలిపింది. రూ.300 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రమోటర్లు కొంత మేర వాటాలను విక్రయించనున్నారు. ఎలివేట్ క్యాంపసెస్ రూ.2,100 కోట్ల పబ్లిక్ ఇష్యూకు ధరల శ్రేణిగా రూ.343-362ను నిర్ణయించారు. ఇష్యూ ఈనెల 23న ప్రారంభమై 25న ముగియనుంది. ఎస్ఎస్ రిటెయిల్ లిమిటెడ్ ఐపీఓ ముగిసేసరికి 103.30 రెట్ల స్పందన లభించింది. రిటెయిల్ మదుపర్ల విభాగంలో 36.36 రెట్లు అధికంగా బిడ్‌లు వచ్చాయి.

## 2030కి భారత్‌లోనే అతిపెద్ద డెవలపర్ కమ్యూనిటీ

### మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల



**న్యూయార్క్:** భారత్‌లో పెరుగుతున్న సాంకేతిక నిపుణుల సంఖ్య వల్ల, 2030 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద డెవలపర్ కమ్యూనిటీగా నిలుస్తుందని మైక్రో సాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల పేర్కొన్నారు. భారత్‌లో ఏఐ సాంకేతికతలో అవకాశాలను మరింత బలోపేతం చేయడానికి భారీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నట్లు పునరుద్ఘాటించారు. సియాటెల్‌లో భారత కాన్సులేట్ జనరల్ నిర్వహించిన కార్యక్రమంలో అమెరికా, భారత్ టెక్నాలజీ నిపుణులను ఉద్దేశించి, ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత 35 ఏళ్లుగా సియాటెల్ టెక్నాలజీ కమ్యూనిటీ సాధించిన అభివృద్ధి, భారత్‌తో ఉన్న సంబంధాలను సత్య నాదెళ్ల ప్రస్తావించారు. వివిధ దేశాలు, సమాజాలు, రంగాల్లో కృత్రిమ మేధ (ఏఐ) ఎంత విస్తృతంగా వ్యాప్తి చెందుతుందనే దానిపై ఆధారపడి ప్రయోజనాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్, అమెజాన్, బోయింగ్, ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్, ఇంటెల్, గేట్స్ ఫౌండేషన్ వంటి ప్రముఖ టెక్నాలజీ కంపెనీల ప్రతినిధులు సహా 40 మందికి పైగా భారత సంతతి సీఈఓలు, సీటీఓలు ఈ ఫోరానికి హాజరయ్యారు. అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా మాట్లాడుతూ, భారత్-అమెరికా సాంకేతిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఇరుదేశాల నిపుణులు చూపుతున్న ఆసక్తిని స్వాగతించారు. ఏఐ విషయంలో సంబంధిత భాగస్వాములతో కలిసి పనిచేయడానికి భారత్ సిద్ధంగా ఉందని చెప్పారు.

## ఏఐ వల్ల ప్రమాదం 'సున్నా'

### ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్



కృత్రిమ మేధపై ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ కీలక వ్యాఖ్యలు చేశారు 2030 నాటికి ఏఐ ప్రపంచాన్ని అంతం చేస్తుం దన్న వాదనలను తోసిపుచ్చారు. ఇందుకు ఆస్కారం లేదన్నారు. ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ దశాబ్దం చివరి నాటికి ఏఐ వల్ల మానవళి అంతమవుతుందన్న వాదనల్లో అర్థం లేదు. ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ప్రమాదం ఉందన్న వార్తలతో పలు కంపెనీలు కృత్రిమ మేధ అభివృద్ధిని నెమ్మదించడం సరికాదు. తమ సిస్టమ్‌ల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా అసురక్షితంగా భావించే సిస్టమ్‌లను విడుదల చేయొద్దు. ఇతరులతో సంబంధం లేకుండా సాధ్యమైనంత వేగంగా ఏఐ వైపు పయనించాలి" అని ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ సూచించారు. మరోవైపు, ఏఐ వల్ల రానున్న పదేళ్లలో 10 శాతానికిపైగా జనం ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆంత్రోపిక్‌కు చెందిన పరిశోధకుడు ఇవాన్ హుబింగర్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. ఏఐ స్పీడ్‌కు ఇకనైనా కళ్లెం వేయాలని ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడెయ్, ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్, ఎక్స్ ఏఐ అధిపతి ఎలాన్ మస్క్ అభిప్రాయపడ్డారు. దీంతో తాజాగా ఏఐపై ఎన్విడియా సీఈఓ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## నెస్లే ఇండియాపై ఎఫ్ఎస్ఎస్ఏఐ చర్యలు

దిల్లీ: నెస్లే ఇండియాకు చెందిన 3 శిశు పోషకాహార ఉత్పత్తుల్లో నిబంధనల ఉల్లంఘన జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో చట్టపర చర్యలకు ఆహార నియంత్రణాధికార సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ ఉపక్రమించింది. నాన్ ఎక్సెలా ప్రో స్టేజ్ 1, లాక్టోజెన్ ప్రో 1తో పాటు ఒక ఫాలో అప్ ఫార్ములా విషయంలో చర్యలు మొదలుపెట్టినట్లు తెలిపింది. కంపెనీ మాత్రం తమకు వర్తించే నిబంధనలన్నీ పూర్తిగా పాటించినట్లు పేర్కొంది. ఇవీ ఆరోపణలు: నాన్ ఎక్సెలా ప్రో స్టేజ్ 1లో '5హెచ్ఎమ్ఓ', 'వే ప్రొటీన్'కు సంబంధించిన క్లెయిములపై ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. లాక్టోజెన్ ప్రో 1 విషయంలో 'వే ప్రొటీన్' సులభంగా అరుగుతుందని కంపెనీ చెప్పినట్లుగా గుర్తించింది. 3 ఉత్పత్తులను, ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల్లో లభ్యమైన ప్రచార సమాచారాన్ని పరిశీలించిన అనంతరం ఈ క్లెయిముల విషయంలో నెస్లే ఇండియాను స్పష్టత కోరింది.

## మార్కెట్‌కు దేశీయ రిటెయిల్ మదుపర్లే రక్ష

### యాంఫీ సీఈఓ వెంకట్ చలసాని

హైదరాబాద్: మన స్టాక్ మార్కెట్ దిశను నిర్ణయించే పరిస్థితి ఒకప్పుడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులకు ఉండేదని.. కానీ, ఇప్పుడు దేశీయ రిటెయిల్ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారులు, దేశీయ సంస్థాగత మదుపరులే మార్కెట్‌కు కీలకంగా ఉంటున్నారని భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) సీఈఓ వెంకట్ చలసాని అన్నారు. క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) రూపంలో ప్రతి నెలా వస్తున్న రూ.వేల కోట్లు, దేశీయ ఈక్విటీ మార్కెట్‌కు బలమైన రక్షణ కవచంలా మారాయని ఆయన విశ్లేషించారు. '2014లో దేశంలో మొత్తం ఫండ్ల నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ రూ.10 లక్షల కోట్లు. 12 ఏళ్లలో ఈ మొత్తం రూ.87 లక్షల కోట్లకు చేరింది. రాబోయే 9-12 నెలల్లో రూ.100 లక్షల కోట్ల (రూ.1 కోటి కోట్లు) మైలురాయిని అధిగమిస్తామనే నమ్మకం ఉంది. దేశంలో ఫండ్ మదుపర్లు 6.3 కోట్లకు పైగా ఉన్నారు' అని వివరించారు. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వేగంగా వృద్ధి సాధిస్తున్నాయని వెంకట్ పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల్లో కలిపి మొత్తం ఎంఎఫ్ ఆస్తుల విలువ రూ.2.95 లక్షల కోట్లకు చేరిందన్నారు. ఇందులో తెలంగాణ ఫండ్ ఆస్తుల విలువ రూ.2,12,856 కోట్లని, దేశంలో 2.5% వాటాతో 8వ స్థానంలో ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన ఏయూఎం విలువ రూ.82,409 కోట్ల మేర ఉందని.. విశాఖపట్నం, విజయవాడ నుంచి అధిక మొత్తంలో పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. సంప్రదాయకంగా బంగారం, స్థిరాస్తులు కొనుగోలు చేసే అలవాటు తెలుగు ప్రజలకు ఎక్కువ అని, జాతీయ సగటు కంటే ఎక్కువగా ఇక్కడ వీటిలోనే పెట్టుబడులున్నాయన్నారు. ఆర్థిక ఆస్తుల విషయానికి వస్తే.. 40% వరకు బ్యాంకు డిపాజిట్లలోనే ఉంటున్నాయని తెలిపారు. 'మనం కష్టపడి సంపాదించిన సొమ్ము మనకు ఉపయోగపడాలి. కేవలం డిపాజిట్లు, స్థిరాస్తుల్లోనే ఉంచితే ద్రవ్యోల్బణం, పన్నుల తర్వాత నికర రాబడి తక్కువగా లభిస్తుంది. దీర్ఘకాలిక పెట్టుబడుల ద్వారా ఆర్థిక లక్ష్యాలకు తగ్గట్లు సంపద సృష్టించుకోవచ్చు' అని వెంకట్ సూచించారు.

# కళ్యాణ కట్టల్లో నాయి బ్రాహ్మణుల నిరసన

- దక్షిణ తీసుకున్నందుకు రూ15 వేల జరిమానా విధించారంటూ ఆరోపణ



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయరెండవ కళ్యాణ కట్టల్లో విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులు శనివారం విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు.ఆలయ అధికారులు తమను అనుమానాస్పదంగా చూస్తూ పలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణులు మాట్లాడుతూ కళ్యాణ కట్టలకు వచ్చే భక్తులు తలనీలాలు సమర్పించుకున్న అనంతరం తమ ఇష్టపూర్వకంగా రూ. 50, రూ. 100 దక్షిణగా ఇస్తే మాత్రమే స్వీకరిస్తున్నామన్నారు.తాము భక్తుల వద్ద డబ్బులు డిమాండ్ చేయడం లేదని స్పష్టం చేశారు. అయితే అధికారులు తమను పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**భక్తుల విషయంలో వివాదం**

రెండు రోజుల క్రితం వరంగల్‌కు చెందిన కొందరు భక్తులు తలనీలాలు సమర్పించుకున్న అనంతరం నాయి బ్రాహ్మణులకు తమ ఇష్టపూర్వకంగా దక్షిణ ఇచ్చారన్నారు. ఆలయ ఏఈఓ భక్తుల వద్దకు వెళ్లి నాయి బ్రాహ్మణులు డబ్బులు డిమాండ్ చేశారా..? అంటూ వీడియో తీసినట్లు వారు ఆరోపించారు.ఆ వీడియోను ఆలయ ఈఓకు అందచేసి ముగ్గురు నాయి బ్రాహ్మణులు రూ15 వేల చొప్పున చెల్లించాలని ఆదేశించినట్లు వారు వాపోయారు.

**మాకు కమిషన్ ఇవ్వాలని డిమాండ్..**

కళ్యాణ కట్టల్లో టికెట్ రుసుము రూ 50 గా ఉందని ఇందులో రూ 30 స్థానికంగా వంశ పారంపర్యంగా విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులకు చెల్లిస్తుండగా, రూ 20 దేవస్థానం ఆదాయంలో జమవుతున్నట్లు వారు తెలిపారు.అదే విధంగా తాము కూడా ఎలాంటి జీతం లేకుండా విధులు నిర్వహిస్తున్నందున టికెట్ రుసుములో నుంచి కనీసం రూ 10 కమిషన్‌గా ఇవ్వాలని కోరుతున్నామన్నారు.

దేవస్థానం నుంచి గానీ, కాంట్రాక్టర్ నుంచి గానీ ఎలాంటి జీతం లేదా కమిషన్ లేకుండా సుమారు పదేళ్లుగా స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తుల మొక్కుబడులైన తలనిలాలు తీస్తూ తాము విధులు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో తమకు కూడ స్థానిక నాయి బ్రాహ్మణుల మాదిరిగా కమిషన్ ఇస్తారనే ఆశతో ఇన్నాళ్లూ ఎదురుచూశామని, భక్తులు ఇచ్చిన దక్షిణ తీసుకున్న వారి నుండి రూ 15 వేలు చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తూ డబ్బులు చెల్లించకపోతే విధులకు రావద్దంటూ చెబుతున్నారని నాయి బ్రాహ్మణులు ఆరోపించారు. తమ సమస్యలను పరిష్కరించకుండా, తమను పలు రకాలుగా ఇబ్బందుల గురిచేస్తున్న క్రమంలో విధులను బహిష్కరించి నిరసన తెలిపామన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి నర్సయ్య, కళ్యాణ లక్ష్మణ్, గుండం తిరుపతి, ఓరుగంటి శ్రీశైలం,శేఖర్,అవధూతల దామోదర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# సెంట్రల్ వర్సిటీ ఏర్పాటు చేయాలి

**ప్రధాని మోదీకి మాజీ ఎంపీ గొట్టె భూపతి లేఖ**



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 19, (జనం సాక్షి) :** పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎంపీ గొట్టె భూపతి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పెద్దపల్లి, గోదావరిఖని ప్రాంతాల్లో సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

పెద్దపల్లి ప్రాంతంలో సింగరేణి కాలరీస్, ఎన్టీపీసీ, ఎరువుల కర్మాగారంతో పాటు అనేక భారీ పరిశ్రమలు ఉన్నాయని భూపతి తన లేఖలో వివరించారు. వీటితో పాటు చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నాయని తెలిపారు. ఆయా పరిశ్రమల్లో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం తెలంగాణ నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది వచ్చి ఇక్కడ స్థిరపడ్డారని పేర్కొన్నారు.

దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో నివసిస్తూ పరిశ్రమలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయని ఆయన తెలిపారు. ఆయా కుటుంబాల్లోని విద్యార్థులు ఉన్నత విద్య కోసం ప్రైవేటు కళాశాలలు, విద్యాసంస్థలపై ఆధారపడాల్సి వస్తోందని, అధిక ఫీజులు చెల్లించడం వారికి ఆర్థిక భారంగా మారుతోందని వివరించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోని పరిశ్రమలు, సంస్థలతో పాటు ప్రైవేటు పరిశ్రమల్లో వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు ఉపాధి పొందుతున్నారని భూపతి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఉన్న విద్యార్థులు, ముఖ్యంగా కార్మిక కుటుంబాల పిల్లలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

పారిశ్రామికంగా గుర్తింపు పొందిన పెద్దపల్లి లేదా గోదావరిఖని ప్రాంతాల్లో సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంతో పాటు చుట్టుపక్కల జిల్లాల విద్యార్థులకు కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కార్మిక కుటుంబాల సంక్షేమం, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టి, ఈ ప్రాంత ప్రజల చిరకాల విద్యా అవసరాన్ని నెరవేర్చాలని మాజీ ఎంపీ గొట్టె భూపతి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు.


# ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అక్రమాలపై విచారణ జరపాలి

**కమాన్‌పూర్ బీఆర్ఎస్ నాయకుల డిమాండ్**



**కమాన్‌పూర్, సెప్టెంబర్ 19, (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో నిజమైన నిరుపేదలకు అన్యాయం జరుగుతోందని, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమాన్‌పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించినారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. మొదటి, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హులైన నిరుపేదలకు ఇళ్లు దక్కలేదని విమర్శించారు. మంత్రి శ్రీధర్ బాబు పీఏ పంపిన జాబితా ఆధారంగానే లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు ఎంపీడీవో చెప్పినట్లు పత్రికల్లో వచ్చిన వార్తలపై విచారణ జరపాలని కోరారు.

ఇళ్ల మంజూరుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలపైనా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా అన్ని గ్రామాల్లోని అర్హులైన నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు తాడికొండ శంకర్, యూత్ మాజీ మండల అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, గుర్రం లక్ష్మీమల్లు, మాజీ సర్పంచులు కొండ వెంకటేష్, ఆకుల గట్టయ్య, కొట్టే భూమయ్య, దండే కిషన్, కొయ్యడ రవి, తోట రాజ్‌కుమార్, పెండ్లి నారాయణ, ఎలబోయిన రామ్మూర్తి, నడిగట్టు సంపత్, ఆకుల రమేష్, చిప్పకుర్తి రాజ్ కుమార్, చిప్పకుర్తి శ్రీనివాస్, జాబు సతీష్, రాచకొండ రవి, బోయిని బాలకృష్ణ, పంతకాని రవి, రాజకొండ చంద్రమౌళి, సుధాకర్, మానక ఓదెలు, బొల్లపెల్లి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## శిథిలావస్థలో పశువైద్య కేంద్రం భవనం... పట్టించుకోని ప్రభుత్వం

**ముస్తాబాద్, సెప్టెంబర్ 19 (జనం సాక్షి):** ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. వర్షాలు పడుతున్న ప్రతిసారి భవనం స్లాబ్ లీకై సిమెంట్ పెచ్చులు ఊడిపడుతున్నాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.భవనం గోడలు తడిచిపోవడంతో గదుల్లో నిల్వ ఉంచిన మందులు పాడవుతున్నాయని, వర్షం వచ్చినప్పుడు ఎప్పుడైనా పెచ్చులు కూలిపోతాయనే భయంతో పనిచేయాల్సి వస్తోందని తెలిపారు. ఇక భవనం వెనుక భాగంలోని తలుపు పూర్తిగా ధ్వంసం కావడంతో కోతులు లోపలికి చేరి మందుల సామాగ్రిని చిందరవందర చేస్తున్నాయని చెప్పారు. అదనంగా ఎలుకలు, పాములు సంచరిస్తుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితుల్లో సిబ్బంది,రైతులు భవనం భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులు వెంటనే స్పందించి భవనానికి తక్షణ మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజల సేవలకు కీలకమైన ఈ కేంద్రాన్ని సురక్షితంగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు

## వాట్సాప్‌లో మహిళా సర్పంచ్‌ను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

వివరాలు వెల్లడించిన చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్

**చిగురుమామిడి సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన మహిళా సర్పంచ్‌ను వాట్సాప్ ద్వారా వేధింపులకు గురిచేసిన వ్యక్తిపై చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కత్తుల రమేష్ అనే వ్యక్తి సర్పంచ్‌కు వాట్సాప్ ద్వారా అత్యంత అవమానకరమైన మెసేజ్‌లు,ఆడియో రికార్డింగులు పంపడమే కాకుండా,ఆమె వ్యక్తిగత జీవితంపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ బెదిరింపులకు గురిచేశారని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.దీనిపై బాధితురాలు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు చిగురుమామిడి పోలీసులు కత్తుల రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.రమేష్ పంపిన వాట్సాప్ మెసేజ్‌లు,ఆడియో రికార్డింగులతో కూడిన ఎలక్ట్రానిక్ ఆధారాలను పోలీసులు ప్రస్తుతం క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.పూర్తి ఆధారాల సేకరించిన అనంతరం రమేష్ పై చట్టపరమైన తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్సై వివరించారు.

# భూదార్ కార్డులతో భూ సమస్యలకు పరిష్కారం

- 22-ఏ సమస్యలకు త్వరలో ముగింపు.. జీవో 118 అమలుతో కాలనీల క్రమబద్ధీకరణ
- 45 రోజుల్లో భూ సమస్యల పరిష్కారం : రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 19 (జనం సాక్షి):** రైతుల భూ సమస్యల పరిష్కారానికి ఆధార్ తరహాలో భూదార్ కార్డులు జారీ చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 22-ఏ సమస్యకు త్వరలోనే ముగింపు పలుకుతామన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల్లో ఇళ్ల క్రమబద్ధీకరణ ధ్రువపత్రాలను శనివారం మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ 22-ఏ నిబంధన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచే అమల్లో ఉందన్నారు. మరో వారం రోజుల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తుందని తెలిపారు. సింగరేణి ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు జీవో 76 అమలు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామని, 45 రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు జీవో 118 అమలు చేసి కాలనీల సమస్యను పరిష్కరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్, కలెక్టర్ సీ.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

# 'డబుల్ బెడురూమ్' ఇళ్లకు అవసరమైన మరమ్మత్తులు చేయించండి

- నీరు, విద్యుత్, రోడ్డు వంటి కనీస వసతులు తప్పనిసరిగా కల్పించాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** కరీంనగర్, హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కు అవసరమైన మరమ్మతులు చేయించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో గృహ నిర్మాణ శాఖ, ఆర్ అండ్ బీ అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిసరాలు శుభ్రం చేయించాలని తెలిపారు. ఇళ్ల వద్ద ప్రస్తుత పరిస్థితి, అవసరమైన మరమ్మత్తులు, కల్పించాల్సిన నీటి, విద్యుత్, రోడ్డు తదితర కనీస సౌకర్యాల గురించి చర్చించారు. అర్హులకు ఇల్లు అందించిన తర్వాత సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు ముందస్తుగా చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ డీఈ ప్రవీణ్, ఆర్అండ్ బీడీఈ శ్రీకాంత్, జేఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ విద్యార్థినికి కవ్వంపల్లి ఆర్థిక చేయూత

- రూ.1.29 లక్షల సాయం.. చదువు పుస్తకాల బాధ్యత నాదే
- పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు
- మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** ఆర్థిక ఇబ్బందులతో ఎంబీబీఎస్ చదువు కొనసాగించలేనేమోనని ఆందోళన చెందుతున్న వరంగల్ జిల్లా చెన్నారెడ్డిపల్లి లేబర్ కాలనీకి చెందిన విద్యార్థిని వడ్డేపల్లి రహేల్‌కు మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆర్థిక సాయం అందించారు. హైదరాబాద్‌లో శనివారం కుటుంబ సభ్యుల సమక్షంలో రూ. 1,29,500 విలువైన రెండు చెక్కులను అందజేశారు. పేదరికం ప్రతిభావంతుల చదువుకు అడ్డంకి కాకూడదని, రహేల్ వైద్యురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆమె చదువుకు అవసరమైన పుస్తకాల బాధ్యత తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. టీపీసీసీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పోలేపక జీవన జ్యోతి కూడా ఆర్థిక సాయం అందించారు. తమ కుమార్తెకు అండగా నిలిచిన వారికి రహేల్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు బత్తుల పర్శరాములు, డా. కొలపురి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ల పేరుతో డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు

**దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు.. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తున్న 'చేయూత' పింఛన్ల పథకాన్ని అడ్డుపెట్టుకుని పేద ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసే దళారులు, మధ్యవర్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ సూచించారు. పింఛన్ ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే వారికి డబ్బులు ఇవ్వకుండా వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. పింఛన్ల పంపిణీకి ఎలాంటి దళారులు, మధ్యవర్తులు అవసరం లేదని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హత ఉన్న లబ్ధిదారులకే పింఛన్లు మంజూరవుతాయని, పింఛన్ సొమ్ము నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. అలాగే అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆన్‌లైన్ ఫోటో వెరిఫికేషన్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. పింఛన్ ఇప్పిస్తామని డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లేనని ఆమె అన్నారు. పేద ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ పథకాల పేరుతో డబ్బులు వసూలు చేసే దళారులు, మధ్యవర్తులను ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఇలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందించాలని ఆమె సూచించారు.

# ఎండిఎస్ నర్సింగ్ కాలేజీలో ఐదో బ్యాచ్ స్నాతకోత్సవం

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 19 (జనం సాక్షి) :** గ్రామీణ, వెనుకబడిన వర్గాల ఆరోగ్య సంరక్షణలో నర్సుల పాత్ర కీలకమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారు (ప్రజా వ్యవహారాలు) కె.కేశవరావు అన్నారు. శనివారం ఎండిఎస్, బన్సిలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఐదవ బ్యాచ్ బి.ఎస్సీ నర్సింగ్ స్నాతకోత్సవాన్ని నిర్వహించింది. ఈ బ్యాచ్‌లో 50 మం ది విద్యార్థులు పట్టభద్రులయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన కేశవరావు మాట్లాడుతూ .. నర్సింగ్ అనేది కరుణ, ధైర్యం, సేవతో కూడిన వృత్తి అని పేర్కొన్నారు. మహిళా దక్షతా సమితి అధ్యక్షురా లు సరోజ్ బజాజ్ మాట్లాడుతూ నర్సింగ్ విద్యను మరింత బలోపేతం చేసేందుకు త్వరలో ఎం.ఎస్సీ నర్సింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. గౌరవ అతిథులుగా కిమ్స్ హాస్పిటల్స్ జీఐ, హెచ్‌పిబి సర్జరీ సీనియర్ కన్సల్టెంట్, అకడమిక్ డైరెక్టర్ ప్రొ.డా. ఆర్.ఎ.శాస్త్రి, యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఆంకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ సచిన్ మర్దా పాల్గొన్నారు.



# పట్నం నడిబొడ్డున.. నరకం

## మున్సిపాలిటీకి పట్టని పారిశుధ్యం

### మూడు రోజులుగా మురుగునీటిలో ప్రజల అవస్థలు

- ముక్కు మూసుకుని ప్రయాణం
- బాధ్యులపై చర్యలేవి?...ప్రశ్నిస్తున్న స్థానికులు

**నిజామాబాదు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 జనం సాక్షి:**

*పట్టణంలోని ప్రధాన రహదారి ఇది. నిత్యం వేలాది మంది ప్రయాణికులు, వాహనదారులు రాక పోకలు సాగించే రద్దీ ప్రాంతం. కానీ, గత మూడు రోజులుగా ఇక్కడి పరిస్థితి చూస్తే, ఇది ఒక అభివృద్ధి చెందుతున్న పట్టణంలోని రోడ్డులా కాకుండా, ఒక నరక కూపంలా కనిపిస్తోంది. కొంసంత వర్షాలు పడగానే రోడ్డుపై చేరిన మురుగునీరు నిలిచిపోయి, మురుగు కుంటగా మారిపోయింది.మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, పారిశుధ్య నిర్వహణలో వైఫల్యం వల్ల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.*

**దుర్వాసన రోగాల భయం**

రోడ్డుకు ఇరువైపులా, ముఖ్యంగా ఎడమ వైపున నిలిచిన మురుగునీరు, బురద రోడ్డు అంతటా వ్యాపించింది. దీంతో తీవ్రమైన దుర్వాసన వెలువడుతోంది. వాహనదారులు, పాదచారులు ఈ మురుగు గుండా వెళ్లేటప్పుడు తమ ముక్కులు మూసుకోవడం తప్పనిసరి అవుతోంది. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు ఈ దుర్వాసనను భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వల్ల పేరుకుపోయిన ఈ మురుగునీటిలో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. దీంతో స్థానికులలో డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది.

**అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

గత మూడు రోజులుగా ఈ సమస్య ఉన్నప్పటికీ, మున్సిపాలిటీ అధికారులు మాత్రం కనీసం స్పందించలేదు. కనీసం మురుగు నీటిని తొలగించే ప్రయత్నం కూడా చేయలేదు. రోడ్డు గుంతలమయమై, బురదగా మారడం వల్ల వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. స్థానికులు, వ్యాపారులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోక పోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**ప్రజల విమర్శలు**

పన్నులు చెల్లించేది ఎందుకు? మా ఆరోగ్యాన్ని బలిగొనడానికా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇది అభివృద్ధి కాదు, అవినీతి, నిర్లక్ష్యానికి నిదర్శనం అని ఆరోపణలు వెల్లువత్తుతు న్నాయి. మున్సిపల్ పాలకులు ఎన్నికల సమయంలో హామీలు ఇస్తారు కానీ, ఇలాంటి ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంలో మాత్రం విఫలమవుతున్నారు అని ఓ వాహనదారుడు విమర్శించారు.

**మున్సిపాలిటీ ఏం చేయాలి?**

తక్షణమే ఈ మురుగునీటిని తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలి. పాడైన రోడ్డును వెంటనే మరమ్మతు చేయాలి. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయాలి. పారిశుధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి.పట్టణ అభివృద్ధి అనేది కేవలం కాంక్రీట్ భవనాల నిర్మాణం కాదు, ప్రజలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం కూడా. మున్సిపాలిటీ అధికారులు తమ బాధ్యతను విస్మరిస్తే, రాబోయే కాలంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు. తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరిస్తారని ఆశిద్దాం.

## శిలాఫలకంపై పేరు లేకపోవడంపై ఆత్మ కమిటీ జిల్లా అధ్యక్షుడి ఆవేదన



**ముస్తాబాద్, సెప్టెంబర్ 19 (జనం సాక్షి):** పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీకాలం శనివారంతో ముగియనున్న నేపథ్యంలో యార్డులో రూ.28.30 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంపై జిల్లా ఆత్మ కమిటీ అధ్యక్షుడు కొండం రాజిరెడ్డి పేరు లేకపోవడంపై ఆయన అనుచరులు అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా అధికారిక సమావేశాల్లో తనను వేదికపైకి ఆహ్వానిస్తున్నప్పటికీ మార్కెట్ కమిటీ కార్యక్రమంలో పేరు చేర్చకపోవడం పట్ల రాజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అభివృద్ధి పనుల శిలాఫలకాలపై రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షుల పేర్లు చేర్చేవారని గుర్తుచేశారు. దీనిపై మార్కెట్ కమిటీ కార్యదర్శి స్పందిస్తూ అన్ని పేర్లను జిల్లా అధికారులకు పంపామని, తుది జాబితాను వారే నిర్ణయించారని తెలిపారు. ఇందులో పాలకవర్గం, కార్యదర్శి వ్యక్తిగతంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.

## మెడికల్ షాప్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరి



**ముస్తాబాద్ సెప్టెంబర్ 19 (జనం సాక్షి) :** డాక్టర్ చిట్టి ఉంటే తప్ప అమ్మడానికి వీలుని ఔషధాల విక్రయాన్ని విక్రయించే దుకాణాలు ఉన్నాయి వ్యవస్థను బలోపేతం చేసేందుకు మండలంలో ప్రతి మెడికల్ షాప్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రతిపాదించింది. సవరించిన ఔషధ నియమాల్లో భాగంగా షెడ్యూల్ హెచ్, హెచ్1, ఎక్స్ ఔషధాలను డాక్టర్ చిట్టి లేకుండా విక్రయించడాన్ని నిరోధించేందుకు ఈ ఈ చర్య అవసరమని ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రతిపాదలపై తోలుతో ఔషధ సంప్రదింపుల కమిటీ చర్చించింది. అనంతరం వాటిని ఔషధ సాంకేతిక సలహా బోర్డు పరిశీలనకు పంపి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనలపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని శాఖ పిలుపునిచ్చింది. మండలంలో బీనామి పేర్లమీద మెడికల్ షాప్ లైసెన్సు పొంది అర్హత లేని వ్యక్తులు నిర్వహిస్తున్నారు. మెడికల్ షాప్ ముందు మెడికల్ షాప్ వెనుక ఆర్ఎంపి వైద్యులు నిర్వాకం మండలంలో కొనసాగుతుంది. వాటిపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు పాటించక నడుపుతున్న షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# యువత మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగ చేసుకోవాలి

**కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య**



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 జనం సాక్షి:** శనివారం జిల్లా కేంద్రంలో NN AI Solution ఆధ్వర్యంలో నిర్వహించిన “NN Hackathon 2026 – Code for Changeμμ కార్యక్రమం IT టవర్స్ యందు ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు, యువత, టెక్నాలజీ నిపుణులతో ముచ్చటిస్తూ వారు రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులు మరియు సమస్యల పరిష్కార విధానాలను పరిశీలించారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కీలకంగా మారుతోందని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వివిధ సామాజిక సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలను అభివృద్ధి చేసే అవకాశం ఉందని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. యువతలో ఉన్న సృజనాత్మకత, ఆలోచనా శక్తి, సాంకేతిక నైపుణ్యాలను సరైన దిశలో వినియోగిస్తే సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. “Code for Change” వంటి కార్యక్రమాలు యువతను సాంకేతిక రంగంలో మరింత ప్రోత్సహించడంతో పాటు, సమాజానికి ఉపయోగపడే వినూత్న పరిష్కారాలను రూపొందించేందుకు వేదికగా నిలుస్తాయని అన్నారు.
పోలీసింగ్ వ్యవస్థలో కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజా భద్రత, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, డేటా విశ్లేషణ, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించే దిశగా సాంకేతికతకు ప్రాధాన్యత పెరుగుతోందని పేర్కొన్నారు. యువత కేవలం సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవడమే కాకుండా, దానిని ప్రజా ప్రయోజనం, సమాజ శ్రేయస్సు మరియు దేశ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా వినియోగించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. యువత రోడ్డు భద్రత నియమావళిని తప్పనిసరిగా పాటించాలని 2025 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల వలన జిల్లా వ్యాప్తంగా 327 మంది మరణించారని అదే కోవిడ్ సమయంలో 200 మంది చనిపోయారని గుర్తు చేశారు. యువత అనుక్షణం సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని డ్రగ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా హ్యాకథాన్‌లో పాల్గొన్న యువత, విద్యార్థులకు ప్రశంసా పత్రములు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో నజీబ్ (సిఈఓ), షేక్ సబ్బార్ (మేనేజర్), రజనీకాంత్ (కాకతీయ ప్రిన్సిపాల్ ) NN AI Solution ప్రతినిధులు, నిర్వాహకులు , టెక్నాలజీ నిపుణులు, విద్యార్థులు మరియు యువత పాల్గొన్నారు.




# బాలల రక్షణలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

- **పిల్లల హక్కులు, పోక్సోపై అవగాహన అవసరం**
- **విద్యార్థుల ప్రవర్తనా మార్పులను గుర్తించాలి**
- **మాదకద్రవ్యాల నివారణపై ప్రత్యేక దృష్టి : జిల్లా జడ్జి సునీత కుంచాల**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 19 (జనం సాక్షి):** పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, రక్షణతో పాటు వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల అన్నారు. మిషన్ బాల సురక్ష–శిక్షా, న్యాయ 2026లో భాగంగా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నామినేట్ చేసిన ఉపాధ్యాయులకు నిర్వహించిన ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని ఆమె అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (పోక్సో) కె.స్వప్నరాణి, డీసీపీ రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. పిల్లలు తల్లిదండ్రుల కంటే ఎక్కువ సమయం పాఠశాలలో గడుపుతున్నందున, వారు చెప్పుకోలేని సమస్యలను ఉపాధ్యాయులతో పంచుకునే అవకాశం ఉంటుందని జడ్జి తెలిపారు. బాలలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
పోక్సో చట్టం, పిల్లల హక్కులు, మంచి–చెడు స్పర్శ, భద్రతా ప్రమాణాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. పిల్లల్లో ఆకస్మిక ప్రవర్తనా మార్పులను గుర్తించి అవసరమైన సహాయం అందించాలని, పాఠశాలల్లో మాదకద్రవ్యాల ప్రభావాన్ని అరికట్టేందుకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగంపై అనుమానాలుంటే 112కు సమాచారం ఇవ్వాలని డీసీపీ రాంరెడ్డి తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లోని ఇతర సిబ్బందికి కూడా అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం సాధన సొసైటీ రూపొందించిన ‘జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్’ పోస్టర్‌ను జడ్జి ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయ, పోలీస్, విద్యాశాఖ అధికారులు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నామినేట్ చేసిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఢిల్ గ్యాంగ్‌రేప్, హత్యను తీవ్రంగా ఖండించిన ఐద్వా

**ముషీరాబాద్, సెప్టెంబర్ 19 (జనం సాక్షి):** దేశ రాజధాని ఢిల్లీలోని స్వరూప్ నగర్ ప్రాంతంలో 17 సంవత్సరాల మైనర్ బాలికపై నలుగురు దుర్మార్గులు కదులుతున్న వాహనంలో దారుణంగా అత్యాచారానికి పాల్పడి, కత్తులతో పొడిచి కిరాతకంగా హత్య చేసిన ఘటన సమాజాన్ని మరొక్కసారి ఉలిక్కిపడేలా చేసిందని, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అధ్యక్షురాలు ఆర్ అరుణ జ్యోతి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ..”దేశ రాజధాని నడిబొడ్డున 15 రోజుల క్రితం జరిగిన ఈ దారుణ ఘటన మహిళలు, బాలికలకు భద్రత లేదనడానికి స్పష్టమైన నిదర్శనం. మద్యం మత్తులో 4 గురు యువకులు (ముగ్గురు మైనర్లు) బాలికపై జరిపిన ఈ కిరాతక దాడిమానవత్వానికే మచ్చ అన్నారు. సెప్టెంబరు 1న జరిగిన ఈ ఘోరం 13 రోజుల తర్వాత గానీ వెలుగులోకి రాకపోవడం, బాలిక మృతదేహం వీధి కుక్కలకు ఆహారమయ్యేంత దుస్థితి ఏర్పడటం అత్యంత బాధాకరమని అన్నారు.
కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు మహిళల రక్షణ విషయంలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ఈ ఘటన రుజువు చేస్తోందనీ, అత్యాచారాల ఘటనల్లో మత్తు పదార్థాలు మద్యం ప్రధానంగా కారణమవుతున్నాయని అనేక దుర్ఘటనలు తెలియజేస్తున్నప్పటికీ వీటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలం అయిందనీ చెప్పారు. దీనివల్ల మైనర్లు కూడా ఇటువంటి నేర చరిత్రలోకి ఎక్కాల్సిన దుస్థితి ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి అలాగే చట్టాలు ఎన్ని ఉన్నా నేరస్థులకు భయం లేకపోవడానికి ఉన్న చట్టాలను సరిగా అమలు చేయకపోవడమే కారణమని ఆమె అన్నారు. ఈ దారుణానికి ఒడిగట్టిన ప్రధాన నిందితుడు శివమ్ అలియాస్ సుదామతో పాటు, పాల్గొన్న మైనర్ నిందితులందరికీ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# గురు నానక్ విద్యా సంస్థలో అట్టహాసంగా గ్రాడ్యుయేషన్, ప్లేస్‌మెంట్ డే వేడుకలు

- **1,172 మందికి పట్టాల ప్రదానం.. 946 మంది విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 19 (జనం సాక్షి) :** ఇబ్రహీంపట్నం సమీపంలోని గురు నానక్ ఇన్స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ అండ్ ప్లేస్‌మెంట్ డే వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో వివిధ యుజి, పిజి కోర్సులకు చెందిన 1,172 మంది విద్యార్థులు డిగ్రీ సర్టిఫికెట్లు అందుకున్నారు. అకడమిక్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సంస్థ వ్యవస్థాపక చైర్మన్ స్వర్గీయ సర్దార్ తవిందర్ సింగ్ కోహ్లీ స్మారకార్థం 26 బంగారు, వెండి పతకాలను అందజేశారు. అలాగే ఆన్–క్యాంపస్, ఆఫ్–క్యాంపస్ డ్రైవ్‌ల ద్వారా 169కి పైగా ప్రముఖ బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన 946 మంది విద్యార్థులకు నియామక పత్రాలను ప్రదానం చేశారు. ఇందులో ము–సిగ్మా సంస్థ నుంచి అత్యధికంగా రూ. 40 లక్షల వార్షిక ప్యాకేజీ లభించగా, ప్రొవిడెన్స్ గ్లోబల్ సెంటర్ ద్వారా రూ. 14 లక్షలు, రియల్ పేజ్ ద్వారా రూ. 10 లక్షల ప్యాకేజీలను విద్యార్థులు దక్కించుకున్నారు. టిసిఎస్, ఎల్టిఐ మైండ్ ట్రీ, హెచ్‌సిఎల్, సిటిఎస్, డెలాయిట్, ఇన్ఫోసిస్, ఈవై ఇండియా వంటి ప్రముఖ సంస్థల్లో విద్యార్థులు నియామకాలు పొందారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ‘లిరిక్ ఇండియా’ వైస్ ప్రెసిడెంట్ ఉ కంట్రీ హెచ్‌ఆర్ హెడ్ శ్రీలక్ష్మి కేసరి మాట్లాడుతూ.. విద్యార్థుల మార్కులు కార్పొరేట్ రంగానికి ద్వారాలు తెరుస్తాయని, అయితే సంస్థకు చేకూర్చే విలువ, వినయం, పని ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యాలే వారి వృత్తిపరమైన భవిష్యత్తును నిర్ణయిస్తాయని తెలిపారు. గురు నానక్ విద్యాసంస్థల వైస్–చైర్మన్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్య అనేది కేవలం కోడింగ్, యంత్రాలపై పట్టు సాధించడం మాత్రమే కాదని, ప్రజల జీవితాలను మెరుగుపరిచే ఆలోచనా శక్తిని పెంపొందించడమేనని పేర్కొన్నారు. జిఎన్ఐ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హెచ్.ఎస్. సైని మాట్లాడుతూ, గ్రాడ్యుయేషన్ తర్వాతే నిజమైన సవాళ్లు ప్రారంభమవుతాయని, నిరంతర నేర్చుకునే తత్వమే విజయానికి మార్గమని సూచించారు. ఈ కార్యక్రమంలో జిఎన్ఐటిసి డైరెక్టర్ డాక్టర్ ఎస్. శ్రీనాథ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ పి. పార్థసారథి, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ రిషి సయాల్, డీన్ డాక్టర్ ఎస్.వి. రంగనాయకులు, కన్వీనర్ డాక్టర్ తారిఖ్ హుస్సేన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్లాట్లలో అక్రమ ప్రవేశంపై సినీ నిర్మాతపై ఫిర్యాదు

- **సున్నం చెరువులో ప్లాట్ యజమానుల ఆరోపణ**
- **బ్లూ షీట్లు ఏర్పాటు చేశారని ఫిర్యాదు**
- **విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతి**



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** మాదాపూర్‌లోని సున్నం చెరువు ప్రాంతంలో ప్లాట్లలో అనుమతి లేకుండా ప్రవేశించి బ్లూ షీట్లు ఏర్పాటు చేశారంటూ సినీ నిర్మాత సి.కళ్యాణ్‌తో పాటు మరికొందరిపై ప్లాట్ యజమానులు మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీయాట్ సొసైటీ అధ్యక్షుడు శ్యామ్‌సింగ్ ఆధ్వర్యంలో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. గుట్టల బేగంపేట పరిధిలోని సర్వే నంబర్లు 12, 12ఏ, 13లో తమకు చట్టబద్ధంగా ప్లాట్లు ఉన్నాయని యజమానులు తెలిపారు. శనివారం సి.కళ్యాణ్, ప్రకాష్ ధారక్, ప్రేమలత తదితరులు తమ స్థలాల్లోకి ప్రవేశించి బ్లూ షీట్లు ఏర్పాటు చేశారని వారు ఆరోపించారు. తమను స్థలాల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.
ఇదే స్థలాలకు సంబంధించి గతంలోనూ ఆక్రమణ ప్రయత్నాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు యజమానులు తెలిపారు. కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న వివాదం మళ్లీ తెరపైకి రావడంతో ఆందోళన వ్యక్తం చేశారు. తమ కష్టార్జితంతో కొనుగోలు చేసిన ప్లాట్లకు రక్షణ కల్పించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఆరోపణలపై పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు తేలాల్సి ఉంది.

## తెలంగాణ ఆధునిక పోలీసింగ్‌పై బీహార్ డీఎస్పీలకు శిక్షణ



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** ఆర్బీవిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో బీహార్‌కు చెందిన 54 మంది డీఎస్పీలకు నిర్వహించిన ఆరు రోజుల ఇన్–సర్వీస్ శిక్షణ శనివారం ముగిసింది. సెప్టెంబర్ 14 నుంచి 19 వరకు జరిగిన ఈ శిక్షణలో సైబర్ క్రైమ్ దర్యాప్తు, డ్రగ్స్ నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్, కమాండ్ కంట్రోల్ వ్యవస్థలపై అవగాహన కల్పించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ డీఎస్పీలతో ఇంటరాక్షన్ నిర్వహించి ఆధునిక పోలీసింగ్‌లో సాంకేతికతతో పాటు ప్రజలతో సత్సంబంధాలు, మానవీయ దృక్పథం, వృత్తి నైపుణ్యం కీలకమని తెలిపారు. శిక్షణలో భాగంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఈగల్, భరోసా కేంద్రాలు, షీ టీమ్స్, గ్రేహౌండ్స్, సైబరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్లను డీఎస్పీలు సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఎడి వేమా శ్రీనివాసరెడ్డి, డిఎస్పిలు ఆదూరి శ్రీనివాసరావు, తిరుపతి పాల్గొన్నారు.

# అమీన్‌పూర్ రోడ్డు అభివృద్ధికై తగిన ప్రణాళికలు సిద్ధం : సిఎంసి కమిషనర్



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి–అమీన్‌పూర్ ప్రాంతాలకు కీలకమైన అమీన్‌పూర్ రోడ్డు అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, సిఎంసి, ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులతో కలిసి ఎన్‌హెచ్–65 నుంచి అమీన్‌పూర్ వరకు రోడ్డు విస్తరణ పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డు విస్తరణతో పాటు వంతెనల అనుసంధానం, డ్రైనేజీ సామర్థ్యం, వర్షపు నీటి నిర్వహణ, వరద నివారణ చర్యలపై అధికారులు చర్చించారు. బందంకొమ్ము చెరువు హద్దులపై తుది నిర్ణయం అనంతరం అక్కడ వంతెన నిర్మాణ ప్రతిపాదన రూపొందించి రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను సవరించనున్నట్లు తెలిపారు. మేజర్ నాలాలపై డ్రోన్ సర్వే, కన్సల్టెన్సీ అధ్యయనం నిర్వహించి బాక్స్ డ్రైన్లు, రిటైనింగ్ వాల్స్ వంటి పనులను ఎస్ఎన్‌డీపీ ఫేజ్–3లో చేర్చే అంశాన్ని పరిశీలించనున్నారు.
జ్యోతి థియేటర్ సమీపంలోని నల్లగండ్ల సర్‌ప్లస్ నాలాపై కల్వర్టు విస్తరణ, అమీన్‌పూర్ ఎస్‌టీపీ–సీవర్ మెయిన్ డైవర్షన్ అవసరాలను పరిశీలించా లని నిర్ణయించారు. అదే ప్రాంతంలో ఎఫ్‌ఓబీ, బస్‌షెల్టర్ ఏర్పాటుపై జాతీయ రహదారుల అధికారులతో సమన్వయం చేయనున్నారు. వినాయక్ నగర్ కల్వర్టు పరిసరాల్లో పారిశుద్ధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. రహదారి అనుసంధానం, డ్రైనేజీ, వరద నివారణ, ఇతర మౌలిక వసతుల పనులను శాఖల సమన్వయంతో వేగవంతం చేయాలని సూచించారు.

# ఎన్టీఆర్ నగర్‌లో ఒరిగిన భవనం నేలమట్టం




**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** గత రెండు రోజులుగా శేరిలింగంపల్లి ఎన్టీఆర్ నగర్ వాసులను కంటిమీద కునుకు లేకుండా చేసిన నాలుగు అంతస్థుల భవనాన్ని హైడ్రా అధికారులు శనివారం నేలమట్టం చేశారు. గురువారం ఎన్టీఆర్ నగర్ లోని నాలుగు అంతస్తుల భవనాన్ని ఆనుకొని ఉన్న రెండు వైపులా ఓవైపు భవనాన్ని కూల్చివేయగా మరోవైపు పవర్ బోర్ తవ్వకాలను ఏకకాలంలో జరపడంతో భూమిలో ఏర్పడిన ప్రకంపనలకు సదురు భవనం కుంగి పక్కనే ఉన్న మరో ఐదంతస్తుల భవనం పై ఒరగడంతో రెండు భవనాలు ప్రమాద కంటి కలను ముగించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో నిజానికి శుక్రవారం రాత్రికి దానిని పూర్తిగా నేలమట్టం చేయాల్సి ఉన్నా రాత్రివేళ ఏదైనా ఇబ్బంది తలెత్తితే అది మరో ప్రమాదానికి దారితీసే అవకాశాన్ని పరిశీలించిన అధికారులు శనివారం ఉదయంనుండి భవనం కూల్చివేతకు ఏర్పాట్లను పూర్తిచేసుకుని మధ్యాహ్నం తర్వాత బాహుబలి జెసిబి యంత్రాన్ని ఘటనాస్థలికి తెప్పించి మూడున్నర గంటల ప్రాంతంలో తగిన జాగ్రత్తలతో ఒరిగిన భవనం కూల్చివేతలను ప్రారంభించి రెండు గంటల పాటు శ్రమించి దానిని పూర్తిగా నేలమట్టం చేయడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఊపిరి పిలుచుకున్నారు. అయితే భవనం తాలూకా వ్యవహారంలో అసలు భవనానికి అనుమతులు లేవని, దాదాపు 40 గజాల స్థలంలోని నాలుగంతస్తులను నిర్మించడం బిల్డర్ అవినీతికి పరాకాష్టగా స్థానికులు అభివర్ణిస్తున్నారు. ఎన్టీఆర్ నగర్ పూర్తిగా అవినీతిమయమైన పునాదులపై నిర్మితమైందని, భవిష్యత్తులో ప్రమాదానికి కారణభూతంగా మారే ప్రతి భవనాన్ని పూర్తిగా కూల్చివేయాల్సిందేనని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి మరో ముందడుగు

- **రూ.39 లక్షలతో సత్యనారాయణ కాలనీలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం**




**హయత్‌నగర్, సెప్టెంబర్ 19 (జనం సాక్షి) :** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. స్థానిక ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో సత్యనారాయణ కాలనీలో రూ.39 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్, ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మధు యాష్కి గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర యాదవ్ కో–ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.
సత్యనారాయణ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ముఖ్యంగా కాలనీలోని అంతర్గత రహదారుల అభివృద్ధి ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందడంతో పాటు, కాలనీ మౌలిక వసతులు కూడా మెరుగుపడనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులను దశలవారీగా కొనసాగిస్తామని, స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన రహదారులు, ఇతర మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా డివిజన్‌ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.
స్థానిక కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ చేపడుతున్న రోడ్డు పనుల పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు.
ఈ కార్యక్రమంలో సత్యనారాయణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మైపాల్ రెడ్డి, జాల శ్రీనివాస్ యాదవ్, భాస్కర్ తో పాటు కాలనీ సభ్యులు, వెంకటాద్రి కాలనీ, ఆదర్శనగర్ కాలనీ, సాయిబాబా కాలనీకి చెందిన స్థానికులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మూడో రోజూ కొనసాగిన హామీల సాధనకు ఉద్యమకారుల దీక్షలు

**అల్వాల్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో అల్వాల్ తెలంగాణ అమరవీరుల శిబిరంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం మూడో రోజూ కొనసాగాయి. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో దీక్షలు నిర్వహిస్తున్నారు. మూడో రోజు దీక్షలో మాట్లూరి అనిల్‌కుమార్, మోతుకూరి మల్లేష్, జానకిరెడ్డి, శేరుపల్లి మల్లేష్, వెంకటేష్‌యాదవ్, సతీష్, రమేష్‌చారి, నరేష్, రాజేష్, అనిల్‌రాజు, నాగేశ్వర్‌రావు కూర్చున్నారు. దీక్షకు పట్లోళ్ల సురేందర్‌రెడ్డి, అనంతుల సంతోష్, సుధీర్, శోభన్‌బాబు, సంగమేశ్వర్, రమేష్, నరేష్ హాజరై సంఘీ భావం ప్రకటించారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం త్వరితగతిన అమలు చేసి, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# వరి సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించాలి

- **నీటి సమర్థ వినియోగంతో అధిక దిగుబడులు**
- **పాత విధానాలకు స్వస్తి పలకాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**
- **విజయవంతమైన రైతుల అనుభవాలను పంచుకోవాలి**
- **ఆధునిక సాగుపై విస్తృత అవగాహన కల్పించాలి**



**పెద్దపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** వరి సాగులో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి నీటిని సమర్థంగా పొదుపు చేస్తూ అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. రంగంపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘వరి వరహాలు’ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సా అండ్ రీప్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో నీటిని సమర్థంగా వినియోగించిన రైతులకు ఎకరాకు రూ.500 చొప్పున ప్రోత్సాహక చెక్కులను పంపిణీ చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు సంప్రదాయ సాగు విధానాల నుంచి ఆధునిక పద్ధతులకు మారాలని కలెక్టర్ సూచించారు. తక్కువ వనరులతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులను అందించి ప్రపంచ మార్కెట్‌తో పోటీ పడే స్థాయికి వ్యవసాయం ఎదగాలని ఆకాంక్షించారు. నీటి సమర్థ వినియోగంతో వృథాను అరికట్టి, పంటకు అవసరమైన సమయంలో తగిన నీటిని అందించవచ్చన్నారు. శాస్త్రీయ సాగు విధానాలతో చీడపీడలను నియంత్రించవచ్చని తెలిపారు.
కరీంనగర్ ప్రాంతంలో సుమారు 60 వేల ఎకరాల్లో రైతులను సంప్రదాయ సాగు నుంచి ఆధునిక పద్ధతుల వైపు మళ్లించేందుకు సా అండ్ రీప్ ఎన్‌జీవో చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు. ఆధునిక పద్ధతులతో విజయవంతమైన రైతులు తమ అనుభవాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానం, నీటి పొదుపు, శాస్త్రీయ సాగుపై వ్యవసాయ శాఖ, సంబంధిత సంస్థలు సమన్వయంతో అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఎన్‌జీవో ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# రోడ్ల పాలవుతున్న మిషన్ భగీరథ నీరు

## పైపుల లీకేజీలతో తాగునీటి వృథా

- **ట్యాప్‌లు లేక వీధుల్లోకి నీరు.. అధికారుల పర్యవేక్షణ కరువు**
- **ఇప్పటికైనా నీటి సంరక్షణకు చర్యలు**



**యాలాల, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** ఒకవైపు వర్షాభావం.. మరోవైపు అడుగంటుతున్న భూగర్భ జలాలు.. ఇంకోవైపు ఉన్న నీటినీ కాపాడుకోలేని నిర్లక్ష్యం. యాలాల మండలంలోని పలు గ్రామాల్లో కనిపిస్తున్న పరిస్థితి భవిష్యత్తు నీటి సంక్షోభానికి హెచ్చరికగా నిలుస్తోంది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన మిషన్ భగీరథ వ్యవస్థ ద్వారా వచ్చే తాగునీరు, గ్రామ పంచాయతీ బోర్ల నీరు రోడ్లపైకి చేరుతుంటే చూస్తూ ఊరుకోవడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు, పంచాయతీ నల్లాలకు ట్యాప్‌లు లేకపోవడం, పైపుల లీకేజీలు సకాలంలో అరికట్టకపోవడం వల్ల నీరు వృథాగా ప్రవహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం నీటి సరఫరా సమయంలో వందల లీటర్ల నీరు వీధుల్లోకి చేరుతున్నా శాశ్వత పరిష్కారం కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. నీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షించాల్సిన యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఎంతమేర పనిచేస్తోందన్నది సమాధానం లేని ప్రశ్నగా మారింది.
ఇప్పటికే పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, సకాలంలో వర్షాలు లేకపోవడం, అధికంగా బోర్లు వేయడం వంటి కారణాలతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోంది. చెరువులు, కుంటలు కూడా వేసవికి ముందే ఎండిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ప్రతి నీటి బొట్టును సంరక్షించాల్సింది పోయి తాగునీటినే రోడ్లపాలు చేయడం భవిష్యత్తు తరాలపై బాధ్యతారాహిత్యమే అవుతుంది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మేల్కొనాల్సిన సమయం వచ్చింది. ప్రతి గ్రామంలో పైపులైన్లు, నల్లాలు, పంచాయతీ బోర్లను తనిఖీ చేసి లీకేజీలను వెంటనే అరికట్టాలి. ట్యాప్‌లు లేని చోట ఏర్పాటు చేయాలి. నీటిని వృథా చేసే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. గ్రామసభల ద్వారా నీటి పొదుపుపై ప్రజల్లో చైతన్యం కల్పించాలి. నీటి సంరక్షణ ప్రభుత్వ యంత్రాంగం ఒక్కటిదే కాదు.. ప్రజల బాధ్యత కూడా. నేడు వృథా అవుతున్న ప్రతి నీటి బొట్టూ రేపటి దాహానికి మూలంగా మారకుండా ఇప్పుడే చర్యలు ప్రారంభించాలి.

## డంపింగ్ యార్డును ఎత్తేయాలి

- చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి




**హైదరాబాద్ (జనం సాక్షి) :** డంపింగ్ యార్డును ఎత్తేయాలని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి డిమాండ్ చేశారు. చైతన్య మహిళా సంఘం 32వ ఆవిర్భావం సందర్భంగా కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. వైయస్సార్ నగర్, ఈస్ట్ నందమూరి నగర్ ప్రాంతాలలో చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, కో కన్వీనర్ రాధా, శ్రీదేవి, హైదరాబాద్ కమిటీ సభ్యులు సావిత్రి, శ్రీదేవి, జయ, శారద పాల్గొన్నారు. సెప్టెంబర్ 24న నైస్ గార్డెన్ ఫంక్షన్ హాల్ బాలాజీ నగర్ హైదరాబాదులో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రజలు, ప్రజా సంఘాలు పౌర సమాజం, విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, డంపింగ్ యార్డ్ వలన ముఖ్యంగా మహిళలకి తీవ్ర అనారోగ్యాలు పసిపిల్లలకి అత్యంత ప్రమాదకరమైనటువంటి జబ్బులు వస్తాయని, వెంటనే ప్రభుత్వం దీన్ని ఎత్తేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కన్వీనర్ జ్యోతి మాట్లాడారు.

## ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్లకు రిపోర్టింగ్ గడువు పొడిగింపు

- 21వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు కాలేజీల్లో చేరేందుకు అవకాశం
- మేనేజ్‌మెంట్ కోటా ఎంబీబీఎస్/బీడీఎస్ ఫస్ట్ ఫేజ్ సీట్లకు కూడా గడువు పొడిగింపు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ అడ్మిషన్ల కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు కాలేజీల్లో చేరేందుకు ఉన్న గడువును కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కేఎన్ఆర్‌యూహెచ్‌ఎస్) పొడిగించింది. సెప్టెంబర్ 19 సాయంత్రం 4 గంటల వరకు ఉన్న గడువును సెప్టెంబర్ 21 సాయంత్రం 4 గంటల వరకు పొడిగించినట్లు యూనివర్సిటీ తెలిపింది. కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థుల్లో ఇప్పటివరకు చేరని వారు నిర్ణీత గడువులోగా తమకు సీట్లు కేటాయించిన మెడికల్ కాలేజీల్లో రిపోర్ట్ అయి అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. విద్యార్థుల రిపోర్టెడ్/నాట్ రిపోర్టెడ్ వివరాలను సంబంధిత మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్ సెప్టెంబర్ 21 సాయంత్రం 4:30 గంటలలోపు యూనివర్సిటీ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపింది. అలాగే, మేనేజ్‌మెంట్ కోటా కింద ఎంబీబీఎస్/బీడీఎస్ ఫస్ట్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులకు కూడా రిపోర్టింగ్ గడువును పొడిగించింది. సెప్టెంబర్ 19 సాయంత్రం 6 గంటల వరకు ఉన్న గడువును సెప్టెంబర్ 21 సాయంత్రం 6 గంటల వరకు పొడిగించింది. మేనేజ్‌మెంట్ కోటా ఫస్ట్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థుల్లో ఇప్పటివరకు చేరని వారు తమకు సీట్లు కేటాయించిన మెడికల్/డెంటల్ కాలేజీల్లో నిర్ణీత గడువులోగా రిపోర్ట్ అయి అడ్మిషన్ పూర్తి చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. విద్యార్థుల రిపోర్టెడ్/నాట్ రిపోర్టెడ్ వివరాలను సంబంధిత మెడికల్, డెంటల్ కాలేజీల ప్రిన్సిపాల్స్ సెప్టెంబర్ 21 సాయంత్రం 6:30 గంటలలోపు యూనివర్సిటీ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపింది.

## దక్షిణ మధ్య రైల్వేకు 6 అవార్డులు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** 27వ సీఐఐ నేషనల్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్-2026లో దక్షిణ మధ్య రైల్వే పలు అవార్డులను అందుకుంది. రైల్వే పరిధిలోని వివిధ యూనిట్లలో ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించడం, ఇంధన పరిరక్షణ చర్యలను అమలు చేయడం కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగా కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఈ అవార్డులను అందజేసింది. సెప్టెంబర్ 18న హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో నిర్వహించిన సీఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్‌లో అవార్డులను ప్రదానం చేశారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌కు 'అత్యుత్తమ ఇంధన సామర్థ్య యూనిట్' అవార్డు లభించింది. అలాగే లేఖా భవన్, లాలాగూడలోని సెంట్రల్ హాస్పిటల్, మౌలాలిలోని జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (జెడ్ఆర్‌టీఐ), రైల్ బోగీ కర్ఖానా/యాద్గిర్, సిగ్నల్ అండ్ టెలికాం వర్క్‌షాప్/మెట్టుగూడలను 'ఇంధన సామర్థ్య యూనిట్లు'గా గుర్తించారు. ఈ అవార్డులను హైదరాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ రామారావుతో పాటు ఇతర సీనియర్ రైల్వే అధికారులు అందుకున్నారు.

## ధన్వాడ మోడల్ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్



- బాలికలకు అస్వస్థత

**ధన్వాడ సెప్టెంబర్ 19 (జనం సాక్షి) :** ధన్వాడ మోడల్ హాస్టల్‌లో శనివారం ఫుడ్ పాయిజన్ కారణంగా పలువురు బాలికలు అస్వస్థతకు గురయ్యారు. ఉదయం హాస్టల్‌లో టిఫిన్ చేసిన అనంతరం విద్యార్థులు తరగతి గదులకు వెళ్లారు. రెండో పీరియడ్ తర్వాత కొందరు బాలికలకు కడుపునొప్పి, కళ్లు తిరిగి పడిపోవడం వంటి లక్షణాలు కనిపించడంతో ఉపాధ్యాయులు వెంటనే వారిని ధన్వాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన అనంతరం ఏడుగురు బాలికలను నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ధన్వాడ పీహెచ్‌సీలో కూడా పలువురు బాలికలకు వైద్య సిబ్బంది చికిత్స అందించారు. అత్యవసర చికిత్స అవసరమైన వారిని నారాయణపేట ఆస్పత్రికి తరలించామని, మిగిలిన వారికి పీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్నట్లు వైద్యాధికారి అనూష తెలిపారు. ప్రస్తుతం బాలికలు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు.

### విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉంది: కలెక్టర్ ప్రియాంక



ధన్వాడ మోడల్ స్కూల్ కాలేజ్ బాలికల హాస్టల్‌లో కలుషిత అల్పాహారం తిని పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై జిల్లా కలెక్టర్ ప్రియాంక తక్షణం స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఆర్డీవో రమేష్, తహసీల్దార్ సింధూజ, మండల ప్రత్యేక అధికారి సాల్మన్ సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. అవసరమైన వైద్యం కోసం కొందరిని ప్రభుత్వ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఘటనకు పూర్తి కారణాలు విచారణ అనంతరం వెల్లడవుతాయని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రాథమికంగా వంట ఏజెన్సీని రద్దు చేయడంతో పాటు కేర్‌టేకర్ వార్డెన్‌ను తొలగించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

# 'ఉడాన్' ద్వారా యువతకు సాంకేతిక నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు

- 5,500 మంది విద్యార్థులకు శిక్షణ.. 25 శిక్షణా కేంద్రాలు
- టాస్క్ - డెల్ టెక్నాలజీస్ ఒప్పందం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ యువతను నూతన సాంకేతిక రంగాల్లో తీర్చిదిద్ది, వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), ప్రముఖ దిగ్గజ సంస్థ 'డెల్ టెక్నాలజీస్' చేతులు కలిపాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో 'ఉడాన్' కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఇరు వర్గాలు ఒప్పందం (ఎవోయూ) కుదుర్చుకున్నాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు నాయకత్వంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ అవగాహన ఒప్పందం ఖరారైంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ రంగానికి చెందిన ఉన్నతాధికారులు, టాస్క్ ప్రతినిధులు, డెల్ టెక్నాలజీస్ బాధ్యులు మరియు భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉడాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసే 25 శిక్షణా కేంద్రాల ద్వారా 5,500 మంది విద్యార్థులకు 3 నెలల పాటు ప్రత్యేకానుభవంతో కూడిన శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్, నూతన సాంకేతికతలు, డిజిటల్ నైపుణ్యాలతో పాటు పారిశ్రామిక అవగాహన, ఉద్యోగార్హత ప్రతిభ పెంచేలా ఈ శిక్షణ సాగనుంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతకు సైతం నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. విద్య నైపుణ్య శిక్షణ పారిశ్రామిక అవగాహన ఉపాధి / అప్రెంటిస్‌షిప్ / పారిశ్రామికవేత్తగా రాణించడం డిగ్రీలు పూర్తయ్యే వరకు వేచి చూడకుండా, చదువుకుంటున్న సమయంలోనే పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాలు పెంపొందించడం ద్వారా యువతకు ఉద్యోగాలు, అప్రెంటిస్‌షిప్‌లు లేదా స్వయం ఉపాధి దిశగా మార్గం సుగమం చేయడం ఈ ఉడాన్ ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐఐటీ ఢిల్లీ కరికులమ్.. డెల్ టెక్నాలజీస్ సాంకేతిక సహకారంతో, ఐఐటీ ఢిల్లీ రూపొందించిన పాఠ్యాంశాల ఆధారంగా, డెల్ టెక్నాలజీస్ సాంకేతిక సహకారంతో ఈ శిక్షణ సాగుతుంది. జాతీయ స్థాయిలో డెల్ టెక్నాలజీస్, ఎఫ్ఐటిటి -ఐఐటీ ఢిల్లీ, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, జనరేషన్ ఇండియా ఫౌండేషన్‌లు కలిసి ఉడాన్ ద్వారా యువతకు భవిష్యత్ సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నాయి. రాష్ట్రంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు చొరవ, మార్గదర్శకత్వంతో ముందుకు సాగుతున్న ఈ బృహత్ కార్యక్రమం.. మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువత సరికొత్త టెక్నాలజీలపై పట్టు సాధించేందుకు అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోంది. కేవలం శిక్షణ సంఖ్యకే పరిమితం కాకుండా, యువతకు స్పష్టమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సమర్థవంతమైన స్కిల్లింగ్ వ్యవస్థను నిర్మించాలనే టాస్క్ లక్ష్యానికి ఈ భాగస్వామ్యం మరింత బలాన్ని చేకూరుస్తోంది. ఈ సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, స్టేట్ కౌన్సిల్ సెక్రటరీ రామ్, టాస్క్ సీఈఓ నితిన్ కుమార్ రెడ్డి, సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సీఓఓ నిఖిల్, డెల్ టెక్నాలజీస్ గవర్నమెంట్ సీనియర్ అకౌంట్ మేనేజర్ కె. కృష్ణ కిషోర్, డెల్ టెక్నాలజీస్ ఏపీజేసీ రీజినల్ సీఐఓ, హైదరాబాద్ సైట్ డైరెక్టర్ రమేష్ జంపుల తదితరులు పాల్గొన్నారు.

## జీపీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

**శాఖల మధ్య సమన్వయంతో సకాలంలో భవనాల నిర్మాణం పూర్తి చేయాలి: మంత్రి సీతక్క**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన గ్రామపంచాయతీ భవనాలు, గ్రామ సమైక్య భవనాలు, అంగన్వాడీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. సచివాలయంలో గ్రామపంచాయతీ భవనాలు, గ్రామ సమైక్య భవనాలు, అంగన్వాడీ భవనాల నిర్మాణ పనుల పురోగతిపై పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో స్పెషల్ సీఎస్ దాన కిశోర్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ శృతి ఓఝా, పంచాయతీరాజ్ ఈఎన్సీ జగదీష్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ భవన నిర్మాణ పనుల పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలో మొత్తం 9,745 గ్రామ సమైక్య భవనాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 534 భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మరో 6,141 భవనాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని, 3,070 భవనాల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కావాల్సి ఉందని మంత్రికి వివరించారు. పనులు ప్రారంభం కాని భవనాలకు సంబంధించి కారణాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను శాఖల మధ్య సమన్వయంతో పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని సూచించారు.

### 3,906 గ్రామపంచాయతీ భవనాలకు మంజూరు

రాష్ట్రంలో 3,906 గ్రామపంచాయతీ భవనాలు మంజూరు కాగా, ఇప్పటికే 444 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన 3,444 భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. గ్రామపంచాయతీ భవనాలు గ్రామీణ ప్రాంతాల్లో పరిపాలనకు కీలకమైన మౌలిక వసతులని పేర్కొన్న మంత్రి, నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ భవనాల నిర్మాణంపై మంత్రి సీతక్క ప్రత్యేకంగా సమీక్షించారు. రాష్ట్రంలో 2,313 అంగన్వాడీ భవనాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 200 భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన 2,113 భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్నందున వాటి నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ భవనాల నిర్మాణం పూర్తి చేసేందుకు అందుబాటులో ఉన్న అన్ని రకాల నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అంగన్వాడీ భవనాల నిర్మాణానికి అదనపు నిధులను సమీకరించేందుకు ఎంపీ లాడ్స్ నిధులను కూడా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నిర్ణయించారు. ఇందుకోసం రాష్ట్రంలోని ఎంపీలకు తానే లేఖలు రాయనున్నట్లు తెలిపారు.

## డిగ్రీ పూర్తి చేసేందుకు అంబేద్కర్ వర్సిటీ మరో అవకాశం

- పాత బ్యాచ్‌లకు 'ప్రత్యేక రీ-అడ్మిషన్'

**హైదరాబాద్ (జనంసాక్షి) :** డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ)లో గతంలో డిగ్రీలో చేరి, సకాలంలో కోర్సు పూర్తిచేయలేక బ్యాక్‌లాగ్స్ మిగిలిపోయిన వారు.. తమ డిగ్రీని పూర్తిచేసుకునేందుకు వీలుగా 'ప్రత్యేక రీ-అడ్మిషన్' అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు వర్సిటీ విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా. వై.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1990 నుంచి 2014 విద్యా సంవత్సరాల మధ్య అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత రుసుము చెల్లించి జూబ్లీహిల్స్‌లోని విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయంలో విద్యార్థి సేవల విభాగం (లర్నర్ సపోర్ట్ సర్వీసెస్) డైరెక్టర్‌ను నేరుగా సంప్రదించి రీ-అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. డిగ్రీ బ్యాక్‌లాగ్స్ పూర్తి చేసుకోవడానికి విద్యార్థులకు ఇదే చివరి అవకాశమని, భవిష్యత్తులో దీనిపై ఎలాంటి సడలింపులు ఉండవని వర్సిటీ స్పష్టం చేసింది. మరిన్ని వివరాల కోసం విద్యార్థులు వర్సిటీ టోల్ ఫ్రీ కాల్ సెంటర్ నంబర్ 18005990101 లేదా హెల్ప్ డెస్క్ నంబర్లు 040-23680222, 23680333, 23680444, 23680555 లలో సంప్రదించవచ్చని అధికారులు సూచించారు.

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు

- రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** 20వ రోజ్‌గార్ మేళాలో 51 వేలకు పైగా నియామక పత్రాల పంపిణీ- దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన ఉద్యోగ మేళా 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తోందని, ఇందులో యువత పాత్ర చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) దేశ యువతకు కొత్త కెరీర్ అవకాశాలకు మార్గం సుగమం చేస్తున్నాయని అన్నారు. కొత్త మార్కెట్లకు భారత వ్యాపారులు చేరుకోవడంతో పాటు, యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాల ఆధారంగా కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతను ఉద్దేశించి ప్రధాని ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా 51వేల మందికి నియామకపత్రాలు అందజేశారు. భారత్ ఇప్పటివరకు వివిధ దేశాలతో 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని ప్రధాని మోదీ తెలిపారు. వీటి ద్వారా భారత వ్యాపారులకు కొత్త భాగస్వామ్యాలు, కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అదే సమయంలో యువతకు కెరీర్‌లో కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయని పేర్కొన్నారు. భారత యువత నైపుణ్యాలు, ప్రతిభపై ప్రపంచ దేశాల్లో విశ్వాసం పెరుగుతోందని మోదీ అన్నారు. ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, యువత నుంచి ప్రపంచానికి భారీ అంచనాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ సేవల్లో చేరుతున్న యువత ప్రతి నిర్ణయంలోనూ దేశాన్ని అభివృద్ధి, స్వావలంబన దిశగా తీసుకెళ్లే ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. యువతకు ఇతర యువత పట్ల ప్రత్యేక బాధ్యత ఉందని చెప్పారు.

### బ్రిక్స్‌లోనూ యువత భాగస్వామ్యం

ఇటీవల ముగిసిన బ్రిక్స్ సదస్సును ప్రధాని మోదీ ప్రస్తావించారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకూడదని అన్నారు. భారత పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువత కూడా ఈ భాగస్వామ్యంలో చురుకైన భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో దేశ యువత తమ నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.ప్రతి రంగంలోనూ శరవేగంగా మార్పులు జరుగుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. 'నిరంతరం నేర్చుకుంటూనే విరు ఈ స్థాయికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి మళ్లీ కొత్త విషయాలు నేర్చుకునే సరికొత్త ప్రయాణం ప్రారంభమవుతుంది. విరు ఎల్లప్పుడూ వి నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. కొత్త సాంకేతికతను, కొత్త వ్యవస్థలను అర్థం చేసుకోవాలి. 'మిషన్ కర్మయోగి'ఈ లక్ష్యాన్ని చేరుకోవటంలో వికు సాయపడుతుంది. ప్రభుత్వం అసలైన బలం పౌరులకు దానిపై ఉన్న నమ్మకమే. ఆ నమ్మకం ఎలా వస్తుందంటే.. పౌరులకు ప్రభుత్వంతో ఎలాంటి అనుభవం ఎదురైందనే దాన్ని వల్ల వస్తుంది. ప్రభుత్వ సేవలో మన తారకమంత్రం ఒక్కటే కావాలి. 'నాగరిక్ దేవో భవ'. పౌరులకు సేవ చేయడమంటే దేశానికి సేవ చేయడమే. వి పనితీరు వల్ల ఏ పౌరుడి జీవితమైనా సులభతరమైతే, అప్పుడే వి విజయం మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటుంది' అని ప్రధాన మోదీ పేర్కొన్నారు.

### 51 వేల మందికి పైగా నియామక పత్రాలు

20వ రోజ్‌గార్ మేళాలో భాగంగా 51 వేల మందికి పైగా కొత్తగా నియమితులైన యువతకు నియామక పత్రాలు అందించారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులు రెవెన్యూ విభాగం, రైల్వేలు, హోం వ్యవహారాలు, ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు, రక్షణ తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో విధుల్లో చేరనున్నారు. ఈ 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి ఇప్పటివరకు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సుమారు 12.75 లక్షల మంది యువతకు నియామక పత్రాలు అందినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370